# జర్మనీయం

- మధురవాణి





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 78



## దోసెడు మంచు పూలు.. గుప్పెడు గుండె ఊసులు..

మనం ఎవరింటికైనా వెళ్ళినా, ఎవరైనా మనింటికి వచ్చినా గుమ్మంలోనే ఒకరినొకరు పరిచయం చేసుకోవడం సంప్రదాయం కదా! అందుకనీ...

"నమస్తే అండీ."

"నమస్తే.. ఎవరమ్మా నువ్వు?"

"నేనండీ. మధురని.."

"మధురా.. పేరు ఎక్కడో విన్నట్టుందే.."

"మరేనండీ.. ఇదివరలో ఇక్కడే కౌముది గడపలో కూర్చుని మీకు కొన్నికథలు చెప్పాను కదండీ.."

"ఆఆ.. గుర్తొచ్చింది.. ఏంటమ్మా సంగతి.. ఇలా వచ్చావేం?"

"మరేంలేదండీ.. తీరిగ్గా కూర్చుని కాసేపు మీతో సరదాగా మాదేశం కబుర్లు చెప్పుదామని వచ్చానండీ.."

"మీదేశమా.. నువ్వు ఎక్కడ ఉంటావేంటి?"

"నేను జర్మనీలో ఉంటానండీ. అప్పుడే పావొంతుపైన జీవితం ఇక్కడే గడిచిపోయిందండీమరి.. అందుకే మాదేశం అనేసాను."

"ఏంకబుర్లు చెప్తావేంటి.. ఏదో దోసెడూ గుప్పెడూ అంటున్నావే?"

"మరేనండీ.. మన ఆంధ్రదేశంనుంచీ ఈదేశానికి ఎగిరొచ్చాక ఇన్నేళ్ళలో ఎన్నెన్ని మంచుపూలవానల్లో తడిసానో కదండీ.. ఆ జ్ఞాపకాల ఊసుల్ని నెలకోదోసెడైనా నింపుకొచ్చి మీ అందరితో పంచుకుందామనీ.."

"ఓహో.. మంచిపనే.. మరి మమ్మల్నేం చెయ్యమన్నావిప్పుడు?"

"మీరేం చేయక్కర్లేదండీ. ఎంచక్కా వేడిగా కాఫీనో, టీనో పక్కనపెట్టుకుని, వెచ్చగా చెంపన చేతులు పెట్టుక్కూర్చుని హాయిగా నేచెప్పే కబుర్లన్నీటికీ ఊకొడితే చాలు.. అదే మహాభాగ్యం.."

"ఊ.. కానివ్వు మరి.. శుభం.. నీదేఆలస్యం!"

:-)

# మంచుపూల మధుమాసం



అమ్మ వేసిన సంక్రాంతి ముగ్గు..
ముురిపెంగా పెంచిన ముద్దబంతి..

జనవరి నెల వచ్చిందంటే ఉదయాన్నే కొంచెం చలిచలిగా, చుట్టూ మసక మసగ్గా కమ్మేసిన పల్చటి మంచు తెరలతో, మంచు ముత్యాలు పొదిగిన బంగారు పువ్వుల్లా మెరిసిపోయే విరగబూసిన ముద్దబంతులతో, ఒకరి వాకిలితో మరొకరి వాకిలి పోటీ పడుతున్నట్టు అందరి ముంగిళ్ళలోనూ కొలువు దీరిన అందమైన సంక్రాంతి ముగ్గులూ, భోగి మంటలూ, పండుగ సెలవులూ, సంబరాలూ, జనవరి ఇరవయ్యారు గణతంత్ర దినోత్సవ వేడుకలు.. చిన్నప్పటి నుంచీ తెలిసినవి ఇవే! అయితే జర్మనీకి వచ్చాక జనవరి జ్ఞాపకాలన్నీ మారిపోయాయి. మనకి అక్కడ ఆహ్లాదంగా అనిపించే లేత చలి గాలుల స్థానంలో ఇక్కడ ఉధృతమైన హిమపాతాలు, మంచు తుఫాన్లూ వగైరా పరిచయం అయ్యాయి. మనం ఎండాకాలం వచ్చేస్తోందని ఒక పక్క ఉసూరుమంటూనే ఇంకో పక్కన వేసవి కాలం తన వెంట తీసుకొచ్చే మల్లెపూలు, మామిడి పళ్ళు , తాటి ముంజెలు లాంటి తియ్యటి తాయిలాల గురించి ఉవ్విళ్ళూరుతుంటాం కదా.. ఇక్కడ వీళ్ళు కూడా అంతే అమ్మో చలికాలం వచ్చేస్తోంది.. బాబోయ్ చలి.. అని ఓ పక్క కలవరపడుతూనే ఇంకో పక్కన మంచు ఎప్పుడు కురుస్తుందా అని ఎదురు చూపులూ, మంచులో స్కేటింగులు, స్కీయింగులూ వగైరా ఆటలంటూ ఉత్సాహంగా ఎదురు చూస్తుంటారు.

ఇక్కడ డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్ని చలి విశ్వరూపం చూపించే శీతాకాలంగా చెప్పుకోవచ్చు. డిసెంబరులో కురిసే మంచు ఎలా ఉంటుందంటే ఆకాశం నుంచి సుతి మెత్తగా రాలిపడుతున్న వెన్నెల పొడి లాగానో, సనసన్నటి తెల్ల చామంతి పూరేకుల్నో, పల్చటి తెల్ల గులాబీ రెక్కల్నో బుట్టల్లో నింపి ఆకాశం పై నుంచి భూమ్మీదకి వెదజల్లుతున్నట్టుగా మెత్తగా సుతారంగా కురుస్తుంటుంది. ఒకోసారి అలా కురిసిన మంచంతా తెల్లారేపాటికి కరిగి నీరైపోతుంది లేదా సున్నా డిగ్రీలకి అటూ ఇటూగా ఉన్న ఉష్ణోగ్రతల మూలంగా కరిగిపోకుండా కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుంది. క్రిస్మస్ పండగ రోజులు వచ్చేసరికి కురిసిన మంచంతా కరిగిపోకుండా చుట్టూతా తెలతెల్లటి దూదిలా పేరుకుపోతే ఈ ఏడాది 'వైట్ క్రిస్మస్' వచ్చిందంటూ అందరూ బోల్డు సంబరపడిపోతారు.

డిసెంబరు నుంచీ జనవరిలోకి వచ్చేసరికి చలి తీవ్రత బాగా పెరిగి ఉష్ణోగ్రతలు మైనసుల్లోకి పడిపోతాయి. అప్పటి దాకా పేరుకుపోయిన మెత్తటి మంచు కాస్తా గట్టిపడిపోతుంది. ఒకో పూట మంచు కురుస్తూ, కాసేపటికి మెల్లగా కరిగిపోతూ, మళ్ళీ కాసేపట్లో ఆ కరిగిన నీరంతా కొద్ది కొద్దిగా ఘనీభవిస్తూ మంచు ముక్కల్లానో, పల్చటి గాజు పొరల్లానో మారిపోతుంటుంది. ఇలాంటి

వాతావరణంలో ఒకోసారి రోడ్డు మీద నడిచేప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇంకంతే సంగతులు.. జారిపడిపోయి కాళ్ళో, చేతులో విరగ్గొట్టేసుకోగలం. ముఖ్యంగా బూట్లు కేవలం వెచ్చగా ఉంటే సరిపోదు. అడుగు భాగం ఇలాంటి జారే నేల మీద బాగా పట్టు కలిగి ఉండేలా చూసుకోవాలి.

అసలూ.. ఇలా మన కంటికి మామూలు వర్షపు తడిలా కనిపిస్తూ, వాస్తవానికి మాత్రం గడ్డ కట్టి పారదర్శకంగా గాజులా ఏర్పడి మనల్ని బోల్తా కొట్టించేసే ఈ మంచు పొరలకి ఎండమావుల్లాగా 'మంచుమావులు' అని పేరు పెట్టేస్తే ఎలా ఉంటుందంటారు? మరి ఉట్టి నీళ్ళ తడేమోనేమోలే అనుకునేలా మనల్ని భ్రమలో పడేసే మంచు కదా.. అందుకే ఆ పేరు పెట్టేసానన్నమాట! ;-)

మా కాంపస్ లో యూనివర్సిటీ భవనాలన్నీ అందమైన ప్రకృతి ఒడిలో చాలా ప్రశాంత వాతావరణంలో ఉంటాయి. లోపల ప్రయోగశాలల్లో చేసే పరిశోధనలు ఎంత బుర్ర వేడెక్కించినా మధ్య మధ్యలో చుట్టూ ఉండే పెద్ద పెద్ద కిటికీల్లోంచి బయటికి చూస్తూ ఉంటే ప్రాణానికి హాయిగా ఉంటుంది. నేను ఎక్కువ పని చేసుకునే చోటు పక్కనే ఉండే కిటికీలోనుంచి చూస్తే విశాలమైన మైదానం, చుట్టూ బోల్డన్ని పెద్ద పెద్ద చెట్లూ కనిపిస్తుంటాయి. ఎండాకాలంలో పసుపు రంగు గడ్డిపూలతో నిండిపోయి, శీతాకాలంలో తెల్లటి మంచుతో నిండిపోయి, ఆ రెండూ లేనప్పుడు ఆకుపచ్చటి గడ్డితో నిండిపోయి భలే అందంగా మెరిసిపోతూ ఉంటుందా మైదానం.



కిటికీలో విరిసిన హరివిల్లు..

వర్షం పడ్డప్పుడు ఎన్ని సార్లు ఆ కిటికీలోంచి ఇంద్రధనస్సులని చూసానో! నిజానికి ఒకేసారి రెండ్రెండు ఇంద్రధనస్సులు వస్తాయి ఎప్పుడూ.. రెండోది కాస్త పల్చగా ఏర్పడటం వల్ల తొందరగా మాయమైపోతుంటుంది. అదేంటో చిత్రం.. ఎప్పుడూ సరిగ్గా కొలతలు వేసి గీసినట్టు ఒకే చోట వస్తుంది హరివిల్లు.

ఒకసారి మా కొలీగ్ ఒక అమ్మాయి చెప్పింది. వాళ్ళకి చిన్నప్పుడు ఇంద్రధనస్సు గురించి చిన్న కథలా చెప్పే వాళ్ళట. అదేంటంటే, ఆకాశంలో అర్ధచంద్రాకారంలో ఏర్పడిన హరివిల్లు రెండు కొసలూ భూమిలో నుంచి వచ్చినట్టే కనిపిస్తుంది కదా.. ఆ హరివిల్లు భూమిలో పాతుకుపోయిన ప్రదేశానికి వెళ్ళి అక్కడ నేలలో తవ్వితే బోల్డన్ని విలువైన నిధులు దొరుకుతాయట. తను అలా చెప్పగానే నేను కళ్ళింతింత చేసుకుని "నిజమా.. భలే కదా.." అని అరిచేసా బోల్డు ఉత్సాహంగా. తనేమో ఒకటే నవ్వు. ఇదో.. పెద్దవాళ్ళం అయిపోయాక ఇదే చిక్కు.



పసిడి పూల వనమా.. మంచు పూల గానమా..

మాయలూ, మంత్రాలూ, మేజిక్కులూ అన్నీ ఉట్టిదే అని పాఠాలు నేర్చేసుకుని చిన్నప్పటిలా హాయిగా చెప్పిందల్లా నమ్మేసి సంబరపడిపోడం కుదరదు.. ప్చ్..!



**మధుర జ్ఞాపకాల కొలను లోతెంతో!**

ఈ మైదానానికి ఇంకో పక్కన ఒక చిన్న నీటి కొలను ఉంటుంది. దాని పక్కనే నడవడానికి వీలయ్యేలా ఒక చిన్న కాలిబాట, ఆ దారిలో అక్కడక్కడా ఆ నీళ్ళ కొలనుని చూస్తూ కూర్చునేలా కుర్చీలు ఉంటాయి. అన్నీ రకాల ఋతువుల రంగుల్లో ఎన్నో ఉదయాలూ, మధ్యాహ్నాలూ, సాయంత్రాల్లో ఈ కొలను గట్టున మూట గట్టుకున్న జ్ఞాపకాలు ఎన్నో! కొలనుకి అవతల పక్కన ఉన్న రహదారి మీద అప్పుడప్పుడూ రయ్యిమని పరిగెడుతుండే కార్ల శబ్దాలు, నీళ్ళల్లో ఈదుతూ బాతులు చేసే రెక్కల చప్పుళ్ళు మినహాయిస్తే ఎప్పుడూ నిశ్శబ్దంగానే ఉంటుంది. ఎన్నో రకరకాల పరిస్థితుల్లో, సందర్భాల్లో, రకరకాల సమస్యలతోనూ, ఆలోచనలతోనూ, కబుర్లతోనూ, నవ్వులతోనూ ఈ కొలను గట్టున స్నేహితులతో గడిపిన రోజులన్నీ ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాలే!

ఒక్కదాన్నే నిశ్శబ్దంగా కూర్చుని చెవుల్లో ఏ ఇళయరాజా పాటలో పెట్టుకు వింటూ ఆ నీళ్ళల్లో తెగ తిరిగేస్తూ ఆడుకుంటున్న చేపల్ని, నీటి మీద వాలే రంగురంగుల తూనీగల్ని, అప్పుడప్పుడూ ఎగిరే కప్పల్ని, అటుగా వాళ్ళ యజమానులతో కలిసి వాకింగ్ కి వచ్చే రకరకాల కుక్కపిల్లలు చేసే అల్లరి చేష్టలనీ, అప్పుడప్పుడూ ఆకాశం నుంచీ ఊడిపడి ఆ పచ్చటి నీళ్ళల్లో జలకాలాడుతుండే చందమామనీ... ఇలా అన్నీటినీ చూస్తూ అక్కడ గడపడం ఎంత బాగుంటుందో!

చలికాలంలో ఈ కొలను గట్టు మీద కూర్చునేంత ధైర్యం చెయ్యలేనులే గానీ కాసేపలా నిలబడి చూసి వచ్చేస్తుంటాను. ఒకోసారి కొలనులో నీళ్ళ మీద పైన కొంచెమే గడ్డ కట్టేసి నీళ్ళల్లో మంచు ముక్కలు ముక్కలుగా తేలుతూ కనిపిస్తుంది. ఒకోసారి నీళ్ళ మీద తేలుతున్న తెల్లటి దూదిలా పరుచుకుని కనిపిస్తుంది. మరోసారేమో పూర్తిగా గడ్డ కట్టేసిన కొలను మీద మళ్ళీ రాలిన సన్నటి మంచు రవ్వలతో తెల్లగా పిండారబోసినట్టు ఉంటుంది. ఆకాశం నుంచి దట్టంగా రాలుతున్న మంచు కొలనులో నీళ్ళ మీద పడి కరిగిపోతుంటే కూడా చూడటానికి భలే సరదాగా ఉంటుంది.

ఎండాకాలం అంటే ఎంచక్కా ఎన్నెన్ని రంగులో.. అదే చలికాలం అంటే సరదా ఏముందీ గడగడా వణికించడం తప్ప.. ఎటు చూసినా ఒక్క తెలుపేగా ఎప్పుడూ.. అని అనుకోడం సరి కాదేమో అనిపిస్తుంది నాకైతే. పేరుకి ఒక్క మంచే అయినా ఆ ఒక్క తెలుపులోనే దాగిన ఎన్నెన్ని రంగులనో, ఎన్నెన్ని రూపాలనో చిత్రిస్తూ కనువిందు చేస్తుంది. ఓ పక్క చురుక్కుమనిపిస్తూనే మరో పక్క చూస్తున్నకొద్దీ ఇంకాస్త కావాలనిపించేలా మురిపిస్తుంటుంది.. మాయ చేసే మంచు! :-)

మా క్యాంపస్ లోనే ఒక చిన్న కిండర్ గార్డెన్ ఉంది. మా చుట్టుపక్కల డిపార్ట్మెంట్స్ లోని కొలీగ్స్ పిల్లలు అందులో ఉంటారు. అప్పుడప్పుడూ తల్లిదండ్రులు కూడా పిల్లలందరితో కలిసి రకరకాల కార్యక్రమాలు, ఆటలూ పాటల్లో పాల్గొంటూ ఉంటారు. ఒకసారి మా కొలీగ్ ఒకావిడ నన్నూ, ఇంకో ఇద్దరు ఇండియన్ కొలీగ్స్ ని కిండర్ గార్డెన్ కి ఆహ్వానించింది. పిల్లలకి గ్లోబుని చూపిస్తూ ప్రపంచంలో ఇన్ని రకాల దేశాలు, ప్రదేశాలు, మనుషులు, సంప్రదాయాలు ఉంటాయని నేర్పించే పాఠంలో భాగంగా మమ్మల్ని పరిచయం చేస్తూ మన దేశం గురించి వాళ్ళకి చెప్పారు. పిల్లలతో కలిసి వాళ్ళ ముందే ఏదైనా భారతీయ వంటలు వండగలిగితే బోల్డు సంతోషిస్తామన్నారు. అదెంత భాగ్యం అని చెప్పి మేము పిల్లలతో కలిసి వాళ్ళ కిండర్ గార్డెన్ కిచెన్ లోనే పాయసం, నిమ్మకాయ పులిహోర వండి పిల్లలందరితో పాటు కలిసి తిన్నాం. భోజనాలు అయ్యాక ఏదైనా మీ ఆటలూ, పాటలూ కూడా చెప్పండి అని అడిగితే జర్మన్ పిల్లలందరి చేతా 'చిట్టి చిలకమ్మా అమ్మ కొట్టిందా..' అంటూ వల్లె వేయించాం. ఒకరి చొక్కా ఒకరు పట్టుకుని అందరం గొలుసులా తయారై 'ఛుక్ ఛుక్ రైలూ వస్తుంది..' అంటూ ఆటలు ఆడించాం. ఆ రోజు చాలా సరదాగా గడిచింది. పిల్లలందరూ కూడా ఉత్సాహంగా కొత్త రకమైన తిండి ఆటలు, పాటల గురించి తెలుసుకుని ఇవన్నీ ఏ దేశం నుంచీ వచ్చాయో గ్లోబు చూసి గుర్తు పెట్టుకున్నారు.


మన తెలుగు వంటలు చే(చూ)స్తున్న జర్మన్ బుడతలు.

ఇక చలికాలం వస్తే మనకేమో అమ్మో ఇంత చలిలో ఆటలా అనిపిస్తుంది గానీ ఆ బుడతలు మాత్రం ఎంచక్కా పై నుంచి కిందదాకా వెచ్చగా కోట్లూ, గ్లవ్స్ లాంటివన్నీ తొడుక్కుని గంటల కొద్దీ మంచులో జారుతూ దొర్లుతూ ఆడుతుంటారు. రకరకాల ఐస్ బొమ్మలు చేసి తీసుకొచ్చి బయట చెట్ల కొమ్మలకి వేళాడగట్టడం, అంత తక్కువ ఉష్ణోగ్రతల మూలంగా ఆ మంచుబొమ్మలు కరిగిపోకుండా కొన్ని రోజుల పాటు అలానే ఉంటే వాటిని చూసి సరదా పడటం.. వాళ్ళనీ, వాళ్ళ ఆటల్నీ చూస్తుంటే భలే ముచ్చటేస్తుంది. చిన్నప్పుడు ఎలాగైతే మనం ఇసుక కుప్పల మీద నుంచి జారుతూ రకరకాల ఇసుక గూళ్ళు కడుతూ ఆడుకునేవాళ్ళమో ఇక్కడ చిన్నపిల్లలందరూ మెత్తటి మంచు మీద జారుతూ,

పిల్లలు తయారు చేసుకున్న మంచు బొమ్మలు



మంచుతో రకరకాల బొమ్మలు చేస్తూ, అరుస్తూ, కేరింతలు కొడుతూ, అల్లరి చేస్తూ చలి సంగతే పట్టనట్టు హాయిగా ఆడుకుంటూ ఉంటారు.





ఒకోసారి ఆలోచిస్తే ఎంత విభిన్నమైన సంస్కృతులు, సంప్రదాయాలూ అయినా మనుషులు అందరిదీ ఒకటే

**పడతాం.. లేస్తాం.. ఆడతాం.. పాడతాం..**

మనసేమో అనిపిస్తుంటుంది. రోజూ ఆ పిల్లల్ని చూస్తున్నప్పుడల్లా వాళ్ళ కళ్ళల్లో నిండైన సంతోషం, చుట్టూ ఉన్న లోకం గురించి ఏ మాత్రం పట్టని పరధ్యానం, ఇలా చెంగు చెంగున ఎగిరి దూకితే పడిపోతామేమోనన్న భయాలూ ఆలోచనలేవీ లేని అమాయకత్వం, క్షణం కాలు నిలవకుండా గలగలా పారే సెలయేరు లాంటి ఉరిమే ఉత్సాహం... ఈ తెల్లటి మంచులో అంత కన్నా స్వచ్ఛమైన తెల్లని పువ్వుల్లాంటి చిన్నారుల బాల్యపు సంబరాన్ని గమనిస్తుంటే దేశం, వేషం, భాష, రంగూ, రూపూ వేరైనా మనుషులం అందరం ఒకటే కదా అనిపిస్తుంది. బయటికి ఎన్నెన్ని రకాల ఆకృతుల్లో కనపడినా తరచి చూస్తే అంతర్లీనంగా అందరిలోనూ అదే మనిషి తత్త్వం గోచరిస్తుంది కదూ!

**నలుగురు ఆడే ఆటలు మాకు నచ్చవు.. మా దారే వేరు!**





# హిమగిరిసొగసులు.. మురిపించునుమనసులు..

**ఆకాశమంతా మల్లెపువ్వు లాంటి తెల్లటి తెలుపు..** అక్కడ నుంచి అలవోకగా రాలిపడే మంచు పూలు తెలుపు.. నేల మీదున్న చెట్లూ, పుట్టూ, ఇళ్ళూ, వీధులూ అన్నీ మంచు పూత పూసుకుని మెరిసిపోయే తెలుపు.. ఎటు చూసినా లోకమంతా శాంతి గీతం ఆలపిస్తోందా అన్నట్టు ధవళ వర్ణ కాంతులే!

మనం నడిచే దారుల్లో, కార్లు నడిచే రోడ్ల పైన పేరుకుపోయే మంచుని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూనే ఉంటారు కానీ మరీ అంత కుప్పలు తెప్పలుగా మంచు కురుస్తున్నప్పుడు సైకిళ్ళు, కార్ల మీద వెళ్ళడం కాస్త అవస్థ అనే చెప్పాలి. మనం వెచ్చగా ఇంట్లో దాక్కుని కిటికీల్లోంచి బయటికి చూసినా, తల నుంచి పాదాల దాకా వెచ్చటి ఉన్ని దుస్తుల్లో దాచేసుకుని బయటకొచ్చి చూస్తేనో మాత్రం ఈ తెలుపు నలుపు వర్ణ చిత్రం బహుముచ్చట గొలుపుతుంది.

ఫిబ్రవరి నెల వచ్చేసరికి చలి బాగా ముదిరి ఉష్ణోగ్రతలు మైనసుల్లోకి దిగిపోయి చిన్న చిన్న కొలనులు, చెరువులు లాంటివన్నీ పూర్తిగా గడ్డ కట్టుకుపోయి నున్నగా మంచుతో చేసిన గచ్చులా తయారైపోతాయి. అలా గడ్డ కట్టిన వాటి మీద ఐస్ స్కేటింగ్, ఐస్ హాకీ ఆడుకోడానికి చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. మామూలుగా ఇలాంటి ఆటల కోసం ఉన్న ప్లే గ్రౌండ్లలో కాకుండా ఇలా ఆరుబయట గడ్డ కట్టుకుపోయిన చెరువులు, కొలనుల మీద ఆడుకోవడం బోల్డు సరదా జనాలకి. పైగా ఇలాంటి ఐస్ ఉండేది కేవలం కొన్ని రోజులే కాబట్టి ఈ అవకాశాన్ని ఏ మాత్రం వదులుకోడానికి ఇష్టపడరు. ముఖ్యంగా ఇలాంటి ఆటలు వయసులో ఉన్న పిల్లలు ఎక్కువ ఆడుతూ కనిపిస్తారు. మంచులో జారుతూ, దొర్లుతూ పడుతూ లేస్తూ ఆడుకునే చిన్నపిల్లలది ఏమీ తెలీని అమాయకత్వం అయితే, మనకి ఇష్టమైంది, మనసుకి నచ్చింది ఏదైనా ముందూ వెనకా ఆలోచించకుండా నదురూ బెదురూ లేకుండా ధైర్యంగా చేసుకు వెళ్ళిపోవడమే అన్నట్టు మహా దుడుకుగా ఉంటారు ఈ వయసు పిల్లలు. ఒకోసారి కాలేజీలో క్లాసులు ఉండే టైములో కూడా ఎంచక్కా వాటికి ఎగనామం పెట్టేసి జర్రున స్కేటింగ్ చేసేస్తూ అరుపులు కేకలతో ఉత్సాహంగా మంచు మీద ఆడుకుంటూ కనిపిస్తుంటారు. వాళ్ళని చూస్తుంటే మన దగ్గర కాలేజీల్లో క్లాసులు ఎగ్గొట్టి క్రికెట్ ఆడుకోడానికి వెళ్ళిపోయే అబ్బాయిలు గుర్తొస్తుంటారు.. :-)



ఘనీభవించిన కొలను మీద హుషారుగా ఆటలాడుతున్న పడుచు పిల్లలు, పడుచు పెద్దలు.

జర్మనీలో సాధారణంగా ఏ ఉద్యోగం చేసేవాళ్ళైనా మామూలుగా గవర్నమెంటుకి కట్టే టాక్స్ తో పాటుగా తాము వయసైపోయి సర్వీసు నుంచి రిటైర్ అయ్యాక వచ్చే పెన్షన్ కోసం ఉద్యోగాలు చేసినంత కాలం కొంత మొత్తంలో డబ్బులు కడుతూనే ఉంటారు. ఒకవేళ

ఏదైనా కారణం చేత మధ్యలో చేస్తున్న ఉద్యోగం పోతే మళ్ళీ ఇంకో కొత్త ఉద్యోగం సంపాదించుకోవడం కోసం మనకున్న కెరీర్ స్కిల్స్ మెరుగు పరచుకోవడానికి అవసరమైన రకరకాల ప్రొఫెషనల్ కోర్సులు, కౌన్సిలింగులు వగైరా వాటన్నీటికి ఎంప్లాయిమెంట్ ఆఫీసు వాళ్ళే ఫీజులు కట్టి మరీ సపోర్ట్ చేస్తారు. అంతే కాదు.. ముందున్న ఉద్యోగం చేసేప్పుడు గవర్నమెంటుకి టాక్సులు కట్టినందుకు గానూ మళ్ళీ కొత్త ఉద్యోగం తెచ్చుకునేలోపు కొన్నాళ్ళ పాటు నెల నెలా పాత ఉద్యోగంలో వచ్చిన జీతంలో అరవై శాతం ఇస్తారు. ఇక జర్మనీలో ఉండే ప్రతీ వ్యక్తికి ఆరోగ్య భీమా తప్పనిసరి. ఇలాంటి కారణాల వల్ల భవిష్యత్తు మీద బెంగలూ, భయాలూ, ముసలితనం వచ్చాక నా పరిస్థితి ఏంటి అన్న ఆందోళన, సామాజిక అభద్రతా భావం వీళ్ళల్లో మచ్చుకైనా కనిపించదు.

ఒకసారి మా కొలీగ్స్ అందరం కలిసి సిటీకి దూరంగా కొండల్లో కోనల్లో నెలకొన్న ఒక టూరిస్టిక్ పట్టణానికి వెళ్ళినప్పుడు అక్కడ టౌన్లో ఒక బ్యూటీ పార్లర్ చూసాము. అది పెంపుడు కుక్కల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన బ్యూటీ పార్లర్ అని వివరాలు రాసున్నాయి. అది చూసి బోల్డు ఆశ్చర్యపడిపోతే మా కొలీగ్ ఒకాయన చెప్పారు. రిటైర్మెంట్ అయ్యాక భారీ మొత్తంలో డబ్బులు వచ్చిన ధనవంతులైన ముసలివాళ్ళు కొంతమంది అలాంటి కొన్ని చిన్న చిన్న ఆల్పైన్ టౌన్స్ లో సెటిల్ అయిపోయి ప్రకృతిలో మమేకమై, ఉన్న సంపదని అంతా విచ్చలవిడిగా ఖర్చు చేసుకుంటూ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుంటారు. అంత సంపన్నులు ఉంటారు కాబట్టే ఇలాంటి విడ్డూరమైన విలాసాలకు కూడా కొదవుండదు.. అని చెప్తే 'వెర్రి వెయ్యి రకాలు' అంటే ఇదేనేమో అనిపించింది. కానీ, ఇక్కడ చిన్న పిల్లల కన్నా ఎక్కువ పిల్లులు, కుక్కలే కనిపిస్తుంటాయి, బోల్డు మంది వాటినే ప్రాణంగా చూసుకుంటూ ఉంటారు కాబట్టి వాటి కోసం ప్రత్యేకంగా బ్యూటీ పార్లర్ ఉండటం బుగ్గలు నొక్కుకోవలసినంత పెద్ద విషయం కాదులే అనిపించింది. :-)



గట్టు మీద నిలబడి కొలనులోకి చూస్తే.. కొలనులో నిలబడి గట్టు మీదకి చూస్తే..

అరవై ఐదేళ్ళు నిండిన ఉద్యోగస్తులు మహా ఆనందంగా పదవీ విరమణ చేస్తారు. ఇన్నేళ్ళు పని చేసి అలసిపోయాము, విశ్రాంతి కావాలి అన్న కోరిక కంటే కూడా "ఆహా.. ఇప్పుడు ఇంక మొత్తం సమయం అంతా మా చేతుల్లోనే.. బోలెడన్ని మాకిష్టమైన పనులు చేసే వీలుంటుంది అని ఉత్సాహంగా పదవీ విరమణ చేసే వాళ్ళే ఎక్కువ కనిపిస్తారు. నాలాంటి వాళ్ళే ఎప్పుడైనా ఏ ట్రెక్కింగ్ పేరుతోనో కొండలు, గుట్టలు ఎక్కాల్సి వస్తే అమ్మో అయ్యో అని ఆపసోపాలు పడుతుంటే ఆఫీసులో రిటైర్ అవడానికి సిద్ధంగా ఉన్న, రిటైర్ అయిపోయిన కొలీగ్ బామ్మలు అలుపూ సొలుపూ తెలీనట్టు చకచకా మెరుపు తీగల్లా ఎక్కేస్తుంటారు నాలాంటి పడుచు పిల్లలు సిగ్గు పడేలా.. అంతే కాదు.. అంతలా తిరిగేసినా కూడా తెల్లారి మళ్ళీ ఆఫీసుకొచ్చి కాళ్ళు , చేతులు నొప్పులని అస్సలేం అనకుండా చకచకా పనులు చేసుకుపోతుంటారు.

మన అమ్మమ్మలు, నానమ్మల తరంలో వాళ్ళు పెద్ద వయసొచ్చాక కూడా ఎంచక్కా ఉత్సాహంగా ఎలా క్షణం తీరిక లేకుండా

అన్నీ పనులూ చేసుకు పోతుంటారో ఇక్కడ ఈ తరం బామ్మలు, తాతలు కూడా డెబ్బై ఎనభై ఏళ్ళు దాటినా ఎంచక్కా చలికాలంలో కూడా సైకిలు మీద జామ్ జామ్మని తిరిగేస్తుండటం భలే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఇండియాలో ఒక వ్యక్తి సగటు జీవితకాలం 70 ఉంటే జర్మనీ లో దాదాపు 80 యేళ్ళు ఉంటుంది. బయట వీధుల్లో చలాకీగా తిరిగేస్తున్న పండు ముసలి వాళ్ళని చూసినప్పుడల్లా ఈ తేడా కొంచెం తెలుస్తుంటుంది. ఇక్కడ కనిపించినంత ముసలివాళ్ళు అంటే ఎనభై పైన వయసున్న వాళ్ళు ఇంత ఎక్కువగా మన దగ్గర కనిపించరనిపిస్తుంది. అలాగ రిటైర్ అయిపోయిన బామ్మలు, తాతయ్యలు కూడా చలికాలంలో అప్పుడప్పుడూ కొలనులో గడ్డ కట్టిన మంచు మీద చేరి ఆటలు ఆడుతుంటారు. పిల్లల్లాగా మరీ స్కేటింగులూ, హాకీలు ఆడరు గానీ తేలిగ్గా ఉండే సరదా ఆటలు ఆడుతూ కనిపిస్తారు. అప్పుడప్పుడూ పగటి పూట ల్యాబుల్లో మేము పని చేసుకుంటూ కిటికీలోంచి బయటికి చూస్తే వీళ్ళేమో హాయిగా ఆనందంగా ఇలా మంచులో ఆడుకుంటూ కనిపిస్తారు. అప్పటిదాకా జీవితమంతా కష్టపడి రకరకాల రంగాల్లో విధులు నిర్వర్తించిన పెద్దవారందరూ అలా ఒక చోట చేరి సరదాగా శేష జీవితాన్ని ఆస్వాదిస్తుంటే చూడ్డానికి భలే ముచ్చటగా అనిపిస్తుంటుంది.

ఎప్పుడూ వీళ్ళందరినీ చూసే సరదానే గానీ స్కేటింగులూ, స్కీయింగులూ అంటే భలే భయం నాకు. వీళ్ళంటే చిన్నప్పటి నుంచి క్రమేణా నేర్చుకుంటారు గానీ మన సంగతలా కాదు కదా.. పైగా కొంతమంది స్కేటింగులు, స్కీయింగులకి వెళ్ళి ఏ విధంగా కాళ్ళు విరగ్గొట్టుకున్నారన్న కథలన్నీ వినిపించి ఇంకాస్త ఎక్కువ భయపెట్టేస్తుంటారు. అంటే భయపడేది నేనే అయినా ఇలా ఎవరో ఒకరి మీదకి నెపం తోసెయ్యాలి కదా మరి.. :-)



అందమైన ఆల్ప్స్ పర్వతాల నడుమన ఒదిగిన చిన్న ఊరు..

నాకు ఆటలు ఆడేంత ధైర్యం లేకపోయినా వాళ్ళందరినీ చూస్తూ ఒక్కసారన్నా నేను అలా గడ్డ కట్టిన కొలను మీద నడవాలని ప్రతి యేడాది అనుకుంటూ ఉంటాను. మొత్తానికి బామ్మల్నీ, తాతల్నీ చూసి బాగా ఉత్సాహం తెచ్చేసుకుని ఒకరోజు ఐస్ మీద పట్టు జారని మంచి బూట్లు తొడుక్కుని ఆ కొలను మీదకి వెళ్ళాను. అలా జాగ్రత్తగా పట్టి పట్టి ఒక్కో అడుగు వేస్తుంటే ఓ పక్క ఉద్వేగం, ఇంకో పక్క పాదాల్లోంచి మొదలై సన్నగా పైకి పాకుతూ వెన్నులో సన్నటి వణుకు.. ఓ పది పదిహేను అడుగులు వేసాక భయం పోయి సరదా తెలిసొచ్చింది. అరెరే.. ఇంత సరదాగా ఉంటుందని తెలిస్తే ఎప్పుడో ప్రయత్నించేదాన్ని కదా అనుకున్నా. ప్రతీ రోజు నీళ్ళతో నిండి ఉన్న కొలనుని చూసీ చూసీ ఆ రోజు ఆ కొలను మధ్యలో నించుని బయట వైపుకి చూస్తూ చుట్టూ ఉన్న పరిసరాలు గమనించడం భలే కొత్తగా అనిపించింది. ఆ కొలను మీద నడుస్తున్న నా సంబరం చూసిన బామ్మలు, తాతలు అందరికీ అర్థమైపోయింది నేనదే మొదటిసారి అక్కడ నడవడం అని.. :-)

చిన్నప్పుడు సోషల్ పుస్తకాల్లో ఐరోపా ఖండంలో స్విట్జర్లాండ్, జర్మనీ, ఆస్ట్రియా తదితర దేశాల సరిహద్దుల్లో పూర్తిగా మంచుతో కప్పబడి ఉండే పర్వతాలని ఆల్ప్స్ పర్వతాలు అంటారని జాగ్రఫీ పాఠాలు చదువుకున్నాం కదా.. ఇక్కడికొచ్చాక ఆ ఆల్ప్స్ పర్వతాల్ని నేరుగా చూసి తెలుసుకునే అవకాశం కలిగింది. మన హిమాలయాలు చూసిన వాళ్ళకి ఇవేం అంత కొత్తగా అనిపించకపోవచ్చు గానీ మంచు పర్వతాలు ఎప్పుడూ చూడని నాలాంటి వాళ్ళని మాత్రం ఖచ్చితంగా ఈ హిమగిరుల సొగసులు మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. ఎండాకాలంలో చూస్తే ఇవన్నీ మామూలు కొండల్లాగా, పచ్చిక బయళ్ళతో నిండి ఉంటాయి గానీ చలికాలంలో మాత్రం పూర్తిగా మంచుతో కప్పబడి ఉంటాయి. జర్మనీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియాల్లో ఇలాంటి మంచు కొండలు ఉండే ప్రాంతాల్లోనే మన భారతీయ సినిమా పాటలు ఎక్కువగా చిత్రీకరిస్తుంటారు. ఆల్ప్స్ పర్వతాల దరిదాపుల్లో బోలెడన్ని స్కీయింగు రిసార్ట్స్, ఆ కొండల్లో చిన్న చిన్న గ్రామాలు ఉంటాయి. అవన్నీ కూడా అటు ఎండాకాలం ట్రెక్కింగు, సైక్లింగు, మౌంటెన్ బైకింగ్, చలికాలం స్నో బోర్డింగ్, హైకింగ్, స్కీయింగులని సంవత్సరం పొడవునా టూరిస్టులతో కళకళలాడిపోతూ ఉంటాయి.



మంచు కొండల మధ్యన కొలువు దీరిన ఒలంపిక్ స్కీ స్టేడియం

జర్మనీలో ఉన్న బవేరియా రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బోలెడన్ని ఆల్పైన్ టౌన్స్ లో Garmisch-Partenkirchen అనేది కూడా ఒకటి. నిజానికి అవి రెండు ఊర్లు. మన హైదరాబాదు, సికింద్రాబాదు లాగా జంట పట్టణాలన్నమాట. జర్మనీ మొత్తానికి ఎత్తైన పర్వత శిఖరం Zugspitze ఇక్కడే ఉంది. ఆ శిఖరం ఎత్తు దాదాపుగా మూడు వేల మీటర్లు. హైకింగ్ చేసే వాళ్ళే కాకుండా మామూలు జనాలు దాని పైకి వెళ్ళడానికి మౌంటెన్ ట్రైన్ కూడా ఉంటుంది. ఇక్కడ ఉన్న ఒలంపిక్ స్కీ స్టేడియంలో గతంలో వింటర్ ఒలంపిక్స్, వరల్డ్ ఆల్పైన్ స్కీ చాంపియన్ షిప్స్ లాంటి మంచు క్రీడోత్సవాలు జరిగాయి. చుట్టూ ఎత్తైన మంచు పర్వతాల మధ్యలో ఊరు ఉండి చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఈ ఊర్లోనే Partnach Gorge అనే ఒక ప్రదేశం ఉంది. అక్కడ కొండ గుహలు ఉంటాయి. పాతకాలంలో ఆ గుహల్లో నడవాలంటే ప్రాణాలకి ఎదురొడ్డి వెళ్ళాల్సి వచ్చేదట. అంటే, అంత కష్టతరంగా ఉండేదన్నమాట అప్పట్లో అక్కడ నడవడం. కానీ, ఇప్పుడు అంత భయపడక్కర్లేకుండా కాస్త సులువుగానే ఆ గుహల గుండా నడుస్తూ వెళ్ళగలిగే దారిని



స్కీ జంపింగ్ క్రీడాకారుల విన్యాసాలు

ఏర్పాటు చేసారు.



కొండల మీద నుంచి గుహలోకి జారే జలపాతం ఘనీభవించి మంచు ధారల్లా మారిన వైనం..

చలికాలం వస్తే ఆ కొండ చరియల మీద నుంచి జారిపడే జలపాతపు నీటి ధారలు గడ్డ కట్టి ఆ ఏర్పడిన మంచు ముక్కలన్నీ గుహకి భలే అందమైన రూపురేఖలు తీసుకొస్తాయి. ఆ గుహ గుండా నడుస్తూ వాటిని చూస్తూ అవతలి వైపుకి వెళితే పక్కనే ఆ మంచులో ఇంకా గలగలా ప్రవహిస్తున్న నది, ఇంకా చుట్టూ పక్కలంతా పూర్తి మంచుతో కప్పబడిన పెద్ద పెద్ద మంచు కొండలు ఉంటాయి. మేము వెళ్ళిన రోజు పై నుంచి మంచు కురుస్తోంది కూడానూ. ఆ చలిలో, మంచు వానలో ఒక మంచు కొండ మీదకి వెళ్ళడానికి ఎగుడు దిగుడుగా ఉన్న సన్నటి ఇరుకైన దారిలో మంచులో జారిపడిపోకుండా దోవకి పక్కన కట్టెలతో కట్టిన దడిని రెండు చేతులతో పట్టుకుని అతి జాగ్రత్తగా పైదాకా ఎక్కడం భలే సరదాగా ఉంటుందిలే. అసలు ముందు ఆ కొండ చూసినప్పుడు అది మొత్తం ఎక్కెయ్యగలనా అనుకున్నా గానీ చకచకా ఎక్కేస్తున్న బోల్డు మంది పెద్దవాళ్ళని, బుడతల్ని చూస్తూ ఉత్సాహంగా ఎక్కేసాను. చివరికి ఓ నాలుగైదు గంటల పాటు కష్టపడి ఎక్కేసి కొండ పైకంటా చేరుకున్నాక అక్కడ చిన్న రెస్టారెంట్స్ ఉన్నాయి. వేడి వేడిగా ఏదన్నా తినేసి మళ్ళీ కొండ దిగి కిందకి రావచ్చు లేదా పైనుంచి కొండ కిందకి రోప్ వే లో వచ్చే కేబుల్ కార్స్ ఉన్నాయి. మేము వాటిలోనే కొండ మీద నుంచి కిందకి వచ్చాం.



మంచు కొండ పైకి ఎక్కే దారి.. దారికి కుడి పక్కన ఎక్కాల్సిన కొండ ఉంటే ఇది ఎడమ పక్కన కనిపించే లోయ.

మొత్తానికి నేనెప్పుడూ కలలో కూడా ఊహించని విధంగా ఓ చిన్న మంచు పర్వతం ఎక్కడం, అది కూడా చురుక్కుమనిపించే చలిలో పైనుంచి తల మీద జోరున మంచు పూల వాన కురుస్తుండగా.. అందులో తడుస్తూ, నడుస్తూ, మధ్యలో ఇక్కడ నుంచి జారిపడితే ఈ మంచు లోయలో దొర్లుతూ పోయి చివరికి ఎక్కడ తేలతామో అని కాస్త భయపడుతూనే నవ్వుకుంటూ.. కొండ పైకి చేరాక ఎంతగా తరచి చూసినా పైన తెల్లటి ఆకాశం, కింద తెల్లటి మంచు దుప్పటి కప్పుకున్న నేల రెండూ కలిసిపోయినట్టు తప్ప మరో రంగు కనపడని వైనం.. ఓ పెద్ద మంచు సముద్రం ఒడ్డున నించుని చూస్తున్నట్టు.. కనుచూపు మేరా అంతెత్తున టన్నుల కొద్దీ తెల్లటి మంచుతో

నిండిపోయి ఏదో దేవలోకంలోకి వెళ్ళినట్టు అనిపించిన ఆ అద్భుతమైన అనుభవం నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని ఓ అరుదైన జ్ఞాపకంగా నిలిచిపోతుంది.





కొండ సగం దాకా ఎక్కాక కిందకి చూస్తే కనిపించిన పర్వత పాదం..

దాదాపు పైదాకా ఎక్కాక చుట్టూ కనిపించే హిమశిఖరాలు.

ఒకోసారి అమ్మో ఏమవుతుందో ఏవిటో అనో, మనకి బొత్తిగా అలవాటు లేని పని ఎందుకులే అనో బిక్కుబిక్కుమంటూ దూరదూరంగా పారిపోయే బిడియం నుంచి ఒక్కసారి ఆ తటపటాయింపులన్నీ వదుల్చుకుని కొత్తదనాన్ని స్వాగతిస్తూ ధైర్యంగా ముందడుగు వేస్తే జీవితంలో కొంగొత్త అనుభూతులు, అనుభవాలు సొంతమవుతాయి. కానీ, కొంతమంది కొత్తదనాన్ని అందిపుచ్చుకోవడానికి సదా సిద్ధపడి ఉండే స్వభావం కలవారైతే, మరికొంతమంది కొత్తవాటికి అలవాటు పడటానికి, సొంతం చేసుకోవడానికి కాస్త సమయం తీసుకుంటారు.. ఇదో నాలాగా అన్నమాట! :-)

●●●

# వచ్చే వచ్చే వసంత వేళ!

మార్చి నెల వచ్చిందంటే పచ్చటి వేపచెట్ల నిండుగా విరగబూసిన వేపపూత, ఆగాగి వినిపించే కోయిల కూజితాలు, మావిడాకుల మధ్యన దాగి గుత్తులు గుత్తులుగా చెట్లకి వేళ్ళాడే పచ్చి మామిడికాయలతో చైత్ర మాసం వస్తూ వస్తూనే వసంత శోభని మోసుకొస్తుంది. ఇక్కడ వేపచెట్లు, మామిడిచెట్లు లేకపోయినా ఇప్పటిదాకా మంచు ఎడారిలా మారిపోయిన పరిసరాల్లో కదలిక వచ్చి మోడులైపోయిన చెట్లలో ఆకుపచ్చటి జీవం పుట్టి లేత చిగుర్లు తొడుగుతూ, రోజుల తరబడి మొహం చాటేసిన సూరీడు కాస్త ఒళ్ళు విరుచుకుని ఆకాశ వీధుల్లోకొచ్చి సందడి చెయ్యడం మొదలు పెడతాడు. కొన్ని చెట్లైతే ఆకుల కంటే ముందు కొమ్మల నిండా మొగ్గ తొడిగి చెట్లన్నీ పూలగుత్తుల్లా మారిపోయి కనువిందు చేస్తాయి.



చలి గుప్పిట్లో విలవిలలాడుతున్నప్పుడు అందరూ ఎప్పుడెప్పుడు వసంతం వస్తుందా అని కళ్ళల్లో వత్తులు వేసుకు ఎదురు చూస్తుంటారు. అందరి ఇళ్ళ ముందూ వెనకా ఉన్న స్థలాల్లో తోట పనులు మొదలు పెట్టేస్తారు. చలి వేటుకి మూగబోయిన తోటని మళ్ళీ తీర్చిదిద్దడం కోసం కొత్త మట్టి, ఎరువులు, రకరకాల విత్తనాలు, మొక్కలు కుండీలు లాంటివన్నీ సిద్ధం చేసుకుంటారు. తోట పని శ్రద్ధగా చేసుకోవడం వల్లనే ఇక్కడ దాదాపు ప్రతీ ఇంటి ముందు చిన్నదో పెద్దదో అందమైన తోట కనిపిస్తుంటుంది.



Early Spring లో ఎక్కువగా పూసే Crocuses, Lilies, Daffodils, Hyacinths, Pansies లాంటి మొక్కల్ని ఓ నెల రోజుల ముందు నుంచే చిన్న చిన్న కుండీల్లో, కప్పుల్లో నాటుకుని ఇంట్లోనూ, ఆఫీసుల్లోనూ పక్కన పెట్టుకుని ఎప్పుడెప్పుడు పువ్వులు పూస్తాయా అని ఆత్రంగా ఎదురు చూస్తుంటారు. బయట కూడా ఇంటి ముందో, వెనక తోటలోనో పోయినేడాది నుంచి నేలలో పాతుకుని ఉండిపోయిన దుంపలు శీతాకాలపు నిద్రలోంచి మేలుకుని మట్టిలోంచి పచ్చగా పైకొచ్చి పువ్వులతో నవ్వుతుంటాయి. వాటిని చూడగానే వసంతాగమన సూచికలు కనిపించాయని, మంచు పులి పారిపోయే వేళయిందని మాయమైన సూరీడు మళ్ళీ వెచ్చగా విందు చేస్తాడని ప్రాణానికి హాయిగా అనిపిస్తుంది.



Spring వచ్చిందంటే అందరిలో ఉత్సాహం ఉరకలేస్తూ ఉంటుంది. ఉదయాలు, సాయంకాలాలు woods లోకి వాకింగు, జాగింగులకి వెళ్ళడం, సైకిళ్ళేసుకుని ఊరంతా చుట్టెయ్యడం, ట్రెక్కింగ్ అంటూ కొండలు గుట్టలు ఎక్కడం, స్ప్రింగ్ ఫెస్ట్ ల పేరుతో ఏ కాస్త వీలు చిక్కినా అందరూ ఆరుబయట కలిసి కూర్చుని సరదాగా పార్టీలు చేసుకోవడం.. ఇలా ఎక్కడ చూసినా పండగ వాతావరణం కనిపిస్తుంది.

పండుగలు, పబ్బాలు అంటే మనం ఇంటి నిండా చుట్టాలు పక్కాలతో బోల్డన్ని వంటలు స్వయంగా తయారు చేసి 'అతిథి దేవోభవ' అన్నట్టు సంపూర్ణ ఆతిథ్యం ఇవ్వడం మన సంప్రదాయం. అది కూడా ఏ ముగ్గురికో నలుగురికో కాదు, ఇరవై పాతిక మందికైనా అవలీలగా భోజనాలు సిద్ధం చేసెయ్యడం మనకి బాగా అలవాటైన పద్ధతి. ఇక్కడ మాత్రం చాలావరకూ పార్టీలంటే అందరూ తలో చెయ్యి వేసి చేసుకునేవే ఉంటాయి. పార్టీ ఎవరింట్లో హోస్ట్ చేసినా సరే భారమంతా ఒకరి మీద పడకుండా తలా ఒక వంట చేసుకొస్తారు. అందరూ కలిసి బయట ఏదైనా రెస్టారెంట్ లో పార్టీ చేసుకుందామనుకున్నా సరే చాలా వరకు ఎవరి బిల్లు వాళ్ళే కట్టుకుంటారు.



ఒకసారి మా లాబ్లో కొలీగ్ ఒకరు జాబ్ పూర్తి చేసుకుని వెళ్ళిపోతున్న సందర్భంలో ఫేర్ వెల్ పార్టీ అని మొత్తం ఇన్స్టిట్యూట్లో అందర్నీ ఒక బార్ అండ్ లాంజ్ లో కలుద్దామని ఆహ్వానించారు. అప్పటికి నేను జర్మనీ వచ్చి నెల రోజులు కూడా కాలేదు. అప్పటికి నేను కాకుండా మా లాబ్లో ఇంకో ఇండియన్ అమ్మాయి, అబ్బాయి ఇద్దరు కొలీగ్స్ ఉండేవారు. మేం ముగ్గురం కలిసి వెళ్ళాం. ఫేర్ వెల్ పార్టీ కాబట్టి కొలీగ్స్ అందరూ వచ్చారు. ఎంచక్కా ఎవరికి కావలసింది వాళ్ళు ఆర్డర్ చేసుకుని తాగుతూ కులాసాగా కబుర్లాడుతూ కూర్చున్నారు. అందరూ ఎవరి వాళ్ళే బిల్లు వాళ్ళే కట్టుకున్నారు. భలే చిత్రంగా అనిపించింది నాకు. ఇక్కడ చాలావరకూ పార్టీలన్నీ ఇలాగే ఉంటాయి.

ఆ రోజు పార్టీలో నేను ఇంకో ఇండియన్ అమ్మాయి ఇద్దరం ఏవో ఫ్రూట్ కాక్ టైల్స్ తాగుతూ కాలక్షేపం చేసాం. అప్పటికే అర్ధరాత్రి కావొస్తున్నా ఎవ్వరికీ ఇప్పుడప్పుడే కదిలే ఉద్దేశ్యం లేదని తెలిసాక ఇంక మాకు బోర్ కొట్టేసి మనిద్దరమే వెళ్దాం పదమని నుంచి బయటపడ్డాం. ఆ టైముకి బస్సులేం ఉండవు. టాక్సీ పిలుద్దామా అనుకుని కూడా బయట వేసవి కాలం చల్లగా

వీస్తున్న గాలి హాయిగా ఉందని ఇద్దరం కలిసి నడుద్దాం అనుకున్నాం. విశాలంగా, నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్న రోడ్డు మీద ఆ అర్ధరాత్రి పూట మేమిద్దరం అమ్మాయిలం దాదాపు రెండు కిలోమీటర్ల పైన నడిచాం. కాసేపటికి మాటల్లో 'చూసావా అర్ధరాత్రి పూట ఇద్దరు అమ్మాయిలం నడిరోడ్డు మీద ఎవరి తోడూ లేకుండా ఎంత ధైర్యంగా నడుస్తున్నామో.. గాంధీ గారు చెప్పిన ప్రకారం వీళ్ళకి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టేనన్నమాట అనుకుని నవ్వుకున్నాం.



ఇప్పటికీ లాబ్లో ఏదన్నా పనుండి కాస్త ఆలస్యంగా రాత్రి పూట వెళ్ళాల్సి వస్తే ఒంటరిగానే వెళ్ళి వచ్చేస్తుంటాం. అయితే ఎంత ధైర్యంగా అనిపించినా, ఎంత భద్రమైన చోటైనా సరే మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిది కాబట్టి తప్పనిసరి అయితే గానీ వేళ కాని వేళలో బయట తిరగము. కానీ, బయటికెళ్తే ఎలా ఉంటుందో, ఎవరు ఏమంటారోనన్న భయాలైతే ఎప్పుడూ కలగలేదు. మొత్తానికి ఇక్కడికొచ్చిన కొత్తలో అప్పుడలా నడవడం మాత్రం నాకో చక్కటి సరదా జ్ఞాపకం!

మనకి పువ్వులంటే బాగా ఇష్టమున్నా చాలామంది పువ్వులన్నీ చెట్లకి ఉంచడం కన్నా కూడా కోసి తలలో పెట్టుకోడానికో, దేవుడికి పెట్టడానికో ఆసక్తి చూపిస్తారు కదా.. ఇక్కడేమో ఎక్కువ శాతం అన్నీ మొక్కలకి ఉంచడానికే ఇష్టపడతారు. అసలు కొంతమందైతే చెర్రీలు, ఆపిల్స్ లాంటి పళ్ళు కూడా కోయకుండా చెట్లకే వదిలేస్తారు. వసంతం వస్తూనే బోల్డు రకాల పువ్వులు



పూస్తాయి కదా.. ఆ పూల మొక్కలన్నిటినీ పొందిగ్గా పెంచడానికి ఇష్టంగా శ్రమపడతారు. ఏదన్నా ప్రత్యేక సందర్భాలు వచ్చినప్పుడు స్నేహితులకి వాళ్ళ తోటలో పూసిన పువ్వులతో బొకేలు తయారు చేసిస్తుంటారు. చాలా తరచుగా పూల మొక్కల్ని బహుమతిగా ఇస్తుంటారు. ఇంటి లోపల గదుల్లో కూడా బోల్డు మొక్కలకి చోటు కల్పిస్తారు. ఇంకా స్ప్రింగ్ వస్తూనే ఊర్లో ఉన్న ఉద్యానవనాలన్నీ కళకళలాడిపోవడమే కాకుండా రకరకాల మొక్కల, పువ్వుల ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. అసలే మొక్కలంటే మహా ఇష్టమేమో నాకీ విషయం ఇక్కడ చాలా నచ్చేస్తుంది.

మనకైతే మామిడి పళ్ళు , మరుమల్లెలు, తాటి ముంజెలు, మండే ఎండల తర్వాత చల్లటి చిరుజల్లుల్లో తడిపేసే మేఘాలు, ఉరిమే మెరుపులు, మళ్ళీ వాటి వెనకాలే శారద రాత్రులు, పారిజాతాలు, మంచు తెరలు, ముద్దబంతులు..... అదే ఇక్కడైతే శిశిరపు వర్ణచిత్రాలు, పొగ మంచు గారడీలు, మంచు పూల వానలు, మోడులైపోయిన చెట్లు,

మళ్ళీ చలిని పారద్రోలుతూ మొగ్గ తొడిగే చెట్లు, నిదురించిన పచ్చదనాన్ని మేలుకొలుపుతూ వెలికి వచ్చే లేలేత చివుళ్ళు , రంగురంగుల పుష్ప జాతులు, అవి వెదజల్లే సుగంధాలు, వాటి చుట్టూ రివ్వున తిరుగుతుండే రంగు రంగుల సీతాకోకచిలుకలు, తుమ్మెదలు..... అక్కడా ఇక్కడా ఋతువుల రంగూ రూపూ వేరైనా ప్రకృతి తత్త్వం ఒక్కటే కదా! సంబరం వెంటే నిశబ్దం, కష్టం వెంటే సుఖం, నవ్వు వెంటే ఏడుపు, ఎదురుచూపుల వెంటే కలయిక, శిశిరం వెంటే వసంతం.. ఇదేగా జీవన చక్రం! ఏదేమైనా బాధ తర్వాత ఎదురొచ్చే సంతోషం, శరత్కాలం తర్వాత నవవసంతం మోసుకొచ్చే సంబరపు రుచి కాస్త ఎక్కువ తీపి కదూ! :-) ●●●





# కొత్త పాతల మేలు కలయిక!





జర్మనీలో మార్చి, ఏప్రిల్, మే.. ఈ మూడు నెలలు స్ప్రింగ్ సీజన్ అంటారు. పేరుకి వసంతం వచ్చేస్తున్నట్టే ఉన్నాసరే మార్చి నెలంతా నాలుగు రోజులు మంచు కురిస్తే ఒక రోజు

ఎండ కాస్తూ వాతావరణం వింత పోకడలు పోతూ ఉంటుంది. మంచేమో నేనిప్పుడప్పుడే వెళ్ళనని మంకు పట్టు పట్టినట్టుగా సన్నటి జల్లుల్లా కురుస్తూనే ఉంటుంది. వసంతమేమో ఇప్పుడు నా వంతు, ఏమైనా సరే వచ్చి తీరుతానన్నట్టు ఈ మంచుని ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా ఎండి మోడులైన చెట్ల మీద చిగుర్లు, మొగ్గలు తొడగడానికి పూనుకుంటుంది. ఒకోసారి early spring లో ఎప్పుడూ వచ్చే Crocus లాంటి పువ్వులు విరిసాక కూడా వాటి మీదే మంచు కురుస్తూ ఉంటుంది. అంత సుకుమారంగా ఉండే పూలు కూడా ఆ మంచులో ఉస్సూరుమని వాలిపోకుండా నిబ్బరంగా తలెత్తుకుని నిలబడే ఉంటాయి. అబ్బా చూడటానికి అంత సున్నితంగా కనిపించే ఈ పువ్వులకి ఇంత చలిని తట్టుకుని ఎదురు నిలబడే శక్తి ఎక్కడి నుంచి కదా.. అబ్బురంగా అనిపిస్తుంది. మొత్తానికి ఏప్రిల్ సగం దాకా కూడా అడపాదడపా చలిగాలులు, మంచు పలకరింపులు తప్పవనే చెప్పాలి. మంచు ఎంతగా ఇబ్బంది పెట్టినా ఇలా ఏడాది పొడవునా నెలనెలకీ వాతావరణంలో వచ్చే విపరీత మార్పులు, వాటికి అనుగుణంగా ప్రకృతి మార్చే రంగులు శ్రద్ధగా గమనించుకుంటూ పోవడం అదో సరదాగా ఉంటుంది. :-)

ఏప్రిల్ ఒకటో తేదీని ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో 'ఫూల్స్ డే ' గా జరుపుకుంటారని మనకి తెలిసిన విషయమే కదా! అయితే, జర్మనీలో ఏప్రిల్ ఫూల్స్ డే జరుపుకుంటారని నాకెప్పుడూ అనిపించలేదు. మనం కూడా చిన్నప్పుడు స్కూల్లో ఏప్రిల్ ఫూల్ అంటూ తెగ అల్లరి చేసేవాళ్ళం కానీ పెద్దయ్యే కొద్దీ ఈ ఫూల్స్ డే కి పెద్ద ప్రాముఖ్యాన్ని ఇవ్వం కదా.. వీళ్ళూ అంతేనేమోలే అనుకున్నాను. ఒకసారి మా కొలీగ్ ఒకరితో మాట్లాడుతున్నప్పుడు తెలిసింది వీళ్ళకి కూడా ఫూల్స్ డే సరదా ఉందని. అసలు ఈ ఫూల్స్ డే పుట్టు పూర్వోత్తరాల గురించి ఉన్న రకరకాల చారిత్రిక కథనాల్లో ఈ ఆచారం పదహారో శతాబ్దపు రోజుల్లో జర్మనీలోనే మొదలైందని ఒక అంచనా. ఈ ఫూల్స్ డే రోజున ఆట పట్టించడాలన్నీ మధ్యాహ్నం పన్నెండింటి లోపే ముగించెయ్యాలి. ఆ తర్వాత ఫూల్స్ ని చెయ్యడం అనేది దురదృష్టాన్ని తెచ్చేదిగా భావిస్తారట కొందరు. అలా పన్నెండు తర్వాత ఫూల్స్ ని చెయ్యబోయిన వారే ఫూల్స్ అయినట్టుగా అనుకుంటారట మరి కొందరు.

ఈ రోజుల్లో ఏప్రిల్ ఒకటిన ఒకరినొకరు ఫూల్స్ ని చేసుకోడం అనేది అంత తరచుగా కనిపించకపోయినా మీడియా వాళ్ళు మాత్రం అప్పుడప్పుడూ విచిత్రమైన వార్తలతో జనాల్ని ఏప్రిల్ ఫూల్ చేసే ప్రయత్నం చేస్తుంటారు. 2001 లో బెర్లిన్ లోని ఒక వార్తాపత్రిక నగరంలోని లోకల్ ట్రైన్ స్టేషన్స్ కి పెట్టే పేర్లని ప్రభుత్వం వేలం వేసి అత్యధిక మొత్తంలో కొనుక్కున్నవారు సూచించిన పేర్లనే ఆయా స్టేషన్లకి పెడతారని ప్రచురించింది. 2003 లో బెర్లిన్ లో ఉన్న అమెరికన్ ఎంబసీని ఉన్నట్టుండి మారుస్తున్నట్టు ప్రకటించారు మరో వార్తా పత్రిక వాళ్ళు . 2004 లోనేమో iShave అనే ఒక కొత్త టెక్నాలజీ రాబోతోందని, దాని ద్వారా మీ iPod తో సంగీతం వినడమే కాదు ఎప్పుడంటే అప్పుడు సులభంగా షేవ్ చేసుకుని అందంగా తయారవచ్చు అని ప్రచురించి పాఠకులని ఏప్రిల్ ఫూల్స్ ని చేసారు. :-)

క్రిస్మస్ తర్వాత మళ్ళీ అంత సందడిగా జర్మనీలో జరుపుకునే పండుగ ఈస్టర్ కూడా ఈ సీజన్లోనే వస్తుంది. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ మండే తో కలిపి మొత్తం నాలుగు రోజులు ఈస్టర్ సెలవులుంటాయి ఇక్కడ. ఈ పండుగ జరుపుకోవడంలో రెండు అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఒకటి శిలువ వేయబడిన క్రీస్తు మళ్ళీ తిరిగి వచ్చిన రోజన్న ప్రాముఖ్యం అయితే, మరొకటి ఇన్ని నెలల తరబడి చలికి ఎండిపోయి, చీకటి లాంటి నిశబ్దంలో ఉన్న ప్రకృతి మేలుకుని కొత్త చిగుర్లు తొడగడం మరొక కారణం. పండుగ ఆ నాలుగు రోజులే అయినా క్రిస్మస్ నెలంతా ఊరు రకరకాల అలంకరణలతో ఎలా అయితే ముస్తాబవుతుందో ఈస్టర్ నెలంతా కూడా అలాగే అలంకరింపబడుతుంది.

ఈస్టర్ అలంకరణ అంటే ఈ కాలంలో విరిసే రకరకాల స్ప్రింగ్ బ్లూమ్స్, కోడిగుడ్లు, ఇంకా బన్నీలు (కుందేళ్ళు ). రకరకాల చాక్లెట్, కుక్కీస్, తీపి రుచుల్లో కోడిగుడ్డు, కుందేళ్ళ ఆకారంలో తయారు చేసే వాటినే ఈస్టర్ ఎగ్స్, ఈస్టర్ బన్నీస్ అంటారు. వాళ్ళ వాళ్ళ అభిరుచులని బట్టి ఉడకబెట్టిన కోడిగుడ్ల మీద రకరకాల రంగులు, డిజైన్లు వేసి అలంకరిస్తారు. ఇవన్నీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ఇచ్చి పుచ్చుకుంటారు. కేవలం తినడానికే కాకుండా ప్లాస్టిక్ తోనో, చెక్కతోనో, గడ్డితోనో, మైనంతోనో, రకరకాలుగా కోడిగుడ్లు, బన్నీలు, గొర్రె పిల్లలు లాంటి బొమ్మలన్నీ తయారు చేసి అలంకరణగా ఇళ్ళల్లో, ఆఫీసుల్లో పెట్టుకుంటారు. ఈ సీజన్లో ఎక్కడికి వెళ్ళినా ముద్దు ముద్దుగా ఇవే కనిపిస్తుంటాయి. కొంతమంది ఈస్టర్ ట్రీ పెట్టుకుంటారు. అంటే చెట్టు కొమ్మలకి ఇలాంటి రకరకాల బొమ్మలు వేలాడదీసి అలంకరిస్తారు. ఈస్టర్ సమయంలో పాత క్రిస్మస్ ట్రీ లని పోగేసి ఇరుగూ పొరుగూ కలిసి చలిమంటగా వేసుకుని కొత్త ఋతువుకి స్వాగతం పలకడం కూడా ఒక ఆచారం జర్మనీలో. ఇదేదో మన సంక్రాంతి భోగి మంటలా ఉంది కదూ! :-)



ఇక్కడ వీళ్ళు జరుపునే పండగలు, పాటించే ఆచారాలు, సాంప్రదాయక అలవాట్లు, ఆహార వ్యవహారాలు ఇవన్నీ కూడా నిన్నో మొన్నో మొదలైనవి కావు. వందల సంవత్సరాల నుంచీ అనాదిగా వస్తున్నవి. అయితే, మారుతున్న కాలంతో పాటు వాళ్ళ సాంస్కృతిక



సంపదని చేజార్చుకోకుండా, కొత్త కొత్త ఆలోచనలతో వారి పాత ఆచారాలు, పద్ధతులనే నిత్య నూతనంగా మార్చుకుంటూ సాగిపోతుంటారు. 'కొత్తొక వింత పాతొక రోత' అన్న నానుడి జర్మన్ల విషయంలో అస్సలు నప్పదు. కొత్తదనాన్ని ఎంతగా ఆకళింపు చేసుకుంటారో, అంతకంటే ఎక్కువగా పాతదనాన్ని ప్రేమిస్తారు. ఏదైనా సరే ఎంత పాతది అయితే అంత విలువ ఇక్కడ. ఏదైనా పండగ వచ్చినప్పుడల్లా వాళ్ళ సంప్రదాయక దుస్తులు ధరించడాన్ని బోల్డు గర్వంగా భావిస్తారు.






ఏ మారుమూల ఊరికి వెళ్ళినా సరే ఒక విగ్రహమో, బొమ్మో, భవంతో, చర్చో, చివరికి రాయో రప్పో అయినా సరే ఎన్నేళ్ళు పాతది అయితే దానికి అంత విలువ, గౌరవం ఉంటుంది. దాని పక్కనే ఇది ఫలానా పంతొమ్మిదో శతాబ్దంలో ఫలానా సందర్భంలో కట్టారు అంటూ దాని చరిత్ర అంతా రాసి పెడతారు. ఎంత చిన్న ఊరికి వెళ్ళినా సరే ఏదో ఒక బుల్లి మ్యూజియం అయినా ఉంటుంది. ఆ ఊరి చరిత్రకి సంబంధించిన వివరాలన్నీ అక్కడ ఉంటాయి. ఇక బెర్లిన్, మ్యూనిక్ లాంటి మహా నగరాల సంగతి చెప్పనే అక్కర్లేదు. రకరకాల మ్యూజియంలు చాలా పెద్ద పెద్దవి బోల్డు ఉంటాయి.

ఇలా ప్రతీదాని గురించి రాసి పెట్టినవి దేశంలో ప్రతీ మూలా చూసీ చూసీ కొన్నాళ్ళకి బాబోయ్ అసలు ఈ దేశమంతా అంత ముఖ్యమైనవి ఉన్నాయా మరీ చోద్యం కాకపోతే.. అనిపించింది నాకు. కొంత ఆలోచించాక అర్థమైంది. కొన్ని శతాబ్దాల నుంచీ నాగరికత వెల్లివిరుస్తున్న ఏ దేశంలోనైనా ఇలాగే ఎన్నెన్నో చారిత్రిక ఆనవాళ్ళు ఉంటాయి. వాటన్నీటిని జాగ్రత్తగా కాపాడుకుంటూ, వాటి గురించిన వివరాల్ని కొత్త తరానికి తెలిసేలా ప్రదర్శించడం అనేది ప్రతీ దేశమూ చెయ్యాల్సిన పని అని. ఈ లెక్కన ఎన్నో శతాబ్దాల నాగారికతాక్రమానికి సాక్ష్యంగా నిలిచిన భరతఖండం చరిత్ర ఎంత పెద్దదో, అందులో మనకి అంటే (నాలాంటి సామాన్యులకి) తెలిసింది ఎంత తక్కువో కదా అనిపించింది.





ఇప్పుడు మేముండే ఊరు మొత్తం జనాభా యాభై వేల లోపే ఉండే ఒక చిన్న పట్టణం. పక్కనే ఒక మహా నగరం, అంతర్జాతీయ విమానాశ్రయం, రెండు అతి పెద్ద

యూనివర్సిటీలు, మరెన్నో విద్యా సంస్థలు, టెక్నాలజీకి సంబంధించిన కంపెనీలు, ఫ్యాక్టరీలు ఉండటం వల్ల ఊరు అభివృద్ధి పరంగా చాలా ఉన్నత స్థానంలో ఉంది. దేశమంతా విస్తరించి ఉన్న ప్రముఖమైన సూపర్ మార్కెట్లు, బట్టలు, వస్తువులు, చెప్పులు, నగలకి సంబంధించిన అంతర్జాతీయ బ్రాండ్స్ అన్నీ దొరికే షాపులు చాలానే ఉన్నాయి. వీటన్నిటి పక్కనే ఈ ఊరికి మాత్రమే సొంతమైన కొన్ని షాపులు, అంటే స్థానికులు పెట్టుకున్నవి కూడా ఉన్నాయి. ఏవైనా వస్తువులు రెండు చోట్లా దొరికితే ఆ గొప్ప బ్రాండ్ షాప్స్ కన్నా కూడా ఆ దేశవాళీ కొట్లకే ఎక్కువ విలువ, గౌరవం ఉంటాయి. మన దగ్గర కూరగాయల మార్కెట్లోనో, సూపర్ మార్కెట్లోనో కొంటే కాయగూరలు, పండ్లు ఎక్కువ ఖరీదు ఉంటాయి. అదే రైతు బజార్ లోనో, పొలాలు, తోటల దగ్గర్నుంచి తెచ్చి నేరుగా అమ్మే చోట కూరగాయలు, పండ్లు మరింత తాజా అయినా సరే ఖరీదు తక్కువ ఉంటాయి కదా.. అదే ఇక్కడైతే సూపర్ మార్కెట్లో చవకగానో, ఫ్రెష్ మార్కెట్ లో ఖరీదు ఎక్కువగానూ ఉంటాయి.

యాభై ఏళ్ళ పైనుంచి నడుపుతున్న సైకిల్ షాపు, ముప్పై ఏళ్ళు పైబడిన బేకరీలు, ఇరవై ఏళ్ళ పైనుంచి నడుపుతున్న జిరాక్స్, బైండింగ్ షాపు, పాతికేళ్ళ పైబడిన పూల కొట్టు, నూట ఇరవై ఏళ్ళ నుంచీ ఆతిథ్యం ఇస్తున్న హోటల్..... ఇలాంటివి బోల్డు కనిపిస్తుంటాయి ఈ ఊరి వీధుల్లో. ఇవన్నీ ఇప్పటికీ నిత్యనూతనంగా ఉంటూ ఊర్లో జనాలందరి అభిమానాన్ని చూరగొంటున్నాయి. ఇన్నేళ్ళ నుంచీ నడుపుతున్నారంటే బహుశా వీటిల్లో కొన్నైనా కుటుంబ వ్యాపారాలు అయ్యుంటాయి. సైకిల్ షాప్, బైండింగ్ షాప్ నడిపే ఇద్దరు వ్యక్తుల్ని చాలాసార్లు దగ్గరగా గమనించాను. అసలు వాళ్ళ వాళ్ళ విధుల్లో వాళ్ళకి కలుగుతున్న సంతృప్తి, సంతోషం ఎంత లేకపోతే వాళ్ళని చూస్తే జీవితాంతం నిశ్చయంగా ఈ పని చెయ్యడానికే పుట్టాం అన్నంతగా ఆయా వృత్తులకి అంకితమైపోయారనిపిస్తుంది. అయితే, ఇంక వేరే దారి లేక అలా అదే పని చేస్తూ ఉండిపోవడం వేరు, వారి జీవనానికి సంబంధించి వృత్తి పరంగా గానీ, సంపాదన పరంగా గానీ ఏ విధమైన అసంతృప్తులు లేకుండా వారికి వారే ఇష్టంగా ఆయా విధులకి అంకితమైపోవడం వేరు కదా! మన దేశంలో కూడా చిన్న చిన్న ఊర్లలో ఇలాంటి వ్యాపారస్థులు బోల్డు మంది ఉంటారు. వాళ్ళందరూ కూడా ఏళ్ళ తరబడి వాళ్ళ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. ఇప్పుడు మనం కొత్తగా సాధిస్తున్న అభివృద్ధిలో భాగంగా ఇలాంటి చిరువ్యాపారులందరూ అదృశ్యమైపోయి బట్టలు, తిండి దగ్గర్నుంచి బంగారం దాకా కేవలం కార్పొరేట్ సూపర్ మార్కెట్లు, మాల్స్ మాత్రమే మిగిలిపోతే? స్థానికంగా ఆయా ఊర్లలో ఉన్న ప్రాంతీయ పద్ధతులు, సంస్కృతులు ప్రతిబింబించేలా ప్రతి ఊరికి తనదంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర ఉండాలంటే అభివృద్ధి పేరుతో ఇలాంటివి కనుమరుగైపోకూడదు.

ఏ దేశంలోనైనా ఏ తరం వారైనా ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని అందిపుచ్చుకుంటూ, పాతదనాన్ని పదిలపరచుకుంటూ, పాత కొత్తల మేలు కలయికని సమన్వయపరచుకుంటూ ముందుకి వెళితేనే ఒక వ్యవస్థకి సమగ్రమైన అభివృద్ధి సిద్ధించినట్టవుతుంది. అవునంటారా, కాదంటారా?

# మర్యాద.. మన్నన.. క్రమశిక్షణ..



**మే నెల మొదటి తారీఖుని** ప్రపంచ వ్యాప్తంగా 'లేబర్ డే' అంటే ప్రపంచ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటారన్న సంగతి తెలిసిందే కదా! చాలా దేశాల్లోలాగే జర్మనీలో కూడా మేడే రోజున అన్నీ కార్యాలయాలకి సెలవు. ఈ మేడే స్ప్రింగ్ సీజన్లో వచ్చే సెలవు కావడం మూలానేమో మరి ఇక్కడ చాలా ఉత్సాహంగా మేడే వేడుకలు జరుపుకుంటారు. యువతీయువకులు విశేషంగా పాలు పంచుకునే ఈ సంబరాల్లో 'మే పోల్' ని నిలబెట్టడం ముఖ్యమైన ఘట్టం. 'మే పోల్' అంటే చెక్కతో తయారైన పెద్ద పొడవాటి స్థంభంలా ఉంటుంది. జండా కర్రలాగా సన్నగా ఉండకుండా బాగా మందంగా, బరువుగా ఉంటుంది. ఎక్కడైతే ఆ 'మే పోల్' ని నిలబెడతారో ఆ చోటుకి, వాళ్ళకి సంబంధించిన విషయాల్ని సూచించేలా కొన్ని చిహ్నాలని కూడా దాని మీద అలంకరిస్తారు. అంటే ఉదాహరణకి యూనివర్సిటీ కాంపస్లో నిలబెట్టే మే పోల్ కి అక్కడున్న వివిధ విభాగాలు, కోర్సులూ సంబంధిత చిహ్నాలని పెడతారన్నమాట. ప్రతీ ఏడాదీ మే డే రోజున పెద్ద ఎత్తున జరిగే పండగలో అందరూ సాంప్రదాయక వస్త్రాలలో వచ్చి యథావిధిగా బోల్డు రకాల తిండి పదార్థాలూ, వైన్, బీరు, ఆటలు, పాటలు, విందు వినోదాలతో సరదాగా గడుపుతారు. మేడే రోజున అందరూ కలిసి తలో చెయ్యీ వేసి నిలబెట్టిన 'మే పోల్' మళ్ళీ వచ్చే ఏడాది దాకా అలానే స్థిరంగా ఉంటుంది. మేడే రోజున మే పోల్ చుట్టూ చేసిన అలంకరణ చూస్తే నాకు మన జెండావందనం వేడుకలు గుర్తొస్తాయి.

ఈ సీజన్లో వాతావరణం గురించి ఒక సరదా నానుడి ఉందని ఒకసారి మా కొలీగ్ చెప్తే తెలిసింది. సాధారణంగా ఈ టైముకి చలి తగ్గిపోయి కాస్త ఎండాకాలపు ఛాయలు కనిపించాలి కానీ ఒకోసారి రోజు రోజుకీ మారిపోతూ ఉన్నట్టుండి వాన, అంతలోనే ఎండ, తెల్లారి చలిగాలులు.. ఇలా మన అంచనాకి అందనట్టు ఉంటుందని ఈ వాతావరణాన్ని 'ఓల్డ్ వుమన్ మూడ్ స్వింగ్స్' తో పోలుస్తారట సరదాగా. మే నెల వచ్చేసరికి అందరిళ్ళ ముందూ తోటల్లో ఎండకి మెరుస్తూ, గాలికి ఊగుతూ డాఫోడిల్స్, టులిప్స్ కనిపిస్తూ ఉంటాయి. పెద్ద పెద్ద



చెట్ల నిండా విరగబూసిన చెర్రీ బ్లూమ్స్, మాగ్నోలియా బ్లూమ్స్ ముచ్చట గొలుపుతూ ఉంటాయి. మోయలేనన్ని పూల గుత్తులతో విస్టీరియా తీగలు కనువిందు చేస్తుంటాయి. నెలల తరబడి మంచు దుప్పటి మాటున సూర్యుడి మొహం కనపడక ఎండ కోసం మొహం వాచిపోయి ఉంటారేమో ఎండలు ముదిరే కొద్దీ జనాలందరూ ఇళ్ళలో కన్నా బయటే ఎక్కువ ఉంటుంటారు. వుడ్స్ లోకి వాకింగులు, జాగింగులకి వెళ్ళేవారు, సైకిలు ట్రిప్పులు ప్లాన్ చేసుకుని మైళ్ళ కొద్దీ దూరం సైకిళ్ళ మీద తిరిగేవారు, సరస్సులు, నదీతీరాల్లో కూర్చుని ఎండని ఆస్వాదించేవాళ్ళు, బీర్ గార్డెన్లు, ఐస్క్రీమ్ పార్లర్లు, రెస్టారెంట్లు అన్నీటి ముందూ ఎండలో కూర్చుని కాలక్షేపం చేసేవారు.. ఇలా ఎక్కడ చూసినా జనాలతో కిటకిటలాడిపోతూ సందడిగా ఉంటుంది.

సహజంగా జర్మన్లకి మర్యాద, మన్నన ఎక్కువే. ఆఫీసుల్లో, షాపుల్లో, పబ్లిక్ ప్లేసుల్లో అపరిచితులు కూడా నవ్వు మొహాలతో హలో చెప్తుంటారు. కానీ అలాగని తొందరగా మాటలు కలిపేసే కలుపుగోలుతనం తక్కువేననిపిస్తుంది. బస్సులు, రైళ్ళలో దాదాపు మాటలు వినపడనంత నిశబ్దంగా ఉంటారంటే ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. మన దగ్గరైతే రైలు ఎక్కిన ఓ అరగంట తర్వాత వీళ్ళు ఎప్పటినుంచో మంచి స్నేహితులేమో అన్నంతగా కబుర్లలో మునిగిపోతుంటాము కదా.. వీళ్ళు అలాంటివేం లేకుండా చేతులో పుస్తకంతోనో, చెవిలో ఇయర్ ఫోన్స్ తోనో నిశబ్దంగా కూర్చుంటారు. కలిసి జట్టుగా వచ్చిన వారైనా సరే వారిలో వారు చాలా తక్కువగా, మెల్లగా మాట్లాడుకుంటారు. ప్రయాణాల్లో గట్టి గట్టిగా మాట్లాడుకోవడం మిగతా ప్రయాణీకులందరికీ ఇబ్బందిగా భావిస్తారు. పరిచయస్థులు కాని వారితో ముభావంగా మెలిగే అలవాటు ఉన్నప్పటికీ ఎవరైనా అడగ్గానే సహాయం చెయ్యడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. వారి మనస్తత్వం, నడవడిలో నిజాయితీ, నిక్కచ్చిగా వ్యవహరించే తీరు చక్కగా అనిపిస్తుంది. నా స్వానుభవంలోనూ, స్నేహితుల అనుభవాల్లోనూ ఇది చాలా సార్లు గమనించినదే.

ఇక్కడ దాదాపుగా ఏ షాపులోనైనా సరే మనం డబ్బు చెల్లించాక వాళ్ళు తిరిగి ఇచ్చే చిల్లరని సరి చూసుకోవాల్సిన అవసరం ఉండదు. నిజంగా అంత ఖచ్చితంగా ఉంటారు. నాకసలు ఇన్నేళ్ళలో అలా చిల్లరని సరిచూసుకునే అలవాటే పోయిందంటే మీరు నమ్మాలి మరి. ఏదో సినిమాలో బ్రహ్మానందం అతిశయంగా చెప్తాడు కదా పారిస్ లో ఏదైనా వస్తువు వదిలేసి వెళ్ళి ఏడాది తర్వాత వచ్చి చూసినా సరే ఎక్కడికీ పోకుండా నిక్షేపంలా ఉంటుంది అని. పారిస్ సంగతేమో గానీ జర్మనీలో మాత్రం ఏదైనా వస్తువు ఎక్కడైనా పోతే మళ్ళీ వెళ్ళి వెతుక్కుంటే సాధారణంగా దొరుకుతుంది. నేనొకసారి సూపర్ మార్కెట్లో బిల్లు కట్టేసి క్రెడిట్ కార్డ్, ఇంకోసారి బ్యాంక్ కార్డ్ అక్కడే మర్చిపోయి వచ్చాను. మర్చిపోయి వచ్చానన్న విషయం వారం దాకా గ్రహించనేలేదు. వారం తర్వాత ఎక్కడ వదిలేసి ఉంటానా అని అతి కష్టం మీద గుర్తు తెచ్చుకుని వెళ్ళి ఆ సూపర్ మార్కెట్లలో అడిగితే ఐడెంటిటీ ప్రూఫ్ సరి చూసుకుని వాళ్ళు దాచి ఉంచింది తెచ్చిచ్చారు. ఒకసారి ఎప్పుడూ రద్దీగా ఉండే ఒక పెద్ద షాపింగ్ మాల్లో కొత్తగా షాపింగ్ చేసిన వస్తువులతో ఉన్న బ్యాగ్ పోగొట్టుకుంటే రెండ్రోజుల తర్వాత మళ్ళీ వెళ్ళినప్పుడు దొరికింది. మా స్నేహితుడు ఒకతను ఒక షాప్ లో తన వాలెట్ మర్చిపోతే అందులో ఉన్న

కార్డులు, డబ్బులతో సహా క్షేమంగా దొరికేసింది.

పైన చెప్పిన వాటన్నీటికన్నా బాగా గుర్తుండిపోయిన సంఘటన ఒకటుంది. ఒకసారి స్నేహితులందరం కలిసి వేరే ఊరికి వెళ్ళి వస్తూ వస్తూ ఇండియన్ షాప్లో మన కూరగాయలు, మసాలాలు వగైరా కొనుక్కుని బ్యాగులన్నీ నింపుకుని తిరిగి వస్తున్నాం. మేము దిగాల్సిన బస్ స్టాప్లోనే ఒక ఎనభై ఏళ్ల పైబడిన ముసలావిడ కూడా బస్ దిగాల్సి ఉంది. ఆవిడని చూసి అయ్యయ్యో ఒంటరిగా దిగగలదో లేదో ఏమన్నా సాయం చేద్దామా అనుకున్నాము గానీ ఆవిడకి ఎవరి సాయమూ తీసుకోవడం సుతరామూ ఇష్టం లేనట్టుంది. ఇక్కడ చాలాసార్లు గమనించాను ముసలివాళ్ళు ఇలా కొంచెం మొండిగా ఉండటం. ఒకోసారి కాస్త చాదస్తంగా కూడా కనిపిస్తుంటారు. ఆ రోజు పాపం ముసలావిడ ఒక్కతే వచ్చింది అనుకుంటూ ఆవిడని గమనిస్తూ ఆవిడ వెనకాలే బస్ దిగిపోయాను నా బ్యాగ్ బస్లోనే వదిలేసి. నేను వెంటనే అయ్యో అనుకునేలోపే బస్ వెళ్ళిపోయింది. అప్పుడే కొత్తగా జర్మనీ వచ్చిన రోజులేమో పోయిన బ్యాగ్ దొరికే అవకాశం ఉందని తెలీక నాకు చాలా ఏడుపొచ్చేసింది. అంత బాధ ఎందుకంటే బ్యాగ్ పోయిందని కాదు. బ్యాగ్లో బ్యాంక్ కార్డులతో సహా ఉన్న వాలెట్, ఫోన్, పాస్పోర్ట్, మా ల్యాబ్, ఇన్స్టిట్యూట్ మొత్తానికీ అవసరమైన ఎలక్ట్రానిక్ కీస్, ఇంటి తాళాలూ సర్వం అందులోనే ఉన్నాయి. ఆ బస్సేమో పక్క ఊరికీ, ఈ ఊరికీ మధ్యన తిరిగేది. ఆ రోజుకి అదే ఆఖరి బస్సు కాబట్టి మళ్ళీ ఇక్కడికి రాదు. తెల్లారితే ఆదివారం ఆ బస్సుండదు. ఉన్నా ఏ రోజు ఏ బస్సులో ఏ డ్రైవర్ ఉంటాడో ఎవరికి తెలుసు. అన్నట్టు ఇక్కడ బస్సుల్లో కండక్టర్లు ఉండరు. డ్రైవరే టికెట్లు కూడా ఇస్తుంటాడు. ఇంక చూడండి ఆ రోజు బ్యాగ్ పోయిందని మామూలు టెన్షన్ కాదసలు. మా స్నేహితుల్లో ఇద్దరబ్బాయిలు ఉన్నపళంగా మూడు కిలోమీటర్ల పైన పరుగెత్తి ఆ బస్ తిరిగొచ్చే ఇంకో బస్టాండుకి వెళ్ళి ఎలాగైతేనేం ఆ బస్సుని పట్టుకోగలిగారు. అంత పరుగులు పెట్టి ఆయాసపడుతూ వెళ్ళిన వీళ్ళని చూసి నవ్వుతూ ఆ బస్ డ్రైవర్ "ఇప్పుడే గమనించాను బస్సులో ఎవరో బ్యాగ్ మర్చిపోయిన సంగతి. చాలా కష్టపడి వచ్చినట్టున్నారు. మీరెప్పుడైనా బస్సుల్లో ఏవైనా మర్చిపోతే భయపడక్కర్లేదు. వీటిని తీసుకెళ్ళి సెంట్రల్ ఆఫీస్లో భద్రపరుస్తాం. మీరు ఆ ఆఫీస్ పని వేళల్లో వెళ్ళి మీ వివరాలు చెప్పి మర్చిపోయిన మీ వస్తువులు తీసుకెళ్ళవచ్చు" అని చెప్పాడట. అప్పుడు బోల్డు ఆనందంతో పాటు ఆశ్చర్యంగా కూడా అనిపించింది. మరీ చాలా ఊర్లు దాటి వెళ్ళే రైళ్ళలో గొడుగులు లాంటివి మర్చిపోతే చెప్పలేము గానీ చాలా చోట్ల సాధారణంగా పోయిన వస్తువులు దొరుకుతాయి.

మనకి క్రికెట్ పిచ్చి ఉన్నట్టే వీళ్ళకి సాకర్ పిచ్చి బాగా ఉంటుంది. సాకర్ మ్యాచులు జరిగేప్పుడు అందరూ ఎంత ఉత్సాహంగా వాళ్ళ జట్టుని సపోర్ట్ చేస్తూ ఆటని ఆస్వాదిస్తారో ఎప్పుడైనా వాళ్ళ ఆటగాళ్ళు చెత్తగా ఆడి ఓడిపోయినప్పుడు కూడా అంత ఓపిగ్గా ఉంటారు. వాళ్ళ జట్టు గెలిచినప్పుడు అరుపులు, కేకలతో దద్దరిల్లిపోతే ఓడిపోయినప్పుడు అంతటా నిశబ్దం కనిపిస్తుంది. అంతకు మించి ఆటగాళ్ళ మీద



మితిమీరిన కోపం, అసహనం ప్రదర్శించినట్టు నేనైతే ఎప్పుడూ చూడలేదు. అలాంటి వారు ఒకటీ అరా ఎక్కడైనా ఉంటారేమో తెలీదు గానీ చాలామంది మాత్రం స్పోర్టివ్ గా తీసుకున్నట్టే కనిపిస్తారు.

ఇక క్రమశిక్షణ, సమయపాలన విషయానికొస్తే జర్మన్లు చాలా పద్ధతిగా ఉంటారు. ఉద్యోగ సంబంధిత మీటింగుల కోసమనే కాదు, వ్యక్తిగతంగా ఎవరింటికన్నా పార్టీకో, భోజనానికో వెళ్ళేటప్పుడైనా సరే సరిగ్గా ఏ టైమంటే ఆ టైమే! బస్సులు, ట్రాములు, రైళ్ళు కూడా ఎప్పుడూ నిమిషాలతో సహా సరైన టైముకే నడుస్తుంటాయి. ఏడు గంటల ముప్పై రెండు నిమిషాలకి ఈ స్టాప్లో బస్ రావాల్సి ఉంటే అది సరిగ్గా ముప్పై రెండుకే వస్తుంది. మన వాచీలో సరైన టైము పెట్టుకోడం కూడా చాలా అవసరం ఇక్కడ. అరనిమిషం తేడాతో ట్రైన్ మిస్సయిన సందర్భాలు చాలానే ఉన్నాయి నాకు. ఇక్కడికొచ్చిన కొత్తల్లో బస్సుల కోసం ఎన్నిసార్లు పరిగెత్తాల్సి వచ్చేదో. ఒకోసారి అరనిమిషం ఆలస్యమైనాసరే బయట మనం కనిపిస్తూ ఉన్నాసరే లోపలున్న బస్ డ్రైవర్లు, ట్రైన్ డ్రైవర్లు తలుపు తియ్యనంత ఖచ్చితంగా ఉంటారు. అప్పుడప్పుడూ శీతాకాలంలో మంచు విపరీతంగా కురుస్తున్నప్పుడు మాత్రం దూరం నుంచి రావాల్సిన రైళ్ళు కాస్త ఆలస్యంగా నడుస్తుంటాయి.




ఇక్కడ వసంతం, వేసవి కాలంలో ఎక్కడ చూసినా చెట్ల నిండా విరగబూసిన పువ్వులు, కాయలు, పండ్లు కనిపిస్తున్నా ఎవ్వరూ కోసినట్టే కనిపించరు. ఇళ్ళ ముందంటే సరే గానీ కొన్ని చోట్ల చుట్టూ ఎలాంటి కంచెలు లేకుండా చిన్న చిన్న తోటల్లా ఆపిల్ చెట్లు, చెర్రీ చెట్లు విరగకాసి ఉంటాయి. వాటి జోలికి కూడా ఎవరూ వెళ్ళరు. కొన్ని చోట్ల పండ్లన్నీ నేలరాలిపోవడం కూడా కనిపిస్తూనే ఉంటుంది. మా వీధిలో ఒక కార్యాలయం ముందు ఒక ఐదారు ఆపిల్, పియర్ చెట్లు ప్రతీ ఏడాదీ విరగ కాస్తుంటాయి. ఒకసారి వాళ్ళు ఆ చెట్లకి ఒక నోటీస్ పెట్టారు. ఏంటా అని చూస్తే "ఈసారి కాయలు ఇంకా పాకానికి రాలేదు కాబట్టి అప్పుడే కోయకండి" అని రాసి ఉంది. భలే అనిపించింది. నేనింకా ఈ



చెట్ల పండ్లు కోస్తే శిక్షార్హులు అన్నట్టు ఏమైనా హెచ్చరిక రాసారేమో అనుకున్నా. :-)

కొన్ని చోట్ల ఎక్కువగా పొలాలకి, 'హైవే'లకి దగ్గర్లో చిన్న చిన్న పూల తోటలు ఉంటాయి. వాటి చుట్టూ కంచె ఏమీ ఉండదు. కాపలాకి కూడా ఎవరూ ఉండరు. అక్కడ బోర్డు మీద ఏ రకం పువ్వులు ఎంత ఖరీదో రాసి, పువ్వులు తెంపుకోడానికి రెండో మూడో చాకులు, అలాగే మనం కోసుకున్న పువ్వుల డబ్బులు వెయ్యడానికి హుండీలాగా చిన్న డబ్బా ఉంటుంది. ఎవరైనా వెళ్ళి అందులో డబ్బులు వేసి పువ్వులు తెచ్చుకోవచ్చు. ఇక్కడ అందరూ ఇళ్ళల్లో తాజా పువ్వులు పెట్టుకోడానికి ఇష్టపడతారు కాబట్టి చాలామందే వచ్చి కోసుకుపోతుంటారు. కానీ మొదటిసారి అలాంటి తోట చూసినప్పుడు నేనెంత ఆశ్చర్యపోయానో అసలు. తోటి మనుషుల మీద ఎంత నమ్మకం మోసం చెయ్యకుండా డబ్బులిచ్చి పువ్వులు తీసుకెళతారని, అలాగే జనాలు కూడా కష్టపడి తోట నాటిన వారి నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా ఎంత నిజాయితీగా ధర చెల్లించి పూలు కోసుకువెళుతున్నారోనని భలే సంతోషమనిపించింది.

ప్రపంచ వ్యాప్తంగా విదేశాల్లో వృత్తి ఉద్యోగాలు నిర్వహిస్తున్న భారతీయులు, ఆ మాటకొస్తే ఆసియా నుంచి వచ్చిన వారి మీద వృత్తిపరంగా మిగతా వారి మీద కంటే ఎక్కువ ఒత్తిడి ఉంటుందని, ఒకేలాంటి ఉద్యోగస్థాయిలో ఉన్నాసరే మిగిలినవారికన్నా వీరి నుంచి ఎక్కువ పని, నైపుణ్యం ఆశిస్తారని అందువల్ల వారి అంచనాలని అందుకోవడం కోసం, ఆ ఒత్తిడి తట్టుకోవడం కోసం అందరి కంటే కాస్త ఎక్కువే పని చెయ్యాల్సి వస్తుందని అంటూ ఉంటారు. అందునా మాలాంటి సైన్సు పరిశోధనా రంగాల్లో ముందే ఒత్తిడి ఎక్కువ. కానీ ఎక్కడో ఒకరో ఇద్దరో తప్పిస్తే ఎక్కువ శాతం మంది ప్రొఫెసర్లైనా, కంపెనీల్లో మేనేజర్లు, యాజమాన్యం అయినా మనల్ని మాత్రమే ఒత్తిడి చేసేది తక్కువ. నిజానికి ఇక్కడ ఉద్యోగానికి ఎంత విలువ ఇస్తారో వ్యక్తిగత జీవితానికి అంతకన్నా కొంచెం ఎక్కువే విలువిస్తారు అది వారిదైనా, వారి కింద పని చేసేవారిదైనా సరే. వారాంతాల్లో పని చెయ్యమని, ఆఫీస్ పని గంటల కన్నా ఎక్కువ పని చెయ్యమనే హుకుంలేవీ ఇక్కడ ఉండవు. అప్పుడప్పుడూ క్లిష్టసమయాల్లో అవసరం అయినప్పుడు ఎవరూ చెప్పకుండానే ఎక్కువ శ్రమ తీసుకోడానికి అందరూ సిద్ధపడే ఉంటారు. వారాంతాలు రెండు రోజులూ, సంవత్సరం పొడవునా పదికి పైగా వచ్చే పబ్లిక్ హాలిడేస్, ఆరోగ్య కారణాల వాళ్ళ పెట్టే సెలవులు కాక ప్రతీ ఒక్కరికీ పాతిక రోజుల పైనే సెలవలు తీసుకునే అవకాశం ఉంటుంది. ముప్పై ఏళ్ళు పైబడిన వారికి వయసుతో పాటుగా ఇంకా సెలవలు పెరుగుతుంటాయి. రీసెర్చ్ ఫీల్డ్ లో మాకుండే టెన్షన్స్ వల్ల ఎక్కువ రోజులు సెలవలు తీసుకోకుండా ఉంటే ఒకోసారి ఆఫీసు వాళ్ళే గుర్తు చేస్తుంటారు చాలా సెలవలు ఉన్నాయి వాడుకోమని. ప్రతీ ఏడాది క్రిస్మస్, ఈస్టర్ లాంటి పండగలప్పుడే కాకుండా ఎండాకాలంలో కనీసం రెండు వారాలన్నా సెలవలు తీసుకోవడం ఇక్కడ దాదాపూ ప్రతీ ఒక్కరూ చేసే పని. ఈ కారణాల వల్ల ఇక్కడ ఎంత బిజీగా విధి నిర్వహణలో మునిగిపోయేవారికైనా కుటుంబంతో గడపడానికి, మధ్య మధ్యలో సెలవలు తీసుకుని రిలాక్స్ అవ్వడానికి వెసులుబాటు బాగానే ఉంటుంది.

మొత్తానికి ఇక్కడ జనాలు కాస్త ఎక్కువ ముభావంగా ఉంటారేమో, తొందరగా కలవరేమో అని అప్పుడప్పుడూ అనిపించినా సరే వీళ్ళ దగ్గరినుంచి నేర్చుకోవాల్సిన సుగుణాలు, ఆచరణలో పెట్టాల్సిన మంచి లక్షణాలు చాలానే ఉన్నాయనిపిస్తుంటుంది. ముఖ్యంగా నా గురించి నేను చూసుకుంటే చాలన్నట్టు కాకుండా, వారిపై ఏ నిఘా, అజమాయిషీ ఉన్నా లేకపోయినా సరే వారి వారి సామాజిక బాధ్యతలని విస్మరించకుండా ఉండటమే ఎన్నో చారిత్రిక ఆటుపోట్లకి తట్టుకుని కూడా వీరి జాతిని అభివృద్ధిపథంలో ముందు వరుసలో నించోబెడుతోందని నాకనిపిస్తుంది. ప్రభుత్వ సంస్థలైనా, ప్రైవేటు సంస్థలైనా మనం ఏదైనా పని మీద వెళ్ళినప్పుడు ఆయా అధికారులు వ్యవరించే తీరు, కేవలం ప్రభుత్వం ఏదో చేసుకెళ్ళి పోవడం కాకుండా పౌరులు కూడా చాలావరకు బాధ్యతాయుతంగా నడుచుకోవడం ఇవన్నీ ఇక్కడ నివసించే వారి జీవితాన్ని మరింత భద్రంగా, ప్రశాంతంగా గడపగలిగేట్టు చేస్తుంటాయని నా అభిప్రాయం.

●●●

# ఎండాకాలం.. వానలు కురిసే కాలం!



జూన్ నెల వచ్చిందంటే చాలా ఇళ్ళ ముందు తోటల్లో తెలుపు నుంచి ఎరుపు దాకా రకరకాల లేత, ముదురు గులాబీ వర్ణాల్లో దోసిట్లో ఇమడనంత పరిమాణంలో రంగురంగుల వెన్నముద్దల్లా విరిసే Peonies, వీధి వెంట వెళుతుంటే పదడుగుల దూరం నుంచే ఘాటైన పరిమళంతో ఆకర్షించే Lilacs తెలుపు, లేత ఊదా రంగు నుంచీ, ముదురు వంగపండు రంగు దాకా గుత్తులు గుత్తులుగా చెట్ల నిండా విరగబూసి ఆహ్లాదాన్ని పంచుతుంటాయి. స్ప్రింగ్ దాటి సమ్మర్ లోకి వస్తున్నా చెర్రీ బ్లూమ్స్, టులిప్స్ లాంటి పూవుల సీజన్ అయిపోయినా ఇంకా రంగురంగుల కొత్త రకాలైన పువ్వులు పుట్టుకొస్తూనే ఉంటాయి. అసలు ఇక్కడ మొక్కల్లో జీవం కనపడేదే ఇంచుమించు ఏడాదిలో సగం రోజులు. అందులో మోడులు చిగురించి పచ్చబారే సమయం పోయి



మిగిలిన సమయంలోనే ఎన్నెన్ని రకాల పూల మొక్కలు పుడుతుంటాయో! క్రమపద్ధతిలో స్టేజీ మీద వారి వారి పాత్రలని పోషించి నిష్క్రమించే కళాకారుల్లాగా ఎవరెవరికి కేటాయించిన సమయంలో ఆయా పువ్వులు వికసించి మాయమైపోతుంటాయి. స్ప్రింగ్

మొదట్లో కనిపించే పూవులు తర్వాత నెలకి కనపడవు, మే నెలలో పూసే పువ్వులు జూన్ వచ్చేసరికి కనుమరుగైపోయి మరింకేవో కొత్త రంగులు సందడి చేస్తుంటాయి. మనకి కూడా ఇండియాలో బోల్డు రకాల పువ్వులు పూస్తాయి గానీ మరీ ఇంత తక్కువ వ్యవధిలో ఎడారిలా మారిపోయి ఎండిన మోళ్ళు మిగిలిన పరిసరాల్లో ఇంత వేగంగా మారిపోతున్న రంగుల్ని చూస్తుంటే మరింత అబ్బురంగా అనిపిస్తుంది.

సూర్యభగవానుడు కాస్త ఉదారంగా ఎక్కువ ప్రేమ కురిపించే దేశంలో పుట్టి పెరిగాం కాబట్టి మనల్ని వేసవి సెలవులు, మామిడి పళ్ళు , తాటి ముంజెలు, మల్లెపూలు లాంటి వేసవి తాయిలాలన్నీ ఎంత ఊరించినా సరే ఊపిరి సలపనివ్వని ఉక్కపోతలు, వడగాల్పులు ఎండాకాలాన్ని పూర్తిగా ప్రేమించనివ్వవు. రోళ్ళు సైతం పగిలే రోహిణీ కార్తె ఎండలు ముదిరిన దగ్గర్నుంచీ వేడి భరించలేక హుస్సూ బుస్సూ అనుకుంటూ ఎప్పుడెప్పుడు వానాకాలం వస్తుందాని ఎదురు చూస్తూ ఉంటాం. జూన్ నెల వస్తూనే భానుడి ప్రతాపానికి మంగళం పాడేస్తూ జలజల రాలే తొలకరి జల్లు ఇన్నాళ్ళూ ఎండలకి బండబారిపోయిన మట్టి గుండెలపై చిరుజల్లులు చిలకరించి తడిసిన మట్టి పరిమళంతో వర్షఋతువుకి స్వాగతం పలుకుతుంది. రోహిణీ కార్తె పోయి ఏరువాక పున్నమి వచ్చేసరికి తొలకరి వానలు పడి రైతన్నలందరూ దుక్కి దున్ని పొలం పనులు మొదలుపెడతారు. ఇంక ఆ తర్వాత ఋతుపవనాల రాకతో పొలం పనులు జోరందుకుంటాయి. వాతావరణం సహకరించి వానలు సవ్యంగా సమయానికి పడితే రైతుల కష్టం ఫలించి ధాన్యలక్ష్మి ఇంటికొస్తుంది. దాదాపు ప్రతి ఏడాదీ విధిగా కురిసే భారీ వర్షాలు, రోజుల తరబడి ముసురు పట్టే తుఫాన్లు, వర్షాల తీవ్రతని బట్టి వాగులు, నదులు పొంగి పొలాలని, ఊళ్ళని ముంచేసే వరదలు.. ఇది మనకి తెలిసిన ఎండాకాలం వానాకాలం కదా!


ఇంటి ముందు విరగబూసిన చెర్రీ చెట్టు, ఇంటి పక్కనే గలగలా పారే నీళ్ళు.. ఇంతకన్నా వైభోగం ఇంకేం కావాలి!

ఇక్కడ జర్మనీలో జూన్ నెల ఎండాకాలానికి స్వాగతం పలుకుతుంది. జూన్, జూలై, ఆగస్ట్ మూడు నెలలు వేసవికాలంగా చెప్పుకోవచ్చు. జూన్ వచ్చేసరికి అడపా దడపా వీచే చలిగాలులు మాయమైపోయి మెత్తటి నీరెండ కాస్తా బాగా ముదిరి చురుక్కుమనిపించేంత పదునెక్కుతాయి. వేసవి ఉష్ణోగ్రతలు ఇరవై డిగ్రీల సెంటీగ్రేడ్ దాటి గరిష్ఠంగా ముప్పై డిగ్రీల దాకా వెళ్తాయి. ఇక్కడ వేసవి ఉష్ణోగ్రత ముప్పై దరిదాపుల్లోకి గానీ వెళ్ళిందంటే ఇండియాలో మనం గనక యాభై డిగ్రీల దాకా వెళ్తోందని బెంబేలెత్తిపోయినట్టే ఉంటుంది పరిస్థితి. ఎండల తీవ్రతకి ముసలీ ముతకా చనిపోతున్నారని కూడా వార్తలు వస్తుంటాయి. ఏంటీ ముప్పై డిగ్రీల ఎండకే అంత ఉపద్రవమా అని వినడానికి ఆశ్చర్యంగా అనిపిస్తుంది గానీ నిజంగానే అంత తీవ్రంగా అనిపిస్తుంది. నెలల

తరబడీ చలిలో మగ్గిపోయి ఉండటం వల్లనో, మరి వాతావరణంలో తేమశాతంలో మార్పులో తెలీదు గానీ ముప్పై డిగ్రీలంటే ఇండియాలో ఎండల కన్నా ఇక్కడ చాలా తీక్షణంగా గుచ్చుకున్నట్టు అనిపిస్తుంది. ఎండలోకి వెళ్ళిన కాసేపటికే తలనొప్పి వచ్చేస్తుంది నాకైతే. కానీ ఎంత మండిపోతున్నా ఇక్కడి జనాలు మాత్రం ఎండని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరు. దానికి తోడు చాలామందికి టేనింగ్ పిచ్చి ఒకటుంటుందేమో ఎర్రటి ఎండల్లో కూడా 'ఏమి హాయిలే హలా..' అని విహరిస్తూ తెగ ఆనందించేస్తుంటారు. గ్లోబల్ వార్మింగ్ వల్లనో ఏమో గానీ ప్రపంచవ్యాప్తంగా ఉన్నట్టే ఇక్కడ కూడా ఏడాదేడాదికీ అనూహ్యమైన మార్పులు వస్తున్నాయి. రానురానూ ఎండల తీవ్రత పెరుగుతూ పోవడం, ఒకో సంవత్సరం చలికాలంలో విపరీతంగా మంచు కురిస్తే మరో సంవత్సరం పెద్దగా మంచు పోత లేకపోవడం.. ఇలా ఋతువుల్లో సహజంగా రావాల్సిన మార్పుల కన్నా మితిమీరిన మార్పులు కనిపిస్తున్నాయి.

అయితే జర్మనీలో ఎండాకాలం భరించలేనంత కష్టంగా ఉంటుందా అంటే కాదనే చెప్పాలి. ఎందుకంటే ఎండాకాలమంతా వానలు కురుస్తూనే ఉంటాయి కాబట్టి హాయిగానే ఉంటుంది. మనలాగా ఇక్కడ ప్రత్యేకంగా వర్షాకాలం అంటూ ఏమీ ఉండదు. ఏడాది పొడవునా వానలు కురుస్తూనే ఉంటాయి. మిగతా నెలలతో పోల్చి చూస్తే వేసవి నెలల్లోనే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. అయితే 365 రోజుల్లోనూ వాన ఎప్పుడొస్తుందో, ఎంత గట్టిగా కురుస్తుందో, ఎంతసేపు కురిసిపోతుందో అనేది ఖచ్చితంగా చెప్పలేము. వాతావరణ కేంద్రం వారు సరిగ్గానే అంచనా వేసినా సరే ఏ రోజెలా ఉంటుందో చెప్పగలరు కానీ మరీ నిమిషాల వ్యవధిలోనే ఎండ, వాన, అంతలోనే రెండూ కలిసి హరివిల్లు, మళ్ళీ కాసేపటికి అది కూడా మాయమై అంతా మాములైపోయే వాతావరణం గురించి ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు కదా! కొంతమంది ఇక్కడ వాతావరణం అడ్డదిడ్డంగా మారిపోవడం అంటూ ఏం ఉండదు, మనమే వాతావరణానికి తగ్గట్టు దుస్తులు ధరించి బయటికి వెళ్ళము. పొరపాటు మనదే తప్ప వాతావరణానిది కాదంతే.. అని వెనకేసుకొస్తారు. ఇక్కడ సర్వకాల సర్వావస్థల్లోనూ అందరి దగ్గరా ఎప్పుడూ గొడుగో, రెయిన్ కోటో ఉంటుంది. ఎప్పుడన్నా బయట వీధుల్లో తిరిగేప్పుడు ఉన్నట్టుండి వర్షం వస్తే వెంటనే అందరి చేతుల్లో గొడుగులు ప్రత్యక్షమైపోతాయి.

ఎప్పుడైనా ఒకసారి థండర్ స్టార్మ్ ఉందంటూ వార్తల్లోనూ, రేడియోల్లోనూ జాగ్రత్తలు చెప్తుంటారు. ఇక్కడికొచ్చిన కొత్తలో నేను ఇలా థండర్ స్టార్మ్ అంటే ఎన్ని రోజులు ముసురు పడుతుందో, ఎంత పెద్ద ఉరుములు, మెరుపులు వస్తాయో, మన ఊర్లో ఇలాంటివి వచ్చినప్పుడు ట్రాన్స్ఫార్మర్లు పేలి కరంటు పోయినట్టు ఏం విపరీతాలు జరుగుతాయో అనుకున్నాను. తీరా చూస్తే ఏదో పది మెరుపులు, నాలుగు ఉరుములు ధమధమా అనిపించేసి పోయింది తుఫాను. అయినా ఇన్నేళ్ళ లో ఇక్కడ కరంటు పోవడం నేను ఒకే ఒక్కసారి చూసాను. అది కూడా గట్టిగా అరనిమిషం కూడా పోలేదు. ఓ.. కరంటు పోయిందా అనుకునేలోపు వచ్చేసింది. ఇక్కడి వానలు, ఉరుములు మన ఆంధ్రదేశంలో చూసిన తుఫాన్లతో పోలిస్తే అసలు స్టార్మ్ కిందే లెక్క కాదు గానీ మరి పాపం వీళ్ళు చూసే వర్షాలతో పోలిస్తే వీళ్ళకివే పెద్దవన్నమాట. ఒకోసారి ఈదురు గాలులకి అక్కడక్కడా చెట్లు పడిపోవడం మినహా మరీ భారీ నష్టాలు

వాటిల్లేంత కుంభవృష్టి అయితే కురవదు ఇక్కడ. అలాగే వీళ్ళకి వరదలంటే ఏమిటో అసలు తెలియదని కాదు కానీ మనంత ఉధృతంగా ఉండవు. ఇక్కడ కూడా అప్పుడప్పుడూ పైన ఆల్ప్స్ కొండల్లోని మంచు ఎక్కువ పరిమాణంలో కరిగిపోవడం వల్ల దరిమిలా నీళ్ళు, వానలు ఎక్కువైపోయి నదులు పొంగి కొన్ని ఊర్లు వరద ముంపుకి గురవుతాయి. 2011 లో Rhine, Mosel నదుల వల్ల Cologne, Bonn, Koblenz నగరాల్లో వచ్చిన వరదలు ఇలాంటివే. కానీ మరి మనంత భారీ వానలు, పెను వరదలు సాధారణంగా ఉండవు కాబట్టి ఊరు మధ్యలో నుంచి పారే చిన్న చిన్న వాగులని ఆనుకునే చాలామంది ఇళ్ళు కట్టుకుంటారు. వాళ్ళ తోటలోనో, బాల్కనీలోనో కూర్చుంటే పక్కనే ఇంటి గోడనానుకుని ప్రవహించే నీళ్ళని చూడొచ్చు. మొదట్లో అంత ధైర్యంగా ఎలా కట్టుకున్నారా అనిపించినా ఈ చిన్న చిన్న నీటి పాయలు ఉన్నట్టుండి పొంగేంత పెద్ద వానలు ఇక్కడ ఎలానూ పడవు కాబట్టి ఏం ఫరవాలేదని తర్వాత అర్థమైంది. అలా ఇంటి పక్కనే గలగలా పారే నీళ్ళంటే భలే హాయిగా ఉంటుంది కదా!



వేసవి రాత్రి ఎనిమిది గంటలు దాటాక పలకరిస్తున్న ఎండా వానా..

రోజుకి కనాకష్టంగా నాలుగైదు గంటలు మాత్రమే సూర్యదర్శనానికి అలవాటు పడిపోయిన చలికాలపు చీకటి గుర్తులని చెరిపేస్తూ ఎండాకాలంలో రోజుకి దాదాపు పదిహేను, పదహారు గంటల సేపు సుదీర్ఘమైన పగలు ఉంటుంది. అంటే ఉదయాన్నే అయిదింటి కన్నా ముందే సూర్యోదయం అయిపోయి రాత్రి తొమ్మిది దాటాక గానీ సూర్యాస్తమయం అవదన్నమాట. నేను మొదటిసారి జర్మనీ వచ్చింది ఆగస్టు నెలలో. వచ్చిన రోజే ఒక ఇండియన్ అమ్మాయి పరిచయం చేసుకుని డిన్నర్ కి తనింటికి తీసుకెళ్ళింది. మధ్యాహ్నం వచ్చిన దగ్గర్నుంచి చకచకా సమయం గడిచిపోయి ఇంకో ఇద్దరు ఇండియన్ స్నేహితులతో కలిసి మాట్లాడుతూ భోజనాలు అయేసరికి బయట ఇంకా వెలుతురు ఉంది. పక్కనే ఉన్న పార్కులో పిల్లలు గట్టిగా అరుస్తూ ఆడుకుంటున్నారు. ఆలస్యం అవుతుందేమో ఇంక వెళ్ళి పడుకోవాలి అని వాళ్ళు అంటే నాకు ఆశ్చర్యం వేసింది ఇంత త్వరగా పడుకోవడం ఏంటా అని. అదే మాటంటే ఇప్పుడు టైమెంతయిందో తెలుసా.. చూడు అన్నారు. రాత్రి పదవుతోంది అప్పుడు. బయటికి చూస్తేనేమో సాయంత్రం ఏడు గంటలు అవుతున్నట్టుంది. నా వాచీలో ఇంకా ఇండియా టైమే ఉందేమో, మార్చుకోడం మర్చిపోయానేమో అన్నంత భ్రమ కలిగింది నాకు. మొదటిసారి అలాంటి వాతావరణం చూసి చాలా ఆశ్చర్యపోయాను. సూర్యాస్తమయాలు ఎంత ఆలస్యం అవుతాయో సూర్యోదయాలు అంత తొందరగా వచ్చేస్తాయి కాబట్టి పొద్దున్నే త్వరగా నిద్ర లేచే అలవాటు లేనివాళ్ళకి కూడా ఎండాకాలం వస్తే తొందరగా మెలకువొస్తుంది. చలికాలంలో మొహం చాటేసినందుకు గానూ ఇలా బాకీ తీర్చుకునే ప్రయత్నం చేస్తాడేమో సూర్యుడు అనిపిస్తుంది నాకు. జూలై సూర్యుడు రెండింతలు పని చేస్తాడని అర్థం వచ్చేలా ఒక జర్మన్ సామెత కూడా ఉంది. :-)

ఇలా ఇంత ఆలస్యంగా చీకటి పడే ఎండాకాలం వాతావరణం గురించి మాట్లాడుకుంటుంటే ఒకసారి మా ప్రొఫెసర్ చెప్పారు. పెద్దవాళ్ళం మనకే వాతావరణం ఇలా ఉంటే వెళ్ళి పడుకోబుద్ధి కాదు, పడుకున్నా నిద్ర రాదు. అలాంటిది చిన్నపిల్లలతో అయితే భలే చిక్కు. మామూలుగా రాత్రి ఏడూ ఏడున్నర కల్లా పడుకోబెట్టేసే అలవాటు అయితే ఎండాకాలం బయట ఇంకా వెలుతురుగా ఉంది కదాని ఆడుకుందాం అనుకుంటారు. వాళ్ళ చేత ఆటలు మాన్పించి పడుకోబెట్టేసరికి తల ప్రాణం తోకకొస్తుంది. చీకటి పడలేదు అన్నదే తెలుసు తప్ప ఇలా రకరకాల టైములూ అవీ వాళ్ళ చిన్ని బుర్రలకి అర్థం కావుగా అన్నారు. నిజమే కదా అనిపించింది. చాలా చలి దేశాల్లో లాగానే జర్మనీలో కూడా చలికాలం, ఎండాకాలం మారేప్పుడు డే లైట్ సేవింగ్ టైం అమలులోకి వస్తుంది. ప్రతి సంవత్సరం మార్చి చివరి ఆదివారం, అక్టోబర్ చివరి ఆదివారంలో ఈ మార్పు ఉంటుంది. అంచేత ఎండాకాలంలో ఇండియా టైము జర్మనీ కన్నా మూడున్నర గంటలు ముందుంటే, చలికాలంలో మాత్రం అక్కడికీ ఇక్కడికీ నాలుగున్నర గంటల తేడా వచ్చేస్తుంది.

మొక్కజొన్న తోటలో.. ముసిరే నీరెండల్లో..



మన భారతదేశపు భౌగోళిక, వాతావరణ పరిస్థితులు చాలా వరకు సేద్యానికి అనుకూలంగా ఉండటంతో మనది మన వ్యవసాయాధారిత దేశం అయింది. కానీ జర్మనీలో ఏడాదిలో రెండొంతులు చలే ఉంటుంది కాబట్టి వ్యవసాయానికి అంత అనుకూలం కాకపోవడం వల్ల ఇక్కడ వ్యవసాయ రంగం మిగతా రంగాలతో పోల్చుకుంటే చిన్నదనే చెప్పుకోవాలి. అలాగని వ్యవసాయాన్ని పెద్దగా పట్టించుకోరని మాత్రం కాదు. వేసవి కాలంలో గోధుమ, మొక్కజొన్న, బార్లీ, బంగాళాదుంప, షుగర్ బీట్, ద్రాక్ష తోటలు, ఇంకా రకరకాల కూరగాయలు, పండ్లు పండిస్తుంటారు. వీటితో పాటు పాడి, మాంసం (బీఫ్, పోర్క్) కోసం పెంచే జంతువుల ఫార్మ్స్ చాలానే ఉంటాయి. కోళ్ళు, మేకలు, టర్కీ లాంటివి కూడా పెంచినా ఈ దేశంలో వినియోగపరంగా చూసినా, బయటి దేశాలకి ఎగుమతుల పరంగా చూసినా బీఫ్, పోర్క్ లకి డిమాండ్ ఎక్కువ. అలాగే

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు..



పాలు, గుడ్లు ఉత్పత్తి చేసే ఫార్మ్స్ కూడా విరివిగానే ఉంటాయి. మన దగ్గర కన్నా కూడా రకరకాల పాల ఉత్పత్తులకి ఇక్కడ వినియోగం ఎక్కువ. పాల నుంచి తయారు చేసే కొన్ని వందల రకాల యోగర్ట్ లు, ఛీజ్ లు, క్రీమ్ లు వాడకం విరివిగా ఉంటుంది. మామూలుగా రసాయన ఎరువులు, మందుల వాడకంతో పండించిన వ్యవసాయ ఉత్పత్తులతో పాటు సహజసిద్ధమైన ఎరువులు మాత్రమే వినియోగించే సేంద్రీయ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్) కూడా ఎక్కువే. ఇలా పండించిన ఉత్పత్తుల ఖరీదు ఎక్కువైనా కూడా వీటి వాడకం కూడా ఇక్కడ రోజురోజుకీ పెరుగుతోంది. దాదాపు ప్రతీ సూపర్ మార్కెట్లోనూ అన్నీ కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం లాంటివన్నీ 'బయో' అని లేబుల్ చేసి దొరుకుతాయి.



అసలు మామూలుగానే ఇక్కడ జనాభా తక్కువ కాబట్టి అన్నీ రంగాల్లోనూ వీలైనంత మేరకు యంత్రాలని ఉపయోగించుకోవడం జరుగుతుంది. వ్యవసాయ రంగం కూడా అందుకు మినహాయింపేం కాదు. పొలం దున్నడం దగ్గర నుంచి పంట చేతికొచ్చేదాక వివిధ దశల్లో అవసరమైన పనులన్నీటికీ యంత్రపరికరాలు ఉంటాయి. సమయం ప్రకారం నీళ్ళను చిలకరించడం, వాతావరణంలోని మార్పులని గుర్తించి తద్వారా పంటల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోడానికి వీలయే విధంగా క్లైమేట్ సెన్సర్స్ లాంటి సాంకేతిక పరికరాలు రైతులకి అందుబాటులో ఉంటాయి. ఇంకా వ్యవసాయ రంగ పరిశోధనల ఫలితాలని ఎప్పటికప్పుడు రైతుల దాకా తీసుకెళ్ళడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ ఉంటుంది. రైతులు ఎవరైనా తమ పంట పొలాన్ని మరే విధంగానైనా వాడదలచుకుంటే ప్రభుత్వం దగ్గర నుంచి అనుమతి తెచ్చుకోవాలనీ, అలాగే తమ పంట పొలాలు అమ్మదల్చుకుంటే ముందు ఆ పొలం పక్కనున్న రైతుకే అవకాశం ఇవ్వాలనీ.. ఇలాంటి కొన్ని రైతులకి మేలు చేకూర్చే ప్రత్యేకమైన నిబంధనలు ఈ దేశంలో ఉన్నాయని ఎవరో చెప్పగా విన్నాను.


ట్రాక్టరు, ఆవులు.. కృషీవలుడి ఆస్తులు..

గ్రామీణ ప్రాంతాల్లో ఆవులు, గొర్రెలు మాత్రమే కాకుండా కొంతమంది గుర్రాలని కూడా సాదుకుంటారు. అయితే వ్యాపారం కోసం కాకుండా కుక్కల్నీ, పిల్లుల్నీ పెంచుకున్నట్టు పెంపుడు జంతువుల్లా పెంచుకుంటారు గుర్రాలని. ఊరు బయట పొలాలకి దగ్గరలో చాలా చోట్ల గుర్రపుశాలలు కనిపిస్తుంటాయి. సిటీల్లో ఉండే వాళ్ళకి కూడా కొందరికి గుర్రాలు ఉంటాయి. వాళ్ళు పిల్లల్ని హాస్టల్లో ఉంచి అప్పుడప్పుడూ వెళ్ళి బాగోగుల్ని చూసొచ్చినట్టు, ఎక్కడో గుర్రపుశాలలో చేర్చి వారానికొకసారి వెళ్లి వాటిని శుభ్రం చేసి, కాసేపు గారం చేస్తూ వాటితో సమయం గడిపి వస్తుంటారు. మా కొలీగ్ ఒకావిడకి మూడో నాలుగో గుర్రాలున్నాయిట. ఆవిడ వర్క్ బెంచ్ మీద ఆ గుర్రాల ఫొటోలే పెట్టుకునేది. ఒకసారి ఏదో జబ్బు చేసి వాటిల్లో ఒక గుర్రం చనిపోయిందని ఆవిడ ఆ గుర్రం మీద దిగులుతో కొన్ని నెలలపాటు డిప్రెషన్ లోకి వెళ్ళిపోయింది.

రైతు కుటుంబాల నుంచి వచ్చిన వారు వాళ్ళ పొలాల గురించి, సేద్యం గురించి, పెంపుడు జంతువులతో వారి అనుబంధం గురించి చెప్తుంటే మన దగ్గర పల్లెటూర్లలో ఇంట్లో మనుషుల్లా మెలిగే ఆవులు, గేదెలు, ఎద్దులు, కోడె దూడలు, కోళ్ళూ గుర్తొచ్చి భూమిని నమ్ముకుని సాగే గ్రామీణ జీవనం, ప్రకృతిలో మమేకమైపోయి జీవించే రైతు మనస్తత్వం ఏ దేశంలోనైనా ఒకలానే ఉంటుందేమో అనిపిస్తుంది.

●●●

# చదువుల కబుర్లు..



జర్మనీలో జూలై నెల వచ్చిందంటే నడి వేసవికాలం వచ్చినట్టే లెక్క. పెళపెళలాడే ఎండలు, మధ్య మధ్యలో పలకరించే వానజల్లులతో ఆహ్లాదంగా ఉంటుంది. ఈ కాలంలో ఏ వీధిలో చూసినా గుత్తులు గుత్తులుగా విరబూసిన రంగురంగుల రోజాపూలు, గాలిలో తేలి వచ్చే గులాబీ పరిమళాలు హాయి గొలుపుతూ ఉంటాయి.

ఈ నెలాఖరు నుంచీ దాదాపు ఆగస్టు నెలంతా స్కూలు పిల్లలకి వేసవికాలం సెలవులుంటాయి. ఈ సమయంలోనే అందరూ ఒకటీ రెండు వారాలు సెలవులు తీసుకుని కుటుంబ సమేతంగా ఏదైనా కొత్త ప్రదేశానికి విహారయాత్రకి

వెళ్ళి వస్తుంటారు. ప్రతీ ఏడాదీ తప్పనిసరిగా ఉద్యోగ నిర్వహణకి విరామం ఇచ్చి సెలవులకి వెళ్ళడం ఇక్కడ ఆనవాయితీ. జూలై, ఆగస్టు నెలల్లో కొన్ని షాపులు మూసేసి ఉండి ఇలా ఫలానా తేదీ నుంచి ఫలానా తేదీ దాకా మేము వేసవి సెలవులకి వెళ్తున్న కారణంగా మూసేస్తున్నాము అని తలుపు మీద ప్రకటనలు కనిపిస్తుంటాయి. ఎవరైనా అస్సలు సెలవులకే వెళ్ళలేదంటే కాస్త ఆశ్చర్యంగా, వింతగా చూస్తారంటే ఇది వాళ్ళకి ఎంత అలవాటో తెలుస్తుంది. విధిగా పుస్తకాలు చదవడం, కొత్త ప్రదేశాలను సందర్శించి అక్కడి ప్రకృతి, మనుషులు, పద్ధతులు, సంస్కృతి లాంటివన్నీ తెలుసుకుంటూ మనకి ఎప్పుడూ ఉండే ఇల్లూ, ఉద్యోగం హడావుడిని మర్చిపోయి హాయిగా సెలవుల్లో సేదతీరుతూ మనల్ని మనం చైతన్యవంతం చేసుకుని తిరిగివచ్చి రెట్టించిన ఉత్సాహంతో విధుల్లో చేరడం ఎవరికైనా ఆచరణయోగ్యమైన అలవాటే కదూ! చదువులు, కెరీర్ విషయాల పట్ల ఎంత శ్రద్ధ వహించినా సరే జర్మన్లు వ్యక్తిగత జీవితానికి వాటికన్నా ఇంకొంచెం ఎక్కువ ప్రాముఖ్యతని ఇస్తారు. Usually Germans don't take their work home!

జర్మనీ చదువుల గురించి చెప్పాలంటే కిండర్ గార్టెన్ తో మొదలుపెట్టాలి. ఇవాళ్టి రోజున ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో అవలంబిస్తున్న కిండర్ గార్టెన్ విధానం పంతొమ్మిదో శతాబ్దంలో జర్మనీలోనే పుట్టింది. 'కిండర్ గార్టెన్' అంటే జర్మన్ భాషలో చిన్నారుల తోట అని అర్థం. 1837 లో ఫ్రీడ్రిక్ ఫ్రోబెల్ అనే జర్మన్ విద్యావేత్త పిల్లలు తల్లి ఒడిలోంచి స్కూలుకి వెళ్ళే మధ్యలో ప్రీ స్కూలింగ్ ఉండాలని, అక్కడ వాళ్ళు హాయిగా స్వేచ్ఛగా పూదోటలోని పూలమొక్కల్లా ఎదగాలనే ఉద్దేశ్యంతో ఈ 'కిండర్ గార్టెన్' పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ ఆలోచన ప్రపంచ విద్యావిధానంలో ఎంత ప్రభావం చూపించిందో మనకి తెలిసిందే కదా! రెండేళ్ళ నుంచి ఆరేళ్ళ వయసు పిల్లల దాకా కిండర్ గార్టెన్ కి వెళతారు.




తరవాత ఆరేళ్ళ నుంచీ పదేళ్ళ దాకా ప్రైమరీ ఎడ్యుకేషన్ అయ్యాక సెకండరీ ఎడ్యుకేషన్ స్థాయిలో రకరకాలు ఉంటాయి. బ్యాచిలర్స్, మాస్టర్స్ లాంటి యూనివర్సిటీ స్థాయి ఉన్నత విద్యని అభ్యసించాలనుకునే వారికీ, మరీ అంత పెద్ద చదువుల దాకా వెళ్ళకుండా హైస్కూల్ చదువయ్యాక రకరకాల వొకేషనల్ కోర్సులు, ప్రొఫెషనల్ కోర్సులు చదివి నేరుగా ఉద్యోగాల్లోకి వెళ్ళాలనుకునేవారికి వారి వారి ప్రాధాన్యతలని బట్టి వారు ఎంచుకోవలసిన కోర్సు

డిజైన్ ఉంటుంది. వివిధ రంగాల్లో అవసరమైన స్కిల్డ్ క్రాఫ్ట్స్ మెన్ కోసం వొకేషనల్ కోర్సు అభ్యసించడంతో పాటు ప్రాక్టికల్ ఎక్స్పీరియన్స్ కోసం అప్రెంటిస్ షిప్ లో చేరి వెంటనే ఆయా అర్హతల ఆధారంగా రకరకాల ఉద్యోగాల్లోకి చేరిపోతారు.

జర్మనీలో యూనివర్సిటీ విద్య అభ్యసించాలనుకునే ప్రతీ ఒక్కరికీ జర్మనీ ప్రభుత్వం ఉచితంగా ఉన్నత విద్య అందిస్తుంది. కేవలం జర్మన్ దేశస్థులకే కాకుండా ప్రపంచం ఏ మూల నుంచి వచ్చి ఇక్కడ యూనివర్సిటీల్లో చదువుకోవాలనుకునేవారికి కూడా ప్రత్యేకమైన ఫీజులు వసూలు చేయడం ఉండదు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోలా పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించాల్సిన అవసరం జర్మనీలో లేకపోవడం వల్ల, పలు జర్మన్ విశ్వవిద్యాలయాల ప్రామాణికత ఆయా దేశాల స్థాయిలో ఉండటం వల్ల ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి జర్మనీని ఎంచుకుంటున్నారు. సాధారణంగా ఇక్కడ విద్యాబోధన జర్మన్ భాషలోనే ఉన్నాసరే చాలా యూనివర్సిటీలు ఇంగ్లీషులో బోధించే అంతర్జాతీయ కోర్సులని కూడా అందిస్తున్నాయి. గత పదేళ్ళలో ఇంగ్లీషు మాధ్యమంలో బోధించే కోర్సుల సంఖ్య, వివిధ దేశాల నుంచి ఇక్కడికొచ్చి చదువుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందనే చెప్పాలి.



**మా యూనివర్సిటీ కాంపస్లో లైబ్రరీ**




యూనివర్సిటీ ఉచిత విద్య అందిస్తున్నప్పటికీ ప్రతీ సెమిస్టరుకి చిన్నమొత్తంలో కొంత ఫీజు కట్టాల్సి ఉంటుంది. ఆ ఫీజు కట్టినందువల్ల హాస్టల్, లైబ్రరీ, స్పోర్ట్స్, జిమ్ లాంటి యూనివర్సిటీ కల్పించే అన్నీ రకాల సదుపాయాలనూ, బస్సులు, రైళ్ళు మొదలైన పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ని ఉపయోగించుకోడానికి విద్యార్థి రాయితీలను ప్రత్యేకంగా పొందవచ్చు. కాబట్టి ఆ కట్టే కొద్ది ఫీజు కూడా విద్యార్థుల అవసరార్థమే ఉపయోగపడుతుంది. మాస్టర్స్ చదువుకోడానికి ఇక్కడికి వచ్చే విద్యార్థులకి జర్మన్ భాషతో కొద్ది పరిచయం ఉండాలని నిబంధన ఉన్నట్టుంది. వాళ్ళ ఆసక్తిని బట్టి ఇక్కడికొచ్చాక జర్మన్ భాష మరింత ధారాళంగా నేర్చుకోడానికి ఆయా కోర్సుల ఫీజులో కూడా రాయితీ లభిస్తుంది. రెండేళ్ళ కోర్సు అయిపోయాక వెంటనే ఉద్యోగం రాకపోయినా ఈ దేశంలో చదువుకుని డిగ్రీ సంపాదించుకున్న అర్హత ఉన్నందువల్ల ఒక సంవత్సరం పాటు ఇక్కడే ఉండి ఉద్యోగం వెతుక్కునే అవకాశం కల్పించడానికి జాబ్ సెర్చింగ్ వీసా కూడా ఇస్తారు.

అయితే ఇక్కడకొచ్చి చదువుకోడానికి పైసా ఖర్చు ఉండదా అంటే ఉంటుంది. చదువుకి ఖర్చు లేకపోయినా రెండేళ్ళ పాటు ఇక్కడ బతకడానికి రోజువారీ ఖర్చుల కోసం డబ్బు కావాలి కదా.. జర్మనీలో సాధారణ జీవన స్థాయికి చెందిన ఒక వ్యక్తి కనీస సదుపాయాలతో జీవించడానికి అయ్యే ఖర్చు నెలకి 600 నుంచి 700 యూరోలుగా ప్రభుత్వం లెక్క కట్టింది. కాబట్టి ఆ ప్రకారంగా నెలకి 700 యూరోల చొప్పున ఇక్కడ రెండేళ్ళు ఉండి చదువుకోడానికి అవసరమైన డబ్బు తమతో వెంట తెచ్చుకుంటున్నట్టు మాత్రం వీసా అప్లికేషనులో చూపించాల్సి ఉంటుంది.

నేను గమనించినంతలో మనకీ, ఇక్కడి యూనివర్సిటీలకీ విద్యాబోధనలో ఉన్న తేడా ఏంటంటే ఇక్కడ విషయ పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కి సమానమైన ప్రాధాన్యత ఇస్తారు. మన దగ్గర ప్రయోగ పరిజ్ఞానం తక్కువవడానికి కారణం దానికి అవసరమైన ప్రాథమిక సదుపాయాలు, సాంకేతిక వసతులు సరిపడినంత మేరకు లేకపోవడం వల్లనుకుంటాను. ఇంకొకటి ఇక్కడ పరీక్షా పద్ధతులు మనకంటే పూర్తి భిన్నంగా ఉంటాయి. అంటే, వ్యాసాల్లాగా పేజీల కొద్దీ సమాధానాలు రాయమని అడిగే ప్రశ్నా పత్రాలు ఉండవు. ప్రతీ ప్రశ్నకీ కింద వాళ్ళు ఇచ్చిన కొద్ది చోటులోనే సరైన సమాధానం రాయాల్సి ఉంటుంది. దీనివల్ల విద్యార్థికి మొత్తం ఎంత తెలుసన్నదే కాకుండా పాఠాన్ని ఎంత లోతుగా అర్థం చేసుకున్నాడో, దేన్ని ఎక్కడ ఎంతవరకూ ఉపయోగించాలనే వివేచన ఉందో పరీక్ష చేసే వీలుంటుంది. ముఖాముఖి పరీక్షలు కూడా ఇక్కడ ఎక్కువ. అలాగే బ్యాచిలర్స్ స్థాయి నుంచే ఎప్పటికప్పుడు ఉండే చిన్న చిన్న ప్రాజెక్టు పనులు, థీసిస్ వర్కులు లాంటివన్నీ వారికి ఏ అంశంలో అమితమైన ఆసక్తి ఉందో, ముందు ముందు భవిష్యత్తులో ఎలాంటి కెరీర్ ని ఏర్పరచుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోవడానికి ఎంతో సహకరిస్తాయి.

వేరే దేశాల నుంచీ ఇక్కడ ఉన్నత విద్యని అభ్యసించాలని వచ్చే విద్యార్థులు ఆయా దేశాల్లో సంపాదించుకున్న డిగ్రీలు ఎంత గొప్పగా ఉన్నాసరే వారికి మరలా ఇక్కడ కొన్ని ప్రత్యేక పరీక్షలు పెట్టి జర్మనీలో సంపాదించుకున్న డిగ్రీకి సమాన అర్హత ఉందో లేదో సరి చూసుకుంటారు. పీహెచ్డీ లాంటి అత్యున్నత స్థాయి చదువులకి ఇది తప్పనిసరి. ఆయా యూనివర్సిటీ స్థాయిని బట్టి ఈ నిబంధనలు, పరీక్షల సంక్లిష్టత పెరుగుతూ పోతుంది.

అభివృద్ధి చెందిన అన్నీ దేశాలలో వారి పురోగతికి దోహదం చేసే అంశాలలో అక్షరాస్యత ముందుంటుంది. ఒక్క జర్మనీ అనే కాదు ఏ అభివృద్ధి చెందిన దేశంలోనైనా కనీసం ఉన్నత పాఠశాల స్థాయి దాకా ప్రతీ పౌరుడికీ విద్య తప్పనిసరి. వారు సాధించిన 99% అక్షరాస్యత శాతమే వారి దేశం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందడానికి మొదటి మెట్టు అవుతుంది. ఇంకా అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాలలో నిరక్షరాస్యత అభివృద్ధికి అవరోధంగా నిలుస్తుంది. మనం తగిన కృషి చేసి అక్షరాస్యతా శాతాన్ని పెంచుకుంటూ

పోతే మన దేశాభ్యుదయ మార్గం సుగమమవుతుంది. విద్యావిధానాల్లో వీరందరూ అవలంబించే శాస్త్రీయ పద్ధతులని మనం కూడా ఆకళింపు చేసుకుని అనుసరించగలిగితే, విద్యాసముపార్జన విద్యార్థులందరికీ మరింత ఆసక్తికరంగా సాగే ప్రక్రియలా మార్చుకోగలిగితే, అన్నీ రకాల చదువులకీ, ఉద్యోగ రంగాలకీ సముచిత ప్రాధాన్యం ఇవ్వగలిగితే, చదువులు కేవలం డబ్బులు సంపాదించేందుకే కాదు మనిషిలోని మేధస్సుకు పదును పెట్టడానికి, సృజనాత్మకతను వెలికి తీయడానికి అని గుర్తించగలిగితే, విజ్ఞాన సముపార్జనలో ఉన్న ఆనందాన్ని ఆస్వాదించగలిగేలా విద్యార్థులని తీర్చిదిద్దగలిగితే, వీటన్నిటినీ సుసాధ్యం చేసేలా మన విద్యావ్యవస్థ మారితే మన భవిష్యత్తుని మనమే మరింత గొప్పగా మలచుకోగలుగుతాము కదా!

●●●

# చరిత్ర మిగిల్చిన చేదు జ్ఞాపకాలు..!

**జర్మనీలో ఉష్ణోగ్రతలపరంగా** చూస్తే ఎండలెక్కువ కాసేది ఆగస్టు నెలలోనే కాబట్టి ఇండియాలో మనకి మే నెల లాగా ఇక్కడ ఆగస్టు అని చెప్పుకోవచ్చు. కాకపోతే ఇక్కడ దొరక్క దొరక్క దొరికే ఎండ కాబట్టి ఆగస్టు అంటే అందరికీ మక్కువ ఎక్కువ. జర్మనీలో డాన్యూబ్, రైన్ లాంటి పెద్ద నదులే



నదీప్రవాహాలు.. Isar, Rhine

కాకుండా వాటిల్లో కలిసే చిన్న చిన్న ఉపనదులు దాదాపు ప్రతీ ఊరిలోనూ ప్రవహిస్తూ ఉన్నాయి. జర్మనీలో ప్రవహించే నదులన్నీ చివరికి బాల్టిక్ సీ, బ్లాక్ సీ, నార్త్ సీ.. ఈ మూడు సముద్రాలలో ఏవో ఒకదానిలో కలుస్తాయి. మనకి హిమాలయాలు ఉన్నట్టు జర్మనీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా సరిహద్దుల్లో ఆల్ప్స్ పర్వతాలు ఉన్నాయి. మన గంగానది హిమాలయాల్లో పుట్టినట్టు ఇక్కడ కూడా వేసవికాలంలో ఆ హిమశిఖరాల్లో ఉన్న మంచు కరిగి చాలావరకు నదీజలాలు పుడుతుంటాయి. మా ఊర్లో ఉండే ఇసార్ నది, ఇంకా జర్మనీ, స్విట్జర్లాండ్ లలో ప్రముఖంగా అందరికీ తెలిసిన రైన్ నది ఇలా ఆల్ప్స్ పర్వతాల్లో పుట్టినవే. ఈ నదులే కాకుండా మన కొల్లేరు, ప్రళయకావేరి లాగా ఇక్కడ పెద్ద పెద్ద సరస్సులు చాలా ఉన్నాయి. సంవత్సరంలో ఎక్కువ శాతం చలిలో ఉండే ఈ దేశంలో సరస్సులు కూడా చాలావరకు చలికాలంలో గడ్డ కట్టిపోతాయి. కాబట్టి ఉన్న కొద్ది నెలల వేసవిలో అందరూ నదులు, సరస్సుల్లో ఈతకి వెళ్ళడం, నదీ తీరాన విహారాలే

కాకుండా రకరకాల పడవల్లో బోటింగ్, రాఫ్టింగ్, కానోయింగ్, యాచింగ్.. లాంటి వాటర్ స్పోర్ట్స్ లాంటి వాటి మీద బాగా ఆసక్తి చూపిస్తుంటారు. కొన్ని పెద్ద సరస్సుల్లో లాంచీలో తిప్పే టూర్లు కూడా ఉండి వేసవి కాలంలో సరస్సులు, నదీ తీరాలన్నీ జనాలతో కిటకిటలాడిపోతూ ఉంటాయి.

ప్రపంచవ్యాప్తంగా మానవ నాగరికత ఎప్పటికప్పుడు ఎన్నెన్నో మార్పులకి గురవుతూ కొత్త పోకడలు పోతూ ఉంటుంది. వెనక్కి తిరిగి చరిత్ర వైపు చూస్తే అప్పటి మనుషులు, సంఘటనలు, జీవితాలు అన్నీ ఇప్పటి మనకి చాలా ఆశ్చర్యంగానూ, ఆసక్తిగానూ అనిపిస్తాయి. మన భారతదేశంలో గతంలో మగధ రాజ్యం, కళింగ రాజ్యం, కాకతీయ సామ్రాజ్యం.. ఇలాంటివన్నీ ఉన్నట్టు యూరోపులో, జర్మనీలో కూడా రాజ్యాలు, వాటిని ఏలిన రాజుల చరిత్రలు ఉన్నాయి. రాజుల కాలం పోయాక భీకరంగా జరిగిన మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల మూలంగా జర్మనీలో అన్నీ రకాలుగా తీవ్ర నష్టం వాటిల్లినా సరే ఈ దేశంలో ఇంకా అప్పటి రాచరికపు ఆనవాళ్ళు చాలావరకు భద్రంగానే ఉన్నాయి. గత వైభావానికో, ప్రాభావానికో చిహ్నాలుగా మిగిలిన వాటిని అత్యంత జాగ్రత్తగా నిలబెట్టుకుంటూ వస్తున్నారు వీళ్ళు. జర్మనీలో పెద్ద పెద్ద నగరాలలోనే కాకుండా ఏ చిన్న పట్టణానికి వెళ్ళినా చిన్నవో పెద్దవో పాత రోజుల నాటి రాజుల కోటలు, కట్టడాలు సామాన్య జనాలకి ప్రదర్శనలో పెట్టడం వల్ల పర్యాటకులకి ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి. వాటి లోపల ఆయా కోటలకి, రాజులకి సంబంధించిన చరిత్రతో పాటు ఎప్పుడు ఎవరు ఎలా కట్టారు లాంటి వివరాలు, అప్పటి రాజులకి సంబంధించిన వస్తువులు అన్నీ ప్రదర్శనకి ఉంటాయి. ఏ ఊరికి వెళ్ళినా ఒక పర్యాటక కేంద్రం వారి కార్యాలయం ఉండి వాళ్ళ దగ్గర వాళ్ళ ఊరిలో చూడతగ్గ ప్రదేశాలు ఏమేం ఉన్నాయి, వాటికి ఎలా వెళ్ళాలి లాంటి వివరాలతో కూడిన బ్రోచర్లు లభిస్తాయి. వాటిల్లో తప్పనిసరిగా ఆ ఊరికి సంబంధించిన పాత రాజు గారి కోటలు, చర్చిలు లాంటివి ముందు ఉంటాయి. ప్రతీ కోట వెనకా వినిపించే ఎన్నో కథల్లో బోలెడన్ని వింతలు విశేషాలు ఉంటాయి.



మహారాజుల ఇంట్లో వారసుల్లా పుట్టిన వాళ్ళందరూ సహజంగానే పుట్టుకతోనే యువరాజులవుతారు. చిన్నప్పటినుంచీ సంపద, అధికారం, రాజకీయాల మధ్యలో పెరిగే వారి గురించి స్వతహాగా వాళ్ళ మనస్తత్వం, వ్యక్తిత్వం ఏంటన్నది ప్రపంచానికి ఎప్పుడూ నిర్దిష్టంగా తెలీదు, అక్కర్లేదు కూడా! రాజు గారు ప్రజలకి ఏం చేసాడు, మిగతా ప్రపంచం ముందు రాజ్యాన్ని ఎంత గొప్పగా నిలబెట్టాడు, ... ...ంగా ప్రపంచానికి తెలిసే విషయాలు. కొన్నిసార్లు

Potsdam లోని రాజసౌధాలు

వాళ్ళ వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసినప్పుడు అంత గొప్ప రాజుల జీవితాల్లోనూ ఏవో బాధలు, భయాల తాలూకు నీలి నీడలు, మర్మంగా మిగిలిపోయిన ప్రశ్నలు దోబూచులాడతాయి. నేను విన్న కొన్ని రాజుల కథల్లో నన్ను బాగా ఆలోచింపజేసిన ఒక జర్మన్ రాజు కథ చెప్తాను.




జర్మనీలో బవేరియా రాష్ట్రపు రాజకుటుంబానికి చెందిన రాజు Ludwig II. పంతొమ్మిదో శతాబ్దపు రాజైన ఈ లుడ్విగ్ అంటే ఇక్కడ ప్రజలకి ఇప్పటికీ చాలా అభిమానం. అందుకనే ఇక్కడ ఇప్పటికీ చాలా చోట్ల అతని గురించిన పుస్తకాలు, ఫోటోలు కనిపిస్తూనే ఉంటాయి. చిన్నప్పటి నుంచే రాచరికపు కుటుంబాల్లో పిల్లల మీద ఉండే విపరీతమైన నియంత్రణ, రాచరికాన్ని నిలబెట్టుకోడానికి అవసరమైన కఠిన శిక్షణల మధ్యన పెరిగిన లుడ్విగ్ పెద్దవాడయ్యేసరికి ఎక్కువగా అందరిలో కలవకుండా అదోకలాగా ముభావంగా ఉండే వ్యక్తిలా ఎదిగాడట. అతని తల్లిదండ్రులతో కూడా పెద్ద సాన్నిహిత్యం ఉండేది కాదట. అతని తాతగారి తరం నుంచే వాళ్ళ వంశంలో రాజుల మానసిక ఆరోగ్యం గురించి అప్పటికే ప్రచారంలో ఉన్న అనేక కథలని బట్టి లుడ్విగ్ కి కూడా కొంత మానసిక అసమతౌల్యం ఉందని అందరూ అనుకునేవారు. లుడ్విగ్ కి సాహిత్యం, నాటకాలు, చిత్రలేఖనం, సంగీతం లాంటి లలిత కళలతో పాటు ఆర్కిటెక్చర్ అంటే చాలా ఆసక్తితో పాటు వాటిలో మంచి అభిరుచి కూడా ఉండేది. అతను రాజైన తర్వాత అతని అభిరుచిని అనుసరించి దేశదేశాల నుంచి ఎందరో అరుదైన కళాకారులని సంప్రదించి, బోలెడు ధనం వెచ్చించి కొన్ని రాజప్రాసాదాలు కట్టించాడు. వాటి వాస్తు శిల్పం, వాటిల్లో వినియోగించిన శిల్ప విద్యలు, చిత్రలేఖన విద్యలు, వాటిని నిర్మించడానికి ఎంచుకున్న స్థలాలు, ఆయా రాజభవంతుల లోపల ఉన్న రకరకాల సౌకర్యాలు ఇవన్నీ ఈ రోజున్న సాంకేతికత స్థాయికి కూడా ఎంతో ఉన్నతంగా, వైవిధ్యంగా నిలిచేవే. అంత పాత రోజుల్లో ఇలాంటివి నిర్మించారంటే వాటి కోసం ఎంత శ్రమపడి ఉంటారో, ఎంత సంపద ఖర్చు చేసి ఉంటారో అనిపిస్తుంది. ఇప్పటికీ బవేరియా రాష్ట్రం సగర్వంగా వారి చారిత్రిక వారసత్వంలా ప్రదర్శించుకోవడంతో పాటు ఈ రాష్ట్ర పర్యాటక రంగానికి వీటన్నీటి వల్లా బోలెడు ఆదాయం కూడా వస్తోంది.

బవేరియా రాష్ట్రంలో Chiemsee అని ఒక పెద్ద సరస్సు ఉంది. ఆ సరస్సు మధ్యలో రెండు ద్వీపాలు ఉన్నాయి. చిన్న ద్వీపం పేరు ఆడవాళ్ళ ద్వీపం అని, పెద్ద ద్వీపానికి మగవాళ్ళ ద్వీపం అని వాటి పేర్లు. చిన్న ద్వీపంలో పాత కాలం నాటి చర్చి, క్రిస్టియన్ మోనాస్టేరీలు ఉన్నాయి.



Herrenchiemsee Palace, Neuschwanstein Castle

పెద్ద ద్వీపంలో లుడ్విగ్ ఒక పెద్ద రాజప్రాసాదాన్ని కట్టించాడు. అది అచ్చం ఫ్రాన్స్ లో అత్యంత ప్రాముఖ్యత గడించిన Palace of Versailles ని పోలి ఉంటుంది. లుడ్విగ్ కట్టించిన అన్నీ కోటల్లోకీ ఇదే పెద్దది. కోట ముందు పెద్ద పెద్ద వాటర్ ఫౌంటైన్లతో విశాలమైన తోట కూడా ఉంటుంది. ఎంతో ఖర్చు చేసి కట్టించిన ఈ కోటలో లుడ్విగ్ తన జీవిత కాలంలో కనీసం నెల రోజులు కూడా గడపలేకపోయాడు.

Linderhof అనే ఇంకొక ప్రదేశంలో లుడ్విగ్ కట్టించిన మరొక కోట కూడా చాలా ప్రత్యేకమైంది. ఈ రెండూ కాకుండా లుడ్విగ్ ఆల్ప్స్ పర్వతాల మధ్యలో కొండల నడుమ Neuschwanstein castle అనే ఒక కోటని అత్యంత కళాత్మకంగా నిర్మించాడు.




ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ కోట ప్రపంచంలోనే చూడదగ్గ మొదటి 25 వింతల్లో ఒకటిగా నమోదు చెయ్యబడింది. అంతే కాదు ప్రపంచవ్యాప్తంగా అందరికీ సుపరిచితమైన డిస్నీలాండ్ స్లీపింగ్ బ్యూటీ castle, ఇంకా మరెన్నో కట్టడాలకి లుడ్విగ్ కట్టించిన ఈ Neuschwanstein castle నమూనా స్ఫూర్తిగా నిలిచింది. ఈ రోజుకీ కొన్ని మిలియన్ల మంది పర్యాటకులు దీన్ని సందర్శిస్తూనే ఉన్నారు. లుడ్విగ్ అత్యధికంగా అభిమానించే ఒక సంగీతకారుడితో ఉన్న గొప్ప స్నేహానికి చిహ్నంగా ఈ కోటని నిర్మిస్తున్నానని ప్రకటించాడు. ఈ కోట కట్టేనాటికి రాజకీయ పరిస్థితులు అనుకూలించకపోయినప్పటికీ తన ఆస్తులన్నీ ధారపోసి మరీ లుడ్విగ్ ఈ కోట నిర్మాణాన్ని కొనసాగించాడని చెప్తారు. దాదాపు ఇరవయ్యేళ్ళ పైన ఈ కోట నిర్మాణం జరిగి దాని మూలంగా ఆ పరిసరాల్లో వారందరికీ జీవనోపాధి దొరికిందంటే అది ఎంత సంక్లిష్టమైన కట్టడమో అంచనా వేయవచ్చు. ఇంతా చేసి ఈ కోట కూడా లోపలి గదుల నిర్మాణం మొత్తం పూర్తి కాకుండా మధ్యలోనే ఆగిపోయింది.

ఈ కోటలో లుడ్విగ్ కేవలం 172 రోజులు మాత్రమే నివసిస్తే ఎవరి కోసమైతే కట్టిస్తున్నానని అన్నాడో ఆ సంగీతకారుడు ఈ కోటలోకి అడుగు పెట్టకుండానే చనిపోయాడు.

లుడ్విగ్ కి ఒక రాకుమారితో పెళ్ళి నిశ్చయం అయ్యాక చాలాసార్లు పెళ్ళి తేదీని వాయిదా వేస్తూ వచ్చి చివరికి పెళ్ళిని రద్దు చేసుకున్నాడు. చివరిదాకా పెళ్ళి చేసుకోకుండా ఒంటరిగానే ఉండిపోయాడు. ప్రేమసంబంధాల విషయంలో అతనికేవో అయోమయాలు, సమస్యలు, ప్రశ్నలు ఉండేవని వాటి మూలంగా జీవితమంతా అతనెంతో తీవ్ర అంతర్మథనానికి గురయ్యేవాడని లుడ్విగ్ అప్పట్లో రాసుకున్న పర్సనల్ డైరీల వల్ల అతను చనిపోయాక తెలిసిందట. తన హయాంలో ఇంత గొప్ప గొప్ప కట్టడాలని నిర్మించిన లుడ్విగ్ 1886 లో నలభై సంవత్సరాల వయసులో ఒకనాటి సాయంత్రం తన వైద్యుడితో కలిసి సరస్సు తీరానికి విహారానికి వెళ్ళి మళ్ళీ తిరిగిరాలేదు. కేవలం నడుము లోతు నీళ్ళున్న సరస్సులో లుడ్విగ్, అతని కూడా ఉన్న వైద్యుడు ఇద్దరూ మరణించారు. స్వతహాగా మంచి ఈతగాడైన లుడ్విగ్ ఆత్మహత్య చేసుకున్నాడంటే ఎవరూ నమ్మలేదు. అతని శరీరాన్ని పరీక్షించిన వైద్యులు కూడా అది ఆత్మహత్య అని నిశ్చయంగా నిర్ధారించలేకపోయారు. లుడ్విగ్ తో పాటు వెళ్ళిన వైద్యుడి శరీరం పైనున్న గాయాలని చూసి వాళ్ళిద్దరి మరణం గురించి రకరకాల అనుమానాలు, సందేహాలు ఇప్పటికీ చరిత్రలో మిగిలిపోయాయి. ఈ రోజుకీ లుడ్విగ్ జీవితం, మరణం ఒక మిస్టరీ గానే మిగిలిపోయింది. జీవించి ఉన్నప్పుడు "I wish to remain an eternal enigma to myself and to others" అని చెప్పిన లుడ్విగ్ మరణం కూడా ఎవరికీ అంతు పట్టకుండానే మిగిలిపోయింది. లుడ్విగ్ మరణించే సమయానికి సగం నిర్మాణంలో ఆగిపోయిన ఈ రాజప్రాసాదాలన్నింటినీ పబ్లిక్ చేసి పర్యాటక శాఖ వారు ప్రజలందరి సందర్శనార్థం తెరిచారు. అందువల్ల ఇప్పుడీ కట్టడాలన్నీ మనం లోపల తిరిగి చూసే వీలుంది. అదీ లుడ్విగ్ కథ!




జర్మనీ చరిత్ర అనగానే ప్రపంచం మొత్తానికి రెండో ప్రపంచ యుద్ధానికి దారి తీసిన ఆనాటి పరిస్థితులు, హిట్లర్ హయాంలో జర్మనీలో యూదులపై అత్యంత కిరాతకంగా జరిగిన ఊచకోతలు గుర్తొస్తాయి. అప్పట్లో యూదులందరినీ బానిసలుగా ఉంచిన నాజీ కాన్సంట్రేషన్ కాంపుల్లో ఒకటైన Dachau concentration camp కి నేను వెళ్ళి చూసాను. అప్పటి రక్తచరిత్రకి సజీవ సాక్ష్యంలా ఉంటుందా ప్రదేశం. ఆ కాంపుల్లో బానిసలని ఎలా చూసేవారు, ఎన్ని హింసలు పెట్టేవారు, ఎలా చంపేవారు లాంటి అన్నీ వివరాలతో, ఫోటోలు, వీడియోలతో అంతా డాక్యుమెంట్

చేయబడి ప్రదర్శనకి ఉంటుంది. బానిసల్లా వారు గడిపిన జైళ్ళ లాంటి గదుల తాలూకు నమూనాలు కొన్ని అప్పటివి అలాగే ఉంచారు. ఆ ప్రదేశంలో నించున్నప్పుడు కొన్నేళ్ళ క్రితం సరిగ్గా ఇదే చోట అంత ఘోర మారణహోమం జరిగిందన్న తలంపుకి ఒళ్ళు జలదరించింది. ఏ పాపమూ ఎరుగని ఎంతమంది మనుషులు నరకయాతన అనుభవించారో కదాని మనసు ద్రవించింది. అది చూసొచ్చాక కొన్ని రోజులదాకా దాని చుట్టూనే తిరిగేవి ఆలోచనలు. కానీ ఈ దేశంలో ఇలా జరగడం తాము గర్హించే విషయం అని వారు ఒప్పుకుంటూనే, జరిగిన ఘోరాన్ని ఏ మాత్రం కప్పిపుచ్చుకోడానికి కానీ, దాచుకోడానికి కానీ ప్రయత్నించకుండా అంత వివరంగా అన్నీ డాక్యుమెంట్ చేసి ప్రపంచానికి ప్రదర్శించడం చూసి నాకు జర్మన్ల మీద గౌరవం కలిగింది. ఒకనాటి చరిత్ర సిగ్గు పడాల్సినంత తప్పే కావొచ్చు.. కానీ తప్పు జరిగిందని మర్చిపోకుండా గుర్తుంచుకోవడం, సరిదిద్దుకోవడానికి ప్రయత్నించడం, మంచి మార్గం వైపు పయనించాలనుకోవడం.. ఇవి ఖచ్చితంగా గౌరవించతగ్గ విషయాలే అనుకుంటాను.

జర్మనీ రెండు ముక్కలుగా విడిపోయి పశ్చిమ బెర్లిన్ మహానగరాన్ని తూర్పు జర్మనీ నుంచి విడదీయడానికి నిర్మించబడిన 'బెర్లిన్ వాల్' జర్మనీ చరిత్రలో మరో చీకటి ఘట్టం. ఆనాటి రాజకీయ సంక్షోభాలకి బలైపోయిన ఎంతోమంది సామాన్య ప్రజల కన్నీళ్ళకి మౌనసాక్షిగా నిలిచిన 'బెర్లిన్ వాల్' శేషంలా ఈ రోజుకీ మిగిలిన చేదు గుర్తులని చూసినప్పుడు కూడా మాటలకందని వేదనాపూరితమైన భావమేదో కమ్ముకొచ్చింది. మనిషిలో దాగున్న హింసాప్రవృత్తికి, అధికార దాహానికి, మానవతారాహిత్యానికి ప్రతీకలుగా మన ప్రపంచ పటం పైన ఇలాంటి కళంకపు చిహ్నాలెన్నో కదా అనిపించింది.

"ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం.. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం.."

అన్న శ్రీశ్రీ మాటలు మరోసారి జ్ఞాపకం వచ్చాయి.

*** లుడ్విగ్ బొమ్మ గూగుల్ నుంచి తీసుకున్నది.**



కౌముది




## *Beer is the secret of our energy!*

**మీరు సరిగ్గానే చదివారు.** నేనేం పొరపాటుగా రాయలేదు. 'బీర్ ఈజ్ ది సీక్రెట్ అఫ్ అవర్ ఎనర్జీ' అని జర్మన్ల తరపున వకాల్తా పుచ్చుకుని నేనిస్తున్న స్టేట్మెంట్ అన్నమాట! ఎందుకలా అంటే.. మిగతా ప్రపంచానికి బీర్ అంటే కేవలం ఒక పానీయం మాత్రమే అయ్యుండొచ్చేమో గానీ ఇక్కడ మాత్రం బీర్ అనేది జర్మన్ సంస్కృతి సంప్రదాయాల్లో అతి ముఖ్యమైన భాగం. మన దగ్గర ఎవరింటికైనా వెళితే మంచినీళ్ళు కావాలా, మజ్జిగ కావాలా అని అడగడం ఎంత మామూలో ఇక్కడ బీర్ ఆఫర్ చెయ్యడం అంత సర్వసాధారణం. ఇక బీర్ లేని పార్టీలు, పండుగలు జర్మనీలో అసలు చూసే అవకాశమే లేదు. ఏ మారుమూల ప్రాంతానికి వెళ్ళినా బీర్ దొరకని చోటంటూ జర్మనీలో ఉండకపోవచ్చనుకుంటా. ఒక పది నిమిషాలు అలా బయటికెళ్ళి నడుస్తుంటే బీర్ దొరికే షాపో, ఎవరో ఒకరి చేతులోనే బీర్ బాటిలో, కనీసం ఏ డస్ట్ బిన్లోనో అయినాసరే మనకి ఒక్కటైనా బీర్ బాటిలో, మూతో కనిపించకపోతే మనం అసలు జర్మనీలో ఉన్నట్టే కాదు! అయితే జర్మన్లు ఎప్పుడూ బీరు తాగుతూ మత్తుగా తూలుతూ కనిపిస్తారా అంటే అలాక్కాదు మరి.. ప్రత్యేకంగా పార్టీలు, పండగల సంబరాల్లో అలా పీపాల కొద్దీ బీర్లు తాగేసి సందడి చేస్తుంటారు కానీ మామూలప్పుడు అంత ఎక్కువగా తాగరు. ఉదాహరణకి ఆఫీస్లో ఎప్పుడైనా ఏదైనా సందర్భం ఉండి బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ పార్టీలు లాంటివి ఉంటే అందరూ ఒకటో రెండో బీర్లు తాగేసి మళ్ళీ వచ్చి ఎవరి పనులు వాళ్ళు చేసేసుకుంటూ ఉంటారు. కొత్తల్లో నాకు వీళ్ళని చూసి చాలా విచిత్రంగా ఉండేది. కానీ చూడగా చూడగా ఇప్పుడు మామూలైపోయింది. బీర్ ఎప్పుడూ తాగలేదంటే అసలదెలా సాధ్యం అన్నట్టు విచిత్రంగా చూసేవాళ్ళే ఎక్కువమంది ఎదురుపడుతుంటారు జర్మనీలో. మొత్తానికి ఒక్క మాటలో చెప్పాలంటే బీర్ ప్రస్తావన లేని జర్మనీని ఊహించడం కష్టం అన్నమాట! ప్రపంచవ్యాప్తంగా per capita బీర్ వినియోగంలో జర్మనీ ముందువరసలో ఐర్లాండ్, చెక్ రిపబ్లిక్ తదితర దేశాల సరసన ఉంటుంది.

అసలీ బీర్ పుట్టుపూర్వోత్తరాలు, చరిత్ర విషయానికొస్తే బార్లీ గింజల మాల్ట్ తో నీళ్ళు కలిపి ఈస్ట్ సమక్షంలో పులియబెడితే (fermentation) తయారయ్యే పానీయాన్నే బీర్ అంటారు. బీరు తయారీ, సేవనం కొన్ని వేల సంవత్సరాలుగా క్రీస్తుపూర్వం నుంచీ కూడా మానవ నాగరికతలో ఇమిడిపోయిన భాగంగా ఉంటూ వస్తోంది. ఈజిప్షియన్ల దగ్గర్నుంచీ యూరోపియన్ల దాకా శతాబ్దాల చరిత్ర ఉన్న beer brewing లోజర్మన్ బీర్ తయారీకి అప్పటి నుంచీ ఈ రోజు దాకా కూడా ఒక విశిష్టమైన స్థానం ఉంది. 14 వ శతాబ్దానికి ముందు రోజుల్లో బీరు తయారీ అనేది ఇళ్ళల్లో సాధారణంగా వంటపని, ఇంటిపని అన్నంత మాములుగా చేసుకునేవారట. తర్వాత్తర్వాత క్రిస్టియన్ మొనాస్టరీల ఆధ్వర్యంలో నడిచే పెద్ద మొత్తాల్లో బీరు తయారు చేసే breweries ఏర్పడ్డాయట. మొత్తం ప్రపంచ బీర్

శతాబ్దాల చరిత్ర కలిగిన జర్మన్ బీర్



రకరకాల బీరు మగ్గులు, బవేరియా విగ్రహం, Lebkuchenherzen

చరిత్రలోనే ముఖ్యమైన ఘట్టంగా చెప్పుకునే "Reinheitsgebot" (
బవేరియా రాష్ట్రంలో పుట్టింది. ఇప్పటికీ బీరు ఉత్పత్తి చేసే brewerie
ఈ నియమాన్ని పాటిస్తూ ఉత్పత్తి చేసిన బీరు అత్యుత్తమ నాణ్యత
శీతల ఉష్ణోగ్రతల వద్ద నిలువ చేసి ferment చేస్తే నాణ్యమైన బీరు
జర్మనీలోని బవేరియన్ బీరు ఉత్పత్తిదారులేనట.

అక్టోబర్ ఫెస్ట్ లో జనసందోహం




జర్మనీలో అన్నీ సంబరాల్లోనూ బీరు ఉండటం
జరుగుతుంటాయి. మా యూనివర్సిటీలో beer brewing కి సంబ
ఉంది. వారి ఆధ్వర్యంలో ప్రతీ ఏడాదీ వేసవికాలంలో 'ఫ్రీ బీర్ ఫెస్ట్'
ఆకారాల్లో ఉన్న పెద్ద పెద్ద గాజు గ్లాసులతో పాటు 'beer stein' అ
అలాంటి పదార్థంతో తయారు చేయబడి చాలా బరువుతో ఉంటాయి
వాటి మీద ఆయా breweries పేర్లు రాసి ఉంటాయి. కొన్ని రకాల మగ్స్ కి పైన మూతలు కూడా ఉంటాయి. అయితే మా యూనివర్సిటీలో ఈ 'ఫ్రీ బీర్ ఫెస్ట్' జరిగే కొద్ది రోజుల ముందు అలాంటి మగ్స్ అమ్ముతారు. అందరూ వెళ్ళి లైన్లో నించుని మరీ ఆ కప్పులు కొనుకొచ్చుకుంటారు. పది యూరోలు ఉంటుంది ఆ కప్పు ఖరీదు. ఇక ఫెస్ట్ జరిగే రోజు సాయంత్రానికి అందరూ ఆ కొనుక్కున్న కప్పులు పట్టుకుని వస్తారు. విశాలంగా ఉండే ఒక పెద్ద మైదానంలో ఏర్పాటు చేసిన రకరకాల బీర్ స్టాల్స్ దగ్గరికెళ్ళి ఆ కప్పుల్లో బీరు

నింపుకుని వచ్చి తాగడమే ఆ పండగ పరమార్థం. అర్ధరాత్రి దాకా జరిగే ఈ బీర్ పండగలో తాగినోళ్ళకి తాగినంత బీర్ దొరుకుతుంది. పక్కన తినడం కోసం authentic German breads, Sausages అమ్మే స్టాల్స్ ఉంటాయి.


బీర్ ఫెస్ట్ పెరేడ్ లో మ్యూజిక్ బ్యాండ్స్, గుఱ్ఱాలు

ఇలాంటి పెద్ద పెద్ద బీర్ ఫెస్టివల్స్ జరిగినప్పుడు కూడా అందరూ ఎంత తాగినా వాళ్ళు వాళ్ళ స్నేహితులతో కలిసి అల్లరి, గోల చేసుకుంటారే తప్ప సాధారణంగా వేరేవాళ్ళ జోలికి రావడమంటూ జరగదు. కాకపోతే ఇలాంటి బీరు సంబరాలు జరిగే చోట మరీ విపరీతంగా తాగేసి పడిపోయిన వాళ్ళ సంగతి చూసుకోవడం కోసం పక్కనే అంబులెన్సులు సిద్ధంగా ఉంటాయి. ఇప్పటిదాకా ఏవైనా పెద్ద గొడవలు జరగడం నేను చూడలేదు కానీ ఎవరైనా కొంచెం తిక్కగా ప్రవర్తిస్తే మాత్రం క్షణాల్లో ఒక పది మంది పోలీసులు ప్రత్యక్షమైపోతారు. అలాంటప్పుడు పోలీసులు ఆ మత్తులో ఉన్నవాళ్ళ చేతులకి సంకెళ్ళు వేసి తీసుకెళ్ళి పూర్తిగా మత్తు దిగాక ఇంటికి పంపించేస్తారని ఎవరో చెప్తే తెలిసింది. కాబట్టి భద్రతాపరంగా అస్సలు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఇలాంటి పండగలన్నీ చక్కగా నిర్వహిస్తుంటారు.




జర్మనీలో తయారు చేయబడేటన్ని రకాల బీర్లు మరో చోట ఉండవేమోనంటే అతిశయోక్తి కాదు. Cologne నగరానికి ప్రత్యేకం అయిన KÖlsch Beer, DÜsseldorf నగరానికి చెందిన Altbier, Berlin కి ప్రత్యేకం అయిన Berliner Weisse, Bamberg Smoked Beer, Leipzig లో పుట్టిన Gose Beer.. ఇలాంటివన్నీ పేరెన్నికగన్న జర్మన్ బీర్లే అయినప్పటికీ బవేరియా రాష్ట్రపు బీర్లకి మాత్రం ప్రపంచవ్యాప్తంగా వీటన్నీటినీ మించిన విశిష్ట స్థానం, ప్రాముఖ్యత ఉన్నాయి. Hefeweizen, Helles, Dunkles తో పాటు Weizenbier (wheat beer), Weißbier (white beer) లాంటివన్నీ బవేరియన్ స్పెషల్స్ గా చెప్పుకోవచ్చు. మా ఇంటి ఎదురుగా ఉన్న కొండ మీద Weihenstephan Brewery ఉంది. దాదాపు వెయ్యి సంవత్సరాల నుంచి నడుస్తున్న దీనికి The oldest working brewery in the world గా గొప్ప పేరుప్రతిష్టలు ఉన్నాయి. ఇక్కడ తయారయ్యే గోధుమ బీరుకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉంటారు. వేసవికాలం వస్తూనే జర్మనీలో బీర్ గార్డెన్లన్నీ క్రిక్కిరిసిన జనాలతో కిటకిటలాడిపోతుంటాయి. జర్మన్లని అడిగితే వేసవికాలంలో మంచి ఎండ కాసే రోజున ఏ బీర్ గార్డెన్లోనో పెద్ద పెద్ద చెట్ల నీడన వేసిన బెంచీల మీద అప్పుడప్పుడే తాజాగా brewery నుంచి తెచ్చిన బీరుని సేవిస్తూ కూర్చోడం కన్నా స్వర్గం ఇంకొకటి లేదని చెప్తారు! :-)

రకరకాల breweries వారి బీర్ టెంట్లు




జర్మనీలో దాదాపు అన్నీ నగరాల్లోనూ రకరకాల బీర్ ఫెస్టివల్స్ జరిగినా సరే ప్రపంచవ్యాప్తంగా 'జర్మన్ బీర్ ఫెస్ట్' గా పిలవబడే Oktoberfest (అక్టోబర్ ఫెస్ట్) మాత్రం బవేరియా రాష్ట్రంలోని మ్యూనిక్ మహానగరంలో ప్రతీ ఏడాదీ జరుగుతుంది. ప్రపంచంలోనే అత్యంత పెద్ద జాతర (worlds largest fair/folk fest) గా

చెప్పబడే ఈ అక్టోబర్ ఫెస్ట్ గత రెండు వందల యేళ్ళుగా జరుగుతోంది. ప్రతీ ఏడాదీ సెప్టెంబరులో మొదలై అక్టోబరు మొదటి ఆదివారం వరకూ మొత్తం 16 రోజుల పాటు జరిగే ఈ బీరు పండగని ప్రతీ యేటా దాదాపు 6 మిలియన్ల మంది పైనే సందర్శించి 7 మిలియన్ లీటర్లకి పైగా బీర్ సేవిస్తుంటారు.

బీరుతో పాటు తినడానికి సాంప్రదాయక బవేరియన్ బ్రెడ్స్, సాసేజెస్, సలాడ్స్, చికెన్, బీఫ్, పోర్క్ లాంటివన్నీ ఉంటాయి. కేవలం మ్యూనిక్ నగర సరిహద్దుల్లోపున తయారైన బీరు మాత్రమే ఈ పండుగలో అమ్ముతారు. అది కూడా మ్యూనిక్ లోని అన్నీ breweries వాళ్ళకి ఈ పండుగలో పాల్గొనే అవకాశం ఉండదు. Reinheitsgebot నియమం ప్రకారం ఉత్పత్తి చేసిన బీరుకి మాత్రమే ఈ పండుగలో చోటు దక్కుతుంది. ఇక్కడ అమ్మే అన్నీ రకాల బీరుల్లోనూ ఆల్కహాల్ దాదాపు 6% దాకా ఉంటుంది. Hofbräu-München, Augustiner, Paulaner, Hacker-Pschorr, Löwenbräu, Spatenbräu లాంటివి కొన్ని అక్టోబర్ ఫెస్ట్ లో ప్రముఖంగా కనిపించే breweries అని చెప్పొచ్చు.

బీరు టెంట్ల లోపల పండగ వాతావరణం



సెప్టెంబరులో మొదలయ్యే ఈ అక్టోబర్ ఫెస్ట్ కి అసలా పేరు ఎందుకొచ్చిందో తెలియాలంటే రెండొందల క్రితం అసలీ పండగ ఎలా మొదలైందో తెలుసుకోవాలి. బవేరియా రాష్ట్రపు రాజైన Ludwig I Therese అనే రాకుమారిని 1810 అక్టోబర్ 12 నవివాహమాడాడు. ఆ రాజు వివాహ వేడుకల సందర్భంగా మ్యూనిక్ నగరవాసులందరికీ వైభవంగా ఒక విశాలమైన పచ్చికబయల్లో విందు ఏర్పాటు చేసారు. పెళ్ళి వేడుకల ముగింపులో వినోదం కోసమని రాజకుటుంబం సమక్షంలో గుర్రప్పందాలు నిర్వహించారు. అప్పుడు రాజకుటుంబంలో జరిగిన ఈ పెళ్ళి సంబరాలని రాష్ట్రమంతా పండగలా జరుపుకుని ఆనందించడమే కాకుండా వేడుకలు జరిగిన ఆ మైదానానికి కొత్తగా వచ్చిన రాణి పేరు పెట్టి Theresienwiese (Theresa's meadow) అని పిలవసాగారు. ఆ తర్వాతి ఏడాది మళ్ళీ అక్టోబరులో గుర్రప్పందాలు

నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవడంతో కాలక్రమేణా అది కాస్తా ప్రతీ ఏడాదీ విధిగా జరుపుకునే పండగలా మారిపోయింది. అయితే జర్మనీలో అక్టోబరు అంటే అప్పటికే శిశిరకాలపు చలి మొదలైపోతుంది. ఆ కారణంగా దాన్ని కొంచెం ముందుకి జరిపి సెప్టెంబరులో మొదలుపెట్టి అక్టోబరు మొదటి ఆదివారం దాకా జరుపుతున్నారు. అప్పటినుంచి ఇప్పటిదాకా ప్రతీ ఏడాదీ ఈ అక్టోబర్ ఫెస్ట్ ని Theresienwiese అనే మైదానంలోనే జరుపుకుంటున్నారు మ్యూనిక్ నగర వాసులు. 1850 లో ఇక్కడ ప్రతిష్ఠించిన ఒక పెద్ద బవేరియా విగ్రహం (అంటే మన తెలుగుతల్లి విగ్రహంలాగా వీళ్ళ రాష్ట్రాన్ని సూచించే విగ్రహం అన్నమాట) ఇప్పటికీ అంతే కొత్తగా ఉండి ప్రతీ ఏడాది జరిగే అక్టోబర్ ఫెస్ట్ సంబరాలని వీక్షిస్తూ ఉంటుంది. ఈ విగ్రహం పక్కనే కనిపించే సింహం కూడా బవేరియా చిహ్నం లాంటిది.

బీర్, ఫుడ్ సర్వ్ చేస్తున్న అమ్మాయిలు

ఎక్కడ చూసనా బవరయన దుస్తుల్లొ సింహం బొమ్మలు కనిపించడమే కాకుండా ఊరంతా అనేక కట్టడాల మీద, సిటీ సెంటర్లలో సింహం బొమ్మలు బవేరియా రాష్ట్రమంతా విరివిగా కనిపిస్తుంటాయి. Theresienwiese మెట్రో రైల్వే స్టేషన్ స్టాప్ కి ప్రతీ పది నిమిషాలకీ ఉండే మెట్రో రైళ్ళ సహాయంతో చాలా సులువుగా ఫెస్ట్ జరిగే చోటుకి చేరుకోవచ్చు.



అక్టోబరు ఫెస్ట్ మొదటి రోజున అనేకమంది బవేరియన్ సాంప్రదాయక దుస్తుల్లో, రకరకాల సంగీత వాయిద్యాలు, మ్యూజిక్ బ్యాండ్లతో breweries వాళ్ళందరూ అలంకరించిన గుర్రపు బగ్గీల మీద పెద్ద పెద్ద బ్యారల్స్ లో బీర్ ని తీసుకొస్తూ స్వాగతోత్సవాల్లో జరిగే పెరేడ్ చాలా బాగుంటుంది. ఈ breweries అన్నీ కూడా పెద్ద పెద్ద హాల్స్ లాంటివి కట్టి లోపల వేల కొద్దీ బల్లలు, కుర్చీలు ఏర్పాటు చేస్తారు. వీటిని బీర్ టెంట్స్ అంటారు. లోపల బీరుతో పాటు తిండి పదార్థాలు కూడా దొరుకుతాయి. టెంట్స్ లో సాంప్రదాయక బవేరియన్ సంగీతం వాయించే మ్యూజిక్ బ్యాండ్స్ ఉండి లోపల కూర్చుని బీరు సేవించేవారికి వినోదాన్ని అందిస్తుంటాయి. ప్రతీ రోజూ ఉదయం తొమ్మిది పదింటి నుంచి మొదలుకుని అర్ధరాత్రి దాకా ఈ బీర్ టెంట్స్ తెరిచి ఉంటాయి. బీర్ టెంట్స్ లో చోటు దొరకడం సామాన్యమైన విషయం కాదు కాబట్టి అందరూ ముందు నుంచే సీట్లు రిజర్వ్ చేసి పెట్టుకుంటారు. మామూలు ఎప్పుడు ఏ పండగలు వచ్చినా సాంప్రదాయ దుస్తుల్లో కనిపించే బవేరియన్లు అక్టోబర్ ఫెస్ట్ సమయంలో సమయంలో విధిగా చిన్నపిల్లల దగ్గర్నుంచీ ముసలివాళ్ళ దాకా బవేరియన్ సాంప్రదాయక దుస్తులైన Drindl లో ఆడవారు, Lederhosen లో మగవారు.. ఎటువైపు చూసినా అందరూ ఒకేలాంటి బట్టలతో భలే

ముచ్చటగా కనిపిస్తారు. టెంట్స్ లోపల బీరు సర్వ్ చేసే అమ్మాయిలందరూ కూడా Drindl తప్ప వేరే రకం బట్టల్లో కనపడరు. అసలీ సర్వ్ చేసే అమ్మాయిల్లో ఇరవైలలో ఉండేవారి దగ్గర్నుంచీ ముసలివాళ్ళ వరకూ ఉంటారు. అంత రద్దీలో కూడా ఒక్కొక్కరు అంత బరువైన బీరు మగ్గుల్ని ఒక్కో చేతిలో 3-6 దాకా రెండు చేతుల్లో పట్టుకుని చకచకా తిరిగేస్తుంటే భలే ఆశ్చర్యంగా ఉంటుంది. ఈ సర్వింగ్ జాబ్ చాలామంది ఇష్టపడి చేస్తుంటారట. ఈ కొద్ది రోజుల్లోనే బోల్డు సంపాదించే అవకాశం కూడా ఉంటుంది కాబట్టి అక్టోబర్ ఫెస్ట్ లో సర్వ్ చేసే అవకాశాన్ని వదులుకోరట. కానీ ఒకోసారి అరవై ఏళ్ళ పైన వయసున్నవాళ్ళు కూడా అలా తూనీగల్లా తిరిగేస్తుంటే చూడ్డానికి భలే సరదాగా అనిపిస్తుంది.


అక్టోబర్ ఫెస్ట్ ఫన్ రైడ్స్

ఇంతకీ అక్టోబర్ ఫెస్ట్ అంటే కేవలం బీరు తాగేవాళ్ళకి మాత్రమే పండగ తప్ప మిగతావాళ్ళకి అంటే బీరు తాగనివాళ్ళకి, పిల్లలకి ఏమీ సందడి లేదా అంటే బోల్డు ఉందనే చెప్పాలి. ఫెస్ట్ లో బీర్ టెంట్లు కాకుండా బోల్డన్ని ఫన్ రైడ్స్ ఉంటాయి. అంటే మన ఊరి ఎగ్జిబిషన్లలో ఉండే చిన్న చిన్న ఉయ్యాలల దగ్గర్నుంచీ మొదలుపెట్టి చాలా పెద్దపెద్ద వాటి వరకూ ఉంటాయి. ఉదాహరణకి జెయింట్ వీల్ ఎక్కడానికి ఒక్కో బుట్ట లాగా ఉండేవి దాదాపు డజను మంది ఎక్కి కూర్చునే విధంగా ఒక చిన్న గదంత సైజులో ఉంటాయి. ఇంకా ఒక చాలా ఎత్తైన స్థంభం దాకా పైకి తీసుకెళ్ళి ఉన్నపళంగా కిందకి వదిలేసే 'ఫ్రీఫాల్' లాంటివి, అన్నీ రకాల యాంగిల్స్ లో అడ్డదిడ్డంగా ఊపేసేవి, నీళ్ళ మీద జారే పడవలు, రోలర్ కోస్టర్లు.. ఇలా చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ళ దాకా అందరూ ఎక్కడానికి ఒక రోజంతా ఎక్కినా అయిపోనన్ని రకాల రైడ్స్ ఉంటాయి. వీటితో పాటు పాప్ కార్న దగ్గర్నుంచీ మొదలుపెట్టి పీచు మిఠాయి, షుగర్ కోటెడ్ నట్స్, ఫ్రూట్స్, ఐస్క్రీమ్స్ దాకా బోల్డన్ని రకాల చిరుతిండ్లు ఉంటాయి. చిన్నపిల్లల బొమ్మల దగ్గర్నుంచీ పెద్దవాళ్ళకి ఆసక్తి కలిగించే వస్తువులు, ఇంకా అక్టోబర్ ఫెస్ట్ సావనీర్స్, రకరకాల బీర్ మగ్గులు.. ఇలాంటివన్నీ అమ్మే చాలా రకాల కొట్లు ఉంటాయి. ఇంకా ఈ ఫెస్ట్ లో ప్రత్యేకంగా కనిపించేవి Lebkuchenherzen (Gingerbread Hearts). హృదయాకారంలో ఉండే ఈ బ్రెడ్స్ మీద "ఐ లవ్ యు, యు ఆర్ మై స్వీట్ హార్ట్, మై సిస్టర్ ఈజ్ ది బెస్ట్, ఐ లవ్ మ్యూనిక్" ఇలా రకరకాల సరదా వాక్యాలు రాసుంటాయి. ఇవి తినేవే కానీ రెండు మూడేళ్ళ దాకా పాడైపోకుండా నిల్వ ఉంటాయి. తినకుండా అలా ఏళ్ళ తరబడి దాచుకోవచ్చు కూడా. వీటికి ఒక చిన్న రిబ్బన్ కట్టి వేలాడదీసి అమ్ముతారు. అందరూ తలా ఒకటి

కొనుక్కుని మెడలో వేసుకుని తిరుగుతుంటారు. ఫెస్ట్ కి వచ్చినవాళ్లందరూ దాదాపు ఈ జింజర్ బ్రెడ్ హార్ట్ కొనుక్కోకుండా వెళ్ళరు అనేంత విరివిగా కనిపించే సరదా ఆచారం ఇది! మొత్తం మీద 16 రోజుల పాటు ఉదయం నుంచీ అర్ధరాత్రి దాకా సందడిగా హంగామాగా ఉండే ఈ ఫెస్ట్ కి వెళ్ళి తిరగడం అన్నీ రకాల వాళ్ళకి చాలా సరదా అయిన అనుభవంలా ఉంటుంది. ఫెస్టుకి ఎక్కువ వచ్చేది జర్మన్లే అయినా కూడా ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీరు ప్రేమికులు చాలామంది ప్రతి ఏడాదీ ఈ బీర్ ఫెస్ట్ ని సందర్శిస్తుంటారు. అదన్నమాట అక్టోబర్ ఫెస్ట్ అనబడే జర్మన్ బీర్ ఫెస్ట్ కథాకమామీషు!



బార్లీ, Hops మొక్కలు

ఇంతకీ 'బీర్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ జర్మన్స్ ఎనర్జీ' అన్నాను కదా.. ఒకరకంగా చెప్పాలంటే 'బీర్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ' కూడా! ఎందుకంటే మా పరిశోధనాఫలితాలు బీర్ ప్రొడక్షన్ కి చాలా ముఖ్యం కనుక. బీరుని ఎక్కువశాతం బార్లీ గింజల నుంచి, కొంతవరకూ గోధుమ గింజల నుంచీ తయారు చేస్తారు కదా.. బార్లీ పంట దిగుబడిని అధికంగా ప్రభావితం చేసి ఉత్పత్తిని దెబ్బ తీసే ఒకానొక వ్యాధి గురించే మేము పరిశోధిస్తున్నాం. ఆ వ్యాధికి తట్టుకుని నిలబడగలిగే బార్లీని తయారు చెయ్యగలగడమే మా పరిశోధన లక్ష్యం. అలాగే బీరుకి ఒక విలక్షణమైన వగరు రుచిని కల్పించి stabilising agent గా కూడా పని చేసే Hops బీరు తయారీలో అత్యంత ముఖ్యమైన పదార్థం. ఇవి కూడా ఒక రకం మొక్క నుంచే వస్తాయి. ఈ Hops పంట దిగుబడిని తగ్గించే వ్యాధుల పైన కూడా మా [illegible] వారు పరిశోధిస్తున్నారు. అయితే, మీరు ఇంతా కష్టపడి బోలెడన్ని డబ్బులు, తెలివితేటలు, సమయము వెచ్చించి చేసే పరిశోధన కేవలం బీరు తయారీకి ఉపయోగపడటం కోసం మాత్రమేనా అంటే.. ఖచ్చితంగా కాదు. ఎందుకంటే బార్లీలో మేము పరిశోధిస్తున్న వ్యాధి, వ్యాధికారకం అయిన శిలీంద్రానికి జీవపరిణామపరంగా చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ ఒక్క వ్యాధి గురించి లోతుగా అధ్యయనం చేసినట్టయితే ఈ ఫలితాలు మరిన్ని రకాల పంట మొక్కల్లో వచ్చే అనేక వ్యాధులని అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇది ఒక మోడల్ సిస్టం లాంటిది కాబట్టే మా పరిశోధనా ఫలితాలు మొక్కల వ్యాధుల శాస్త్రానికి చెందిన పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చబడుతుంటాయి. అందుకని జర్మనీలో ఇలాంటి పరిశోధనలకి ధనం వెచ్చించడం ద్వారా స్వామికార్యం స్వకార్యం రెండూ అవుతునట్టు అన్నమాట! :-)

# రంగులు మారే కాలం వచ్చింది!





జర్మనీలో ఆగస్టు నెలతోనే వేసవికాలం ముగిసినా సెప్టెంబరులో కాస్త ఎండా, కాస్త చలీ అటూ ఇటూ మారుతూ దాదాపు పది నుంచి ఇరవై డిగ్రీల సెంటీగ్రేడ్ దాకా ఉష్ణోగ్రతలు ఉంటాయి. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మూడు నెలలని కలిపి ఇక్కడ Autumn గా చెప్పుకోవచ్చు. సెప్టెంబర్లో చలి కొద్ది కొద్దిగా పెరుగుతూ ఇన్నాళ్ళు అందరిదీ ఒకే మాటన్నట్టు ఆకుపచ్చగా ఉన్న చెట్లన్నీ మెల్లమెల్లగా ఒక్కో ఆకూ, కొమ్మా క్రమంగా తలో రంగూ పులుముకోడం మొదలుపెడతాయి. అక్టోబర్ వచ్చేసరికి ఉష్ణోగ్రతలు మరి కొంచెం తగ్గి సగటున 15 నుంచి 5 మధ్యలో మారుతుంటాయి. వేసవికాలమంతా సుదీర్ఘమైన పగళ్ళని కానుకగా ఇచ్చిన సూర్యుడు కాస్తా శిశిరపు తెరలు తీయగానే నెమ్మదిగా మబ్బుల చాటున మొహం చాటేయడానికి అలవాటుపడి రానురానూ పగలు నిడివి తగ్గిపోతూ ఉంటుంది. చాలా సార్లు పగటి పూట సూర్యుడి జాడ లేక ఆకాశమంతా మబ్బు పట్టినట్టు మసక మసగ్గా ఉండి ముందు ముందు రాబోయే చలికాలపు చీకటి రోజులకి మనల్ని సిద్ధం చేయడం ఆరంభిస్తున్నట్టుంటుంది.

రాత్రిళ్ళు మనం అలా నిద్రలోకి జారుకోగానే బయటంతా దట్టంగా హిమపాతం కురవడం మొదలవుతుంది. మామూలు వర్షంలా దడదడమని హడావుడి చెయ్యకుండా మౌనంగా, మృదువుగా కురుస్తుంటుంది తెల్లారేదాకా. ఉదయాన్నే అంతటా చిక్కగా అలముకుని ఉన్న పొగమంచు మొత్తం ప్రపంచాన్నే మాయం చేసిందేమో అన్నట్టు భ్రమింపచేస్తూ చెట్టు, పుట్టా, కొంపా, గూడు, అన్నీటినీ తనలో దాచేసుకుని దర్శనమిస్తుంది. అలా సన్నగా తెరలు తెరలుగా కురుస్తున్న పొగమంచులో ఒక్కో తెరనీ తప్పించుకుంటూ

తన కొంగు చాటున దాచేసిన రంగు రంగుల చెట్లన్నీటినీ ఒక్కొక్కటిగా వెలికితీస్తూ ముందుకి పోతుంటే భలే సరదాగా ఉంటుంది.



ఆకుపచ్చటి గడ్డిపోచలన్నీ రంగు మార్చి తెల్లతెల్లగా మెరుస్తున్నాయేమిటా అని దగ్గరగా వెళ్ళి చూస్తే రాత్రంతా ఎవరో కూర్చుని శ్రద్ధగా ఒక్కోటీ పొందికగా పేర్చినట్టు కోట్ల కొద్దీ మంచు ముత్యాలు కనిపిస్తాయి. పువ్వులు, మొగ్గలూ కూడా ఆ మంచు బిందువులని ధరించి తమ సౌందర్యానికి మరిన్ని సొబగులు అద్దుకుని మురిసిపోతుంటాయి. అంతటి అందాన్ని చూసి ముచ్చటపడి చేత్తో వాటిని తాకీ తాకగానే చప్పున మంచు ముత్యాలన్నీ చప్పున జారి నేలపాలైపోతాయి. ఉస్సూరుమనుకునేసరికి మన ఒంటి మీద కూడా బోల్డన్ని చిరు చిరు హిమబిందువులు వచ్చి వాలతాయి. కళ్ళ ముందు దట్టంగా కురుస్తున్న పొగమంచుని కళ్ళు విప్పార్చి చూస్తూ, కనురెప్పల కొసలపై అలవోకగా చేరిపోతున్న మంచు తుంపర్లని తుడుచుకుంటూ, తడి చెంపలు నిమురుకుంటూ, సన్నగా వణికిపోతూ నడుస్తున్నప్పుడు కలిగే చిత్రమైన అనుభూతి ఈ శిశిర ఋతువు తెచ్చిచ్చే ఓ అందమైన కానుక!

జర్మన్లకి నడకంటే మహా ప్రీతి. ఒక్క వాకింగే కాదు, రన్నింగ్, జాగింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్ లాంటివన్నీ ఇక్కడ దాదాపు అందరి దగ్గరా తరచూ కనిపించే వ్యాపకాలు. ఏ ఊర్లో అయినా పార్కులు, గార్డెన్లతో పాటు చుట్టుపక్కల చిట్టడవుల్లో 'జాగింగ్ పాత్స్' ఉంటాయి. వేసవికాలంలో అలా చెట్ల మధ్యన సన్నటి మట్టిదారుల్లో నడవడమో, పరిగెత్తడమో వీళ్ళకి చాలా ఇష్టమైన పని. అలాగని చలికాలం వచ్చిందని వ్యాయామాలు ఏమీ మానెయ్యరు. Woods లో కాకపోయినా వీలయిన చోట్ల పరిగెత్తడమో, జిమ్ లకు వెళ్ళడమో, రకరకాల ఆటలు ఆడడమో చేస్తుంటారు. మనకి అన్నీటికన్నా క్రికెట్ మీద మక్కువ ఎలాగో ఇక్కడ వీళ్ళకి ఫుట్ బాల్ పిచ్చి ఎక్కువ. కానీ అదొక్కటే అని కాకుండా మిగిలిన అన్నీ రకాల క్రీడలకి కూడా బాగానే ఆదరణ ఉన్నట్టుంటుంది. ప్రపంచం మొత్తమ్మీద ఎక్కువ ఒలంపిక్ మెడల్స్ సాధించిన దేశాల జాబితాలో జర్మనీ మొదటి ఐదు స్థానాల్లోపే ఉందంటేనే తెలిసిపోతుంది కదా వీళ్ళు ఎంత క్రీడాభిమానులో!

మామూలు జనాలు కూడా ఎక్కువ శాతం మంది శరీరాకృతి, ఆరోగ్యం దృష్ట్యా వ్యాయాయం తప్పక చేసే పని. మన దగ్గర చిన్నపిల్లలు, స్కూలుకెళ్ళే పిల్లలు తప్ప మిగతా వారు సైకిళ్ళ వాడకం బాగా తగ్గిపోయింది. బహుశా దీనికి కారణం మోటార్ బైకులు

కొనుక్కునే స్థోమత ఉన్నప్పుడు ఇంకా సైకిల్ మీద తిరగాల్సిన అగత్యం ఏముందని కావచ్చు. పక్కవీధికి వెళ్ళాలన్నా బైకు మీద తిరిగేవాళ్ళు చాలామందే ఉంటారు కదా. కానీ ఇక్కడ మాత్రం స్థోమతతో సంబంధం లేకుండా కార్లున్న వాళ్ళు కూడా సైకిళ్ళు విరివిగా వాడుతుంటారు. వేసవికాలంలో అయితే ఎక్కడ చూసిన చిన్నా పెద్దా అందరూ సైకిళ్ళు తొక్కుతూ కనిపిస్తారు. ఔత్సాహికులందరూ కలిసి సైకిల్ టూర్లు వేసుకునే క్లబ్స్ లాంటివి కూడా ఉంటాయి. సైకిల్ తొక్కడం మీద వీళ్ళకి ఎంత ప్రీతి అంటే మనం ఏ సైకిలు షాపుకి వెళ్ళి చూసినా బోల్డన్ని రకాల సైకిళ్ళు వందల్లో మాత్రమే కాకుండా వేల యూరోల్లో కూడా ఉంటాయి. అంటే దాదాపు కారు కొనుక్కునేంత ఇష్టంగా సైకిళ్ళు కొని వాడుతుంటారన్నమాట వీళ్ళు. ఆర్ధిక స్థాయి, ఉద్యోగ స్థాయి, వయసు తేడాలేవీ లేకుండా డెబ్భై ఎనభై ఏళ్ళ బామ్మలు, తాతలు కూడా సైకిళ్ళ మీద తిరుగుతూ కనిపిస్తుంటారు. ఒకోసారైతే సూట్లు వేసుకుని సైకిల్ మీద వెళ్తున్న వాళ్ళని చూస్తే భలే తమాషాగా అనిపిస్తుంది. మా అందరిలాగానే మా ప్రొఫెసర్ గారు చలికాలంతో సహా రోజూ ల్యాబ్ కి సైకిల్ మీదే వస్తుంటారు.




ఒక పది కిలోమీటర్ల వరకంటే రోజూ సైకిలు మీద తిరగడానికి వీలవుతుంది కానీ మరీ ఎక్కువ దూరం ప్రయాణాలకి సైకిలుతో కష్టం కదా. సొంతంగా కారున్నా లేకపోయినా చాలామంది పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ అంటే రైళ్ళు, మెట్రోలు, ట్రాములు, బస్సులు ఎక్కువగా వాడతారు. నగరాలు, పట్టణాలు అన్నింటిలోనూ రవాణా వ్యవస్థ చాలా సౌకర్యంగా ఉంటుంది. ఊరిలోని ప్రతీ మూలకీ వెళ్ళడానికి వీలుగా ఉండటమే కాక వీటన్నిటి రూట్ మ్యాప్ లతో వివరంగా మొత్తం ఊరికి సంబంధించిన పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ మ్యాప్ ఉంటుంది. మనం కొత్తగా వెళ్ళినాసరే ఆ మ్యాప్ పట్టుకుని చాలా సులువుగా ప్రయాణం చెయ్యగలం. అలాగే మెట్రోలు, బస్సులు, ట్రాముల టైం టేబుల్ కూడా అన్నీ చోట్లా దొరుకుతుంది. ప్రతీ స్టాప్ లోనూ రాసిపెట్టి ఉంటుంది. రద్దీ ఎక్కువుండే ప్రదేశాల్లో, ఉదయం, సాయంత్రం ఆఫీసులకి వెళ్ళేవాళ్ళు ఎక్కువగా ఉండే 'రష్ అవర్' లో ప్రతీ పది నిమిషాలకీ ఒక మెట్రో రైలు ఉండటం లాంటి సౌకర్యాలు ఉంటాయి. ఇక్కడికి వచ్చిన కొత్తలో రైళ్ళు, ట్రాములతో పాటు అత్యంత అధునాతనంగా ఉండే మెర్సిడెస్ బస్సులని చూసినప్పుడు మాత్రం చాలా అబ్బురంగా అనిపించింది ఎందుకంటే అప్పటిదాకా మెర్సిడెస్ అంటే కార్లే తప్ప బస్సులు కూడా ఉంటాయని నాకు తెలీదు. బస్సులోంచి చిన్నపిల్లలతో ఉన్నవాళ్ళు బేబీ ప్రామ్ తో సహా దిగడానికి, అలాగే ముసలివాళ్ళు, వికలాంగులు బస్సు ఎక్కడానికి, దిగడానికి వీలుగా బస్సు బస్ స్టాప్ లో ఆగినప్పుడు తలుపు ఉన్న వైపు అలా కొద్దిగా వంగుతుంది. ఇలా చిన్నవిగా కనిపించే ఇలాంటి సౌకర్యాలు కొన్ని చాలా గొప్పగా ఉపయోగపడతాయి అనిపిస్తుంది. ఇలాంటివే ఇక్కడ నివసించే మనుషుల జీవన నాణ్యతని మెరుగుపరుస్తుందనుకుంటాను.




చాలా దేశాల్లో లాగానే ఇక్కడ కూడా బస్సులకి, రైళ్ళకి డే పాస్లు, మంత్లీ పాస్లు లాంటివి తీసుకోవచ్చు. విద్యార్థులకి అయితే టికెట్లలో రాయితీలు కూడా ఉంటాయి. అలా కాకుండా ఒక ఊరికో, ప్రాంతానికో మొత్తంగా ఒక టికెట్ కొనుక్కుని దాని మీద అక్కడ ఉండే ఏ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ని అయినా వినియోగించగలిగేలా టికెట్లు కొనుక్కోవచ్చు. రాష్ట్రం అంతా తిరగడానికి వీలయ్యేలా స్టేట్ టికెట్లు కూడా ఉంటాయి. డే టికెట్లు లాంటివి ఒక్కొక్కరికి కాకుండా గ్రూప్ గా కొనుక్కుంటే చవకగా వచ్చే ఆఫర్లు కూడా ఉంటాయి. ఉదాహరణకి బవేరియా స్టేట్ టికెట్ 38 యూరోలు పెట్టి కొనుక్కుంటే ఆ రోజు మొత్తం ఐదుగురు కలిసి ఆ రాష్ట్రమంతా ప్రయాణించవచ్చు. శని, ఆదివారాల్లో మాత్రమే లభించే వీకెండ్ టికెట్ ని 42 యూరోలు పెట్టి కొనుక్కుంటే ఆ ఒక్క రోజులో ఐదుగురు వ్యక్తులు కలిసి జర్మనీ అంతటా ప్రయాణించవచ్చు. సాధారణంగా ఇలాంటి టికెట్లు రీజియనల్ ఎక్స్ప్రెస్ (RE) స్థాయి వరకు మాత్రమే పనికొస్తాయి. ఇంటర్ సిటీ (IC), ఇంటర్ సిటీ ఎక్స్ప్రెస్ (ICE) లాంటి సూపర్ ఫాస్ట్ రైళ్ళకి ప్రత్యేకంగా టికెట్లు కొనుక్కోవాల్సి ఉంటుంది. జర్మనీలో ICE రైళ్ళు గంటకి 300 కిలోమీటర్ల పైనే ప్రయాణిస్తూ మిగిలిన అన్నీ రైళ్ళ కంటే అత్యంత వేగవంతంగా గమ్యస్థానాలకి చేరుస్తాయి. అంతటి వేగంగా ప్రయాణం తొందరగా అయిపోవడమే కాకుండా ఆ రైళ్ళ లోపల ప్రయాణీకులకి ఉండే సౌకర్యాలు చాలా అధునాతనంగా ఉంటాయి. బస్సులు, రైళ్ళకి సంబంధించిన టికెట్లు కొనుక్కోడానికి ప్రతీ స్టేషన్ లోనూ, కొన్ని స్టాపుల్లోనూ, బస్సుల్లోనూ, ట్రాముల్లోనూ టికెట్ ఆటోమాట్స్ ఉంటాయి. 'ఏటీఎం' లోనుంచి డబ్బులు తీసుకున్నట్టు సులువుగా వారికీ వారు టికెట్లు కొనుక్కుని వాడుకోవడమే! బస్సుల్లోనూ, రైళ్ళలోనూ తరచూ టికెట్ చెకింగ్ జరుగుతూ ఉంటుంది. టికెట్ లేకుండా ప్రయాణిస్తే అన్నీ చోట్లలాగే ఇక్కడ కూడా జరిమానా విధిస్తారు.

సైకిళ్ళు, రైళ్ళ సంగతి సరే మరి జర్మన్లు వీటిల్లో తిరగడం తప్ప కార్లు వాడరా అంటే అదెలా కుదురుతుంది మరి.. ఎందుకంటే జర్మన్ కార్లకి ప్రపంచవ్యాప్తంగా గొప్ప పేరు ప్రతిష్టలు ఉన్నాయి కదా! ప్రపంచంలోనే అత్యుత్తమ కార్ బ్రాండ్లు గా చెప్పుకునే BMW, Mercedes-Benz, Audi కంపెనీలకి జర్మనీ దేశమే పుట్టిల్లు. ఇవే కాకుండా Volkswagen, Porsche, Opel, Mini, Smart లాంటి ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ కూడా జర్మన్ కంపెనీలే. ప్రపంచానికి గొప్ప కార్లు అందించేవారు వారు మాత్రం కార్లు వాడకుండా ఎలా ఉంటారు. అందుకని మిగతా అభివృద్ధి చెందిన దేశాల్లో లాగే ఇక్కడ కూడా కార్ల సంఖ్య చాలా ఎక్కువే. కానీ, కార్లతో పాటు పైన చెప్పినట్టు మిగతావన్నీ కూడా విరివిగా వాడుతుంటారు ఇక్కడి ప్రజలు. జర్మనీలో కారు ఉంటే లక్జరీనే కానీ అది తప్పనిసరిగా అవసరం అయిన నిత్యావసరం మాత్రం కాదని చెప్పవచ్చు. మరీ మారుమూల చిన్న చిన్న పల్లెటూళ్ళలో ఉండేవారికి మాత్రం రోజంతా అన్నీ

వేళల్లో రైలు, బస్సు సౌకర్యాలు ఉండకపోవచ్చు కాబట్టి కారు తప్పనిసరి అవసరమేమో కానీ నగరాల్లో, పట్టణాల్లో ఉండేవారికైతే కారు లేకపోవడం వల్ల మరీ ఇబ్బందయితే ఉండదు.



జర్మనీలో ప్రజలకి, ప్రభుత్వాలకీ కూడా పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ మీద శ్రద్ధ ఎక్కువే. చాలా అభివృద్ధి చెందిన దేశాల్లో లాగే ఇక్కడ కూడా వీళ్ళకి అవసరమైనంత విద్యుత్ సమకూర్చుకోవాలంటే అణువిద్యుత్ ఉత్పత్తి తప్పనిసరిగా అమలులో ఉంది. అయితే 2022 కల్లా అణువిద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా మానేయగలిగే విధంగా సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ లాంటి renewable energy sources ని అభివృద్ధి పరచాలని జర్మన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగా కొన్ని న్యూక్లియార్ పవర్ ప్లాంట్స్ ని మూసివేసి సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ ని పెంచడం కోసం మరింత కృషి చేస్తున్నారు. జర్మనీలో వాతావరణస్థితుల ప్రకారం చూస్తే ఎండ ఉండేది చాలా తక్కువే అయినప్పటికీ ఇప్పుడు పర్ కాపిటా సోలార్ ఎనర్జీ కెపాసిటీ ప్రకారం చూస్తే ప్రపంచంలోని మిగతా అన్నీ దేశాల కన్నా జర్మనీ ఒక అడుగు ముందే ఉందట. కేవలం సోలార్ ఎనర్జీ ప్లాంట్స్ ఒక్కటే కాకుండా మామూలు జనావాసాలు, ఇళ్ళ మీద సోలార్ ప్యానెల్స్ పెట్టుకోవడం రానురానూ బాగా తరచుగా కనిపిస్తోంది ఇక్కడ. అలాగే పెట్రోలు, డీజిల్ లాంటి సహజ వాయువులతో మాత్రమే నడిచే వాహనాలు కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే వాహనాలు, విద్యుత్ తో నడిచే ఎలక్ట్రిక్ కార్లు మొదలైనవాటిని మరింతగా ప్రోత్సహించాలని కూడా జర్మన్ ప్రభుత్వం రకరకాల ప్రణాళికలు చేస్తోంది.

మానవ నాగరికత మరింత పైపైకి పోయేకొద్దీ ప్రకృతిలో మన చుట్టూ మనతో పాటు కలిసి బతకాల్సిన జంతుజాలానికి సమస్యలు ఎక్కువై వాటి మనుగడ కష్టంగా మారి అవి కనుమరుగైపోయే పరిస్థితులు తయారవుతున్నాయని, ఇది తక్షణం మారాలని పర్యావరణ శాస్త్రవేత్తలు అందరూ ప్రపంచవ్యాప్తంగా చెప్తున్న విషయం. చాలా ప్రదేశాల్లో జంతువులు ఇబ్బంది పడకుండా ఉండడం కోసమని వాటికోసం మాత్రమే ప్రత్యేకంగా కొన్ని బ్రిడ్జిలు లాంటివి కట్టడం కొంతవరకూ ఉపయోగిస్తుందని నిపుణుల సలహా. అంటే ఒక ప్రాంతం నుంచీ ఇంకో ప్రాంతానికి సహజంగా జరగాల్సిన జంతువుల రాకపోకలని మధ్యలో మనుషులు, రోడ్లూ, వాహనాలు అడ్డుకోకుండా ఉండేలా అన్నమాట. ఈ బ్రిడ్జిల మీదకి మనుషులు వెళ్ళడం నిషిద్ధం అన్నమాట. ఒకవేళ ఎవరైనా అలా వెళితే వాళ్ళకి జరిమానాలు విధిస్తారు. ఇలాంటి 'animal-only' గ్రీన్ బ్రిడ్జిల నిర్మాణం కోసం ఇప్పటికే జర్మనీ ప్రభుత్వం బోల్డు మిలియన్ల డాలర్లు ఖర్చు చేసిందట. వచ్చే పదేళ్ళలో ఇంకా చాలా మిలియన్ల యూరోలు ఖర్చు పెట్టి ఇలాంటివి మరిన్ని కట్టాలనే ప్రణాళికలు కూడా ఉన్నాయట.

మనిషి రోజు రోజుకీ అభివృద్ధి, టెక్నాలజీ అంటూ ఎంతదాకా పరుగులు తీస్తున్నా సరే మన చుట్టూ ఉన్న ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ విషయంలో కూడా ఎంతోకొంత బాధ్యతాయుతంగా ప్రవర్తించడం, ఆ దేశం ఈ దేశం అని కాకుండా అందరం ఎవరి పరిధిలో వారు చెయ్యగలిగినంత మేరకు కృషి చెయ్యడం మనందరి సమిష్టి కర్తవ్యం కదూ!

# ఆహారం - ఆరోగ్యం

ప్రపంచంలో ఏ మూలకి వెళ్ళినా ఆయా ఊర్లకీ, దేశాలకీ ప్రత్యేకము, సొంతమూ అయిన సంస్కృతీ సంప్రదాయాలంటూ కొన్ని ఉంటాయి కదా.. వాటిలో అక్కడి ప్రజల ఆహారపు అలవాట్లు, వారు ప్రత్యేకంగా తయారు చేసుకునే వంటలు అతి ముఖ్యమైన భాగమే కాదు, అందరూ ఆసక్తిగా తెలుసుకోవాలనుకునే అంశం కూడా! చాలా దేశాల్లోలాగే జర్మనీలో కూడా ప్రపంచీకరణ కారణంగా, మారిపోయిన ఉరుకుల పరుగుల జీవన విధానాల కారణంగా వచ్చి చేరిన మెక్డోనాల్డ్స్ లాంటి ఫాస్ట్ ఫుడ్స్ తో పాటు ఎన్నో దశాబ్దాలుగా జర్మన్లు ఆస్వాదిస్తున్న సాంప్రదాయక జర్మన్ వంటకాలు కూడా చాలానే ఉన్నాయి.

జర్మన్ల ఆహారపుటలవాట్లని గురించి చెప్పాలంటే, ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల లోపు అల్పాహారం తీసుకుంటారు. ఈ రోజుల్లో అంటే చాలామంది ఉదయాన్నే కార్న్ ఫ్లేక్స్, సెరెల్స్ లాంటివి తినేసి ఊరుకుంటున్నారు కానీ అసలు సిసలు జర్మన్ బ్రేక్ఫాస్ట్ అంటే రకరకాల బ్రెడ్లు, ఫ్రూట్ జాంలు, వెన్న, రకరకాల ఛీజ్లు, మాంసంతో తయారు చేసిన సాసేజ్లు, ఉడికించిన గుడ్లు, పండ్లు, పండ్ల రసాలు, బేక్ చేసిన రకరకాల తీపి వస్తువులతో చాలా హెవీగా ఉంటుంది. వారమంతా హడావుడిగా ఎలా తిన్నాసరే చాలా మంది జర్మన్లు వారాంతంలో ఇలాంటి హెవీ బ్రేక్ఫాస్ట్ చేస్తారు. చక్కటి ఆరోగ్యం సొంతమవాలంటే ఉదయం అల్పాహారం చక్రవర్తిలా, మధ్యాహ్న భోజనం రాజు గారిలాగా, రాత్రి భోజనం యాచకుడిలా భుజించాలన్న నానుడి జర్మన్లో కూడా ఉంది. గోధుమలు ఒక్కటే కాకుండా చాలా రకాల తృణధాన్యాలు, చిరుధాన్యాలతో పాటు పొద్దుతిరుగుడు గింజలు, గుమ్మడి గింజలు, నువ్వులు లాంటివి కూడా విరివిగా ఉపయోగించి తయారు చేసిన రకరకాల డార్క్ బ్రెడ్స్, హార్డ్ బ్రెడ్స్ ఎక్కువగా తింటారు. ఆరోగ్యానికి మేలు చేసే ఇలాంటి రొట్టెలు కేవలం అల్పాహారంలోనే కాక మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో కూడా తీసుకుంటారు.



Boiled potatoes, Röstis, Salad

జర్మన్లు సాధారణంగా మధ్యాహ్న భోజనం పదకొండు నించీ ఒకటిన్నర మధ్యలో, రాత్రి భోజనం మరీ ఆలస్యం కాకుండా ఏడు నుంచి తొమ్మిది లోపు తినేస్తారు. భోజనంలో దాదాపు ప్రతీరోజూ మనకి అన్నం ఎలాగో అలా ఇక్కడ బంగాళాదుంపలు ఎక్కువగా తింటారు. ఉడికించినవో, సలాడ్ లాగానో, వేయించినవో, డంప్లింగ్స్ లాగానో మొత్తమ్మీద ఓ ఇరవై ముప్పై రకాలుగా ఏదో ఒక రూపంలో బంగాళాదుంపలు తరచూ తింటారు. జర్మన్ల ఆహారంలో అధిక భాగం మాంసాహారపు వంటకాలే ఉంటాయి. ప్రాధాన్యతాపరంగా చూస్తే పోర్క్, బీఫ్ వినియోగం ఎక్కువ. వాటి తర్వాతే చికెన్, టర్కీ, చేపలు లాంటివి వస్తాయి. చాలామందికి తెలిసినట్టుగానే పోర్క్, బీఫ్ తో తయారు చేసే రకరకాల జర్మన్ సాసేజ్లు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచాయి. సాసేజ్లు మస్టర్డ్ సాస్ తో తినడానికి బాగా ఇష్టపడతారు. వీటి తయారీకి, వినియోగానికీ, ఆయా రెసిపీలకీ వందల ఏళ్ళ చరిత్రలు కూడా ఉంటాయి. ఇదొక్క అంశం మీద బోల్డన్ని పుస్తకాలు కూడా రాసేంత సమాచారం ఉంటుంది. అన్నేసి రకాలు ఉంటాయి వాటిలో. సాసేజ్ ని జర్మన్లో వుర్స్ట్ అంటారు. వుర్స్ట్ తో పాటు బీఫ్, పోర్క్ తో తయారు చేసే స్నిట్జెల్ లాంటివి కూడా ఇక్కడ బాగా ప్రత్యేకం. మాంసంతో పాటు పక్కన ఉడికించిన కూరగాయలు, రకరకాల ఆకులతో చేసిన సలాడ్స్ తప్పకుండా తింటారు.



Brezel, Nussschnecken, Rote Grütze

ఉదయం, మధ్యాహ్నం భోజనం అయ్యాక చివరిలో వేడి వేడిగా ఒక కప్పు కాఫీ తప్పనిసరి. గ్రీన్ టీ, బ్లాక్ టీ లాంటివి కూడా బాగానే తాగినా జర్మన్లు ముఖ్యంగా కాఫీ ప్రేమికులు. రోజుకి రెండు మూడు సార్ల కన్నా ఇంకా ఎక్కువసార్లు కాఫీ తాగేవాళ్ళు కోకొల్లలు ఇక్కడ. పాలు, చక్కెర తక్కువగా వేసుకుని, లేకపోతే అసలు అవేం లేకుండా బ్లాక్ కాఫీ తాగడానికి ఎక్కువ ఇష్టపడతారు. భోజనం తర్వాత కాఫీ తాగడంతో పాటు ఏదైనా స్వీటో, చాక్లెటో తినడం వీళ్ళకి బాగా అలవాటు. మన దగ్గర చాక్లెట్స్ పిల్లలే ఎక్కువ తింటారు కానీ ఇక్కడ

మాత్రం ముసలి వాళ్ళదాకా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ చాక్లెట్లు బాగానే లాగించేస్తుంటారు. జర్మన్లది బేకింగ్లో అందె వేసిన చేయి. ఎన్నెన్నో రకాల కేకులు, కుక్కీస్, పేస్ట్రీస్ ఫ్రెష్ గా రోజూ బేక్ చేసి అమ్మే బోలెడన్ని బేకరీలే కాకుండా ఇళ్ళల్లో కూడా తరచూ బేకింగ్ చేస్తుంటారు. సాయంత్రం స్నాక్స్ టైం అంటే జర్మనీలో కాఫీతో పాటు కేక్స్ టైం అని కూడా అర్థం. కేక్స్ తో పాటు నట్ రోల్స్ లాగా చేసే ఐస్నెస్సెన్కెన్, పేన్ కేక్స్ కి దగ్గరగా రుచించే ఖైసెర్ష్మరెన్, రెడ్ బెర్రీస్ తో చేసే ఋఒతె ఫ్రüత్జెలాంటి ఇంకా చాలా రకాల సాంప్రదాయక జర్మన్ స్వీట్లు కూడా ఉన్నాయి. తీపి వంటకాల్లో దాల్చిన చెక్క పొడి కలిపిన చక్కెర వాడకం వీళ్ళకి చాలా ఇష్టం.



జర్మనీలో స్నేహితులు ఎవరైనా ఎక్కడైనా బయట రెస్టారెంటులో కాఫీకో, భోజనానికో కలుసుకుందాం అని ప్లాన్ చేసుకున్నారనుకోండి. ప్లాన్ చేసింది ఎవరైనా గానీ అక్కడికి వెళ్ళి సరదాగా అందరూ కలిసి తిన్నాక బిల్లు మాత్రం ఎవరిది వాళ్ళే కట్టేస్తారు. ఎప్పుడో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్ప ఇలా ఎవరి బిల్లు వారే కట్టుకోవడం అనేది చాలా సాధారణ విషయం ఇక్కడ. ఒకవేళ ఎవరైనా అందరిదీ నేనే కడతాను అని ఆఫర్ చేసారనుకోండి, మన దగ్గరలాగా "అబ్బే ఎందుకు లెండి. నేను కడతానుగా" అంటూ నేనంటే నేనని అస్సలు మొహమాటాలకి పోకుండా "ఓహో అలాగా, సరే అయితే" అనేస్తారు. కాకపోతే ఈ వంక పెట్టుకుని ఊరికే వేరేవాళ్ళ చేత బిల్లు కట్టించేద్దాం అని ఎవరూ చూడరులెండి.

ఇంకొకటి, సాధారణంగా ఒక్క ఇండియాలోనే కాదు, చాలా ఆసియా దేశాల్లో అమ్మాయి వెంట అబ్బాయి వెళితే బిల్లు ఎప్పుడూ అబ్బాయిలే కడుతుంటారు కదా. కొన్ని దేశాల్లో అయితే బిల్లు అబ్బాయి కట్టకపోతే, కట్టలేకపోతే అవమానం లాంటిది కూడానట. ఇక్కడలా కాదు. ఒక్క బిల్లు కట్టే విషయంలోనే కాదు, జర్మనీలో అమ్మాయిలు అన్న ట్యాగ్ తో ప్రత్యేకంగా ట్రీట్ చెయ్యడం అంటూ చాలావరకు ఉండదు. అంటే, అమ్మాయి పక్కన ఉండే అబ్బాయి తన బాధ్యత తీసుకోవాలి, ప్రొటెక్టివ్ గా ఉండాలి అన్నట్టు ఇద్దరూ ప్రవర్తించరు. అమ్మాయిలు కూడా అబ్బాయిలతో సరిసమానంగా ఎవరి మీదా ఆధారపడకుండా, వేరొకరి సహాయం ఆశించకుండా స్వతంత్ర్యంగా మసలుకుంటారు.

నా స్నేహితులు ఒక జంట ఉన్నారు. అబ్బాయి జర్మన్, అమ్మాయి ఏషియన్. ఒకసారి ఆ అమ్మాయి "మా ఆసియా సంస్కృతి రీత్యా అబ్బాయిలు అమ్మాయిలని



Bratwurst with Sauerkraut, Brühwurst with vegetable stew

ప్రత్యేకంగా ట్రీట్ చేస్తారు తెలుసా.. ఉదాహరణకి అమ్మాయి నించుంటే అబ్బాయిలు లేచి సీటు ఇవ్వడం, చేతుల్లో ఉన్న బరువులు అందుకుని వాళ్ళు మోసిపెట్టడం, ఎత్తులు ఎక్కేప్పుడో, నడిచేప్పుడో చెయ్యందించి సాయం చెయ్యడం లాంటివి చేస్తారు. ఎందుకంటే అమ్మాయిలు సుకుమారులు అని, ఇంకా అలా పంపెర్ చెయ్యడం చాలా స్వీట్ గా అనిపిస్తుంది" అంటే, వాళ్ళాయన అయిన జర్మన్ అబ్బాయి "ఇక్కడైతే మాత్రం అబ్బాయిలు అవేమీ చెయ్యరు. అయినా అమ్మాయిలైతే ఏంటీ, వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోలేరా, ఎవరి వస్తువులు వాళ్ళే మోసుకోడానికి వాళ్ళకి కూడా రెండు చేతులున్నాయి కదా.. సాధారణంగా జర్మన్ అమ్మాయిలు అలా చెయ్యాలని ఆశించరు. ఈ గుఎస్స్ ఘెర్మన్ వొమెన్ అరె సెల్ఫ్ సుఫ్ఫిచిఎంత్" అని నవ్వాడు. తన వైఫ్ ఏమో "కేవలం అమ్మాయిలు చేసుకోలేరని కాదు బాబూ.. అలా పేంపర్ చెయ్యడం అదొక ముద్దూ మురిపెమూనూ.. అంతే కదా.." అని నన్నడిగితే నాకు చాలా నవ్వొచ్చింది. కానీ ఆలోచించి చూస్తే అదీ నిజమేనేమో, మనం, అంటే ఏషియన్ కల్చర్ లో ఆలోచనావిధానం కొంచెం అలానే ఉంటుంది కదా అనిపించింది. :-)

మనల్ని ఎవరైనా జర్మన్లు వాళ్ళింటికి భోజనానికి ఆహ్వానించారంటే వాళ్ళకి మన మీద బోల్డు అభిమానం ఉందని అర్థం. ఎందుకంటే సాధారణంగా ఈ రోజుల్లో వాళ్ళ కోసం వాళ్ళు వండుకుని తినేదే తక్కువ. అంటే వంట చేసుకోవడానికి చాలా తక్కువ సమయం వెచ్చిస్తారు వీళ్ళు. అలాంటిది ఇంకొకరి కోసం శ్రమపడి వండి వార్చడం అంటే గొప్ప విషయమే మరి. ఎవరైనా మనని ఫలానా రోజున భోజనానికి ఏడింటికి రండి అని పిలిస్తే మనం సరిగ్గా ఆ టైముకే వెళ్ళాలి. చెప్పిన టైము కన్నా పదిహేను నిమిషాలు మించి ఆలస్యంగా వెళితే మనం వాళ్ళని అగౌరవపరిచినట్టు లెక్క. సాధారణంగా ఇక్కడ అతిథులుగా వెళ్ళేవారు ఆహ్వానించిన వారింటికి వెళుతూ భోజనానికి పిలిచినందుకు సంతోషిస్తూ గౌరవసూచకంగా పువ్వులో, మొక్కలో, వైన్ బాటిలో, స్వయంగా ఇంట్లో తయారు చేసిన ఫ్రూట్ జామ్ సీసానో.. ఇలాంటి చిరుకానుకలు ఏదోకటి తీసుకువెళ్ళడం ఆనవాయితీ. అంటే ఉట్టి చేతులతో వెళితే రానివ్వరని కాదు కానీ ఇక్కడ దాదాపు అందరూ పాటించే మర్యాద అన్నమాట ఇది.

అలాగే మనం ఎవరినైనా ఆహ్వానించాలన్నా కూడా "రేపు మా ఇంటికి భోజనానికి రండి" అని తీరిగ్గా ఒక రోజో, రెండు రోజులో ముందు పిలవడం పద్ధతి కాదు. ఎందుకంటే ఎవరి ప్లాన్లు వాళ్ళకి ఉంటాయి కదా.. అసలే నెలల ముందు నుంచే అన్నీ ప్లాన్ చేసి పెట్టుకోవడం జర్మన్లకి బాగా అలవాటు. కాబట్టి కనీసం రెండు వారాల ముందైనా చెప్పాలి. ఇంకో ముఖ్య విషయం,




**Weißwurst - A Bavarian specialty**

నేను కేవలం శాకాహారం తింటాననో, లేకపోతే ఫలానా రకం తిండి మాత్రమే తింటాననో ఏమైనా ప్రత్యేకంగా ఉంటే వాటి గురించి ముందుగానే హోస్టుకి తెలియజేయాలి తప్ప తీరా వాళ్ళు ఎంతో కష్టపడి మన కోసం వండి వడ్డించాక కంచం ముందు కూర్చుని "సారీ.. నేనిది తినను" అనకూడదు. అలా చేస్తే అది వాళ్ళని అవమానించినట్టే అవుతుంది. మిగతా విషయాలన్నీటి కన్నా ఇది మాత్రం నాకు చాలా నచ్చేసింది. 'అతిథిదేవోభవ' అన్న మాటని అక్షరాలా పాటించడం మంచి విషయమే గానీ ఆహ్వానించిన ఇంటి ఇల్లాలు పాపం కష్టపడి రకరకాలు వండిపెట్టాక కూడా తీరా వచ్చిన అతిథులు మేము ఫలానాది తినము, అదైతేనే తింటాము, ఇదైతేనే తింటాము అనగానే చచ్చినట్టు ఉరుకుల పరుగుల మీద అప్పటికప్పుడు నిమిషాల్లో మళ్ళీ ఇంకో రకం వంట చేసి పెట్టే పరిస్థితి మాత్రం చాలా కష్టం అనిపిస్తుంది నాకు. ఎప్పుడో అప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదుర్కోని తెలుగింటి ఆడపడుచులు ఉండరేమో బహుశా. అప్పటికప్పుడు చెప్పినా సరే అతిథుల కోసం మళ్ళీ వండి వార్చడం ఇల్లాలి విధి, కర్తవ్యం అన్నట్టు ఏదో శాసనంలా భావిస్తారు చాలామంది. ఎంతైనా వంటగదిలో శ్రమకి విలువ, గౌరవం రెండూ తక్కువే మన సమాజంలో.. హ్మ్!

భోజనాలయ్యాక వారి వంటలు మనకెంత నచ్చాయని హోస్టుకి కాంప్లిమెంట్ ఇవ్వడం కూడా గౌరవప్రదమైన పని. అలాగే తినగానే టాటా చెప్పేసి వెళ్ళిపోకుండా కాసేపు కూర్చుని మాట్లాడటం మంచిదే కానీ గంటల తరబడి అలా మాట్లాడుతూ కూర్చోడం మాత్రం మర్యాద కాదు. ఎందుకంటే మరి పాపం వాళ్ళు చాలా శ్రమపడి మనకి విందు ఏర్పాట్లు చేసి అలసిపోయి ఉంటారు కదా.. అందుకని వాళ్ళకి రెస్టు తీసుకునే అవకాశం ఇచ్చి మనం సెలవు తీసుకోవాలన్నమాట.

మనకి పది, ఇరవై మందికి వంట చెయ్యాల్సి రావడం చాలా మామూలనిపిస్తుంది గానీ వీళ్ళకి చాలా అనిపిస్తుంది. ఉదాహరణకి పెళ్ళి వేడుకల్లో వెయ్యి మందికి పైగా భోజనాలు వడ్డిస్తారంటే వీళ్ళు ఆశ్చర్యంతో గుండెల మీద చేతులేసుకుంటారు. అంతమందికి ఎలా వండుతారు, ఎన్ని డబ్బులు ఖర్చవుతాయి అని వివరంగా తెలుసుకుంటారు. నిజానికి ఇక్కడ కూడా పెళ్ళిళ్ళు అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. కాకపోతే వీళ్ళ ఖర్చు మనలాగా కట్నకానుకలకి, నగలకి కాకుండా ఎక్కువగా వివాహ వేడుకలని జరపడానికే ఉంటుంది. ఇహ అమ్మాయిల పెళ్ళి బట్టల ఖర్చు ఎక్కడైనా ఎక్కువేననుకోండి. ఇక్కడ కూడా పెళ్ళి చేసుకునేవారు చాలా నెలల ముందు నుంచే బోల్డంత తర్జన భర్జనలు పడి వెడ్డింగ్ ప్లానింగ్ చేసుకుంటారు. వధూవరులిద్దరికీ అత్యంత ఆప్తులు, ముఖ్యులు అనుకున్న అతి కొద్దిమందికే పెళ్ళిళ్ళ ఆహ్వానాలు ఉంటాయి. ఎవరైనా పెళ్ళి విందుకి ఒక వంద మందిని పిలిచారంటే చాలా ఎక్కువమందిని ఆహ్వానించేసినట్టు లెక్క. మనకి జనాభా, మేన్ పవర్ ఎక్కువ కాబట్టి వేల మందికి వండి వడ్డించడం బాగా అలవాటైపోయింది గానీ జర్మనీ లాంటి దేశాల్లో అది చాలా కష్టం, ఖర్చుతో కూడుకున్న పని.

చిన్నపిల్లలు ఆరోగ్యకరమైన ఆహారం తినడం చాలా ముఖ్యం కాబట్టి ఈ విషయమై కేవలం ఇళ్ళల్లో తల్లిదండ్రులే కాకుండా ప్రభుత్వం, స్కూల్లో టీచర్లు కూడా చాలా శ్రద్ధ తీసుకుంటారు. ఉదాహరణకి ఇక్కడ చాలా రాష్ట్రాల్లో పిల్లల స్కూళ్ళకి 500

మీటర్ల పరిధిలో ఫాస్ట్ ఫుడ్స్ సెంటర్స్ లాంటివి పెట్టడానికి వీల్లేదని రూల్స్ ఉన్నాయట. స్కూల్లో తినుబండారాలు అమ్మే క్యాంటీన్ లాంటి వాటిల్లో కూడా మరీ ఎక్కువ జంక్ ఫుడ్ ఉండకుండా ఎక్కువ శాతం ఆరోగ్యకరమైన తిండి అమ్మేటట్టు కూడా నిబంధనలు ఉన్నాయట. పిల్లలు స్కూలుకి తీసుకెళ్ళే లంచ్ బాక్సుల్లో కూడా స్వీట్స్ లాంటివి కాకుండా బ్రెడ్, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసేట్టు, కొన్ని కొన్ని రోజుల్లో ప్రత్యేకంగా కూరగాయలు మాత్రమే తెచ్చుకోవాలనే లాంటి నియమాలు పెట్టి సాధ్యమైనంత వరకూ పిల్లల ఆహారపుటలవాట్లు ఆరోగ్యంగా ఉండేట్టు అందరూ కృషి చేస్తుంటారు.

జర్మనీలో వైద్యం అత్యంత ఖర్చుతో కూడుకున్నదే అయినా సరే ఆరోగ్యం విషయంలో జర్మనీలో అస్సలు భయపడాల్సింది ఉండదు. అంటే ఒంట్లో బాగాలేకపోతే, ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఆసుపత్రి చుట్టూ తిరగడానికి, వైద్యానికి, మందులకి అన్నేసి డబ్బులు ఎలా అన్న భయం ఉండదు, ఎందుకంటే అప్పుడే పుట్టిన పాపల దగ్గర్నుంచీ ముసలివారి దాకా జర్మనీలో నివసిస్తున్న ప్రతీ ఒక్కరికీ తప్పకుండా ఆరోగ్య భీమా ఉండి తీరాలి. ఆరోగ్యభీమా లేకుండా ఇక్కడసలు ఉండే వీలే లేనంతగా నిబంధనలు ఉన్నాయి. ఆరోగ్య భీమాతో పాటు రకరకాల సోషల్ సెక్యూరిటీ పేకేజీలు కూడా జర్మనీలో ఎక్కువే కాబట్టి ఇక్కడ ప్రజల జీవన నాణ్యత, సామాజిక భద్రతకి అస్సలు ఢోకా లేదంటే ఏ మాత్రం ఆశ్చర్యం లేదు!

●●●

# పండుగ రోజుల్లో..

డిసెంబర్ వస్తోందంటేనే ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లోలాగే జర్మనీలో కూడా పండగ వాతావరణం చోటు చేసుకుంటుంది. దాదాపు డిసెంబర్ నెలంతా క్రిస్మస్ పండగ సంబరాలు జరుగుతూనే ఉంటాయి. అధికారికంగా 25, 26 తేదీలే పండగ సెలవు రోజులైనా చాలామంది ఉద్యోగ నిర్వహణల నుంచి ఇంకా ఎక్కువ రోజులే సెలవులు తీసుకుంటారు. ప్రపంచంలో చాలా దేశాలతో పోలిస్తే సెలవుల విషయంలో ఐరోపా దేశాలు ముందుంటాయి. జర్మనీలో అయితే వివిధ రాష్ట్రాల నియమాలని అనుసరించి 9-13 పబ్లిక్ హాలిడేస్ ఉంటే, ఉద్యోగంలో తీసుకోగలిగిన సెలవలు 24-30 దాకా ఉంటాయి. ఇవి కాక ఆరోగ్యం బాగాలేనప్పుడు తీసుకునే సెలవలు అదనం. మామూలు శనాదివారాలు ఎలాగూ ఉంటాయి. కాబట్టి, మొత్తంగా చూస్తే సెలవుల విషయంలో జర్మనీలో ఉద్యోగస్తులు అదృష్టవంతులు అనే చెప్పొచ్చు.



నవంబర్ లో ఎక్కువగా కనిపించిన పొగమంచు క్రమంగా మాయమైపోతూ చలి పెరిగి మంచుజల్లులు కురవడం ప్రారంభమవుతుంది. ఆకులు రాల్చేసి నల్లటి మోడులైపోయిన చెట్లన్నీ తెల్లటి మంచుపూలని సింగారించుకుంటాయి. సూర్యదర్శనభాగ్యం తగ్గిపోయి చీకటి రోజుల్లోకి వచ్చేసినా సరే ఈ నెలంతా పండుగ వాతావరణంతో అన్నీ ప్రదేశాలు వెలిగిపోతుంటాయి. ఊరంతా అందంగా అలంకరించిన విద్యుద్దీపాలతో, పండుగ సంబరాలతో మెరిసిపోతూ ఉంటుంది. మనం దీపావళికి దీపాలు, లైటింగుతో అలంకరించుకున్నట్టు ఇక్కడ అందరూ కొవ్వొత్తులు, విద్యుద్దీపాలతో ఇళ్ళని అందంగా అలంకరించుకుంటారు. ఊరి మధ్యలోనే కాక, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ లో కూడా అందంగా అలకరించిన పెద్ద పెద్ద క్రిస్మస్ ట్రీలు కనిపిస్తాయి. అన్నీ దుకాణాల్లోనూ క్రిస్మస్ సంబరాలకి అవసరమైన రకరకాల అలంకరణ సామాగ్రి, ఈ కాలంలోనే ప్రత్యేకంగా వచ్చే చాక్లెట్లు, తినుబండారాలు, పండుగ సందర్భంగా అందరూ ఇచ్చిపుచ్చుకునే బహుమతులు ఒకటేమిటీ అన్నీ రకాల ప్రత్యేకతలతో సందడి నెలకొంటుంది.




జర్మనీలో డిసెంబర్ 6వ తేదీని 'సెయింట్ నికోలస్ రోజు' గా జరుపుకుంటారు. ఇది ముఖ్యంగా పిల్లలకి చాలా ఇష్టమైన పండుగ. ఈ పండుగ నాలుగవ శతాబ్దంలో అందరిచేతా పూజింపబడిన నికోలస్ అనే ఒక సెయింట్ బిషప్ పేరు మీదుగా ఏర్పడింది. డిసెంబర్ 5 వ తేదీ రాత్రి చిన్నపిల్లలందరూ తమ బూటు ఒకదాన్ని చక్కగా శుభ్రం చేసి, అందంగా పాలిష్ చేసి తమ గది తలుపు ముందు పెట్టి పడుకుంటారు. పిల్లలు నిద్రపోయాక రాత్రిపూట నికోలస్ వచ్చి ఆ బూట్లలో చాక్లెట్లు, కుకీస్, ఆపిల్స్, ఆరెంజెస్ లాంటి ఫ్రూట్స్, నట్స్, చిన్న చిన్న బొమ్మలు నింపి వెళతాడు. అయితే ఏడాదంతా క్రమశిక్షణతో బుద్ధిగా ఉన్న మంచి పిల్లలకే నికోలస్ కానుకలు తెస్తాడు. చెప్పిన మాట వినకుండా, అల్లరిచిల్లరిగా ఉన్న పిల్లలకి కానుకలు ఉండవు. వారి బూట్లలో చెట్టు కొమ్మలు నింపేసి వెళతాడు. పైగా కొన్నిసార్లు నికోలస్ వచ్చి అల్లరి పిల్లలతో నేరుగా వాళ్ళ తప్పుల గురించి కోప్పడి వచ్చే ఏడాది మంచిగా ఉంటే



కానుకలిస్తానని చెప్తాడు. మరీ శృతి మించి అల్లరి చేసే పిల్లలకి నికోలస్ చేతిలో ఉండే పెద్ద చువ్వతో దెబ్బలు పడతాయని భయం చెపుతుంటారు కూడా. ;-)

జర్మనీలో ప్రత్యేకంగా డిసెంబర్ మొదటి, రెండో వారాల నుంచి 'క్రిస్మస్ మార్కెట్లు' మొదలవుతాయి. ప్రతీ ఊర్లోనూ ఈ తరహా మార్కెట్లు ఉన్నా కొన్ని ప్రసిద్ధ నగరాల్లోని క్రిస్మస్ మార్కెట్లు దేశం నలువైపుల నుంచి చాలామంది సందర్శకులని ఆకర్షిస్తాయి. ఉదాహరణకి Nuremberg నగరవీధుల్లో ప్రతీ ఏడాది తెరిచే క్రిస్మస్ మార్కెట్ ని జర్మనీలోనే ప్రాచీనమైనదిగా చెప్పుకోవచ్చు. 17 వ శతాబ్దం నుంచీ అక్కడ ఈ ఆనవాయితీ ఉన్నట్టుగా చెపుతారు. ఈ ఊర్లో ఈ పండుగ కాలంలో ప్రత్యేకంగా తయారుచేయబడే Lebkuchen (అంటే జింజర్ బ్రెడ్ లాంటివి) ప్రపంచ ప్రసిద్ధి గాంచాయి.

ఈ క్రిస్మస్ మార్కెట్లలో చిన్న చిన్న గుడిసెల్లా వేసిన స్టాల్స్ ఉంటాయి. వాటిల్లో ఎక్కువ శాతం క్రిస్మస్ ట్రీ ని అలకరించుకునే రకరకాల బొమ్మలు, కొవ్వొత్తులు, ఊలుతో అల్లిన లేసులు, దుస్తులు, క్రిస్మస్ స్టార్స్ వగైరా చాలానే ఉంటాయి. ఈ వస్తువులన్నీ చాలావరకు హస్తకళాప్రతిరూపాలై ఉంటాయి. ఉదాహరణకి చెక్కల మీద చెక్కిన బొమ్మలు, తేనెటీగల మైనంతో రకరకాల ఆకృతుల్లో తయారు చేసిన కొవ్వొత్తులు, కొవ్వుత్తులు పెట్టుకోడానికి హ్యాండ్ పెయింటెడ్ గాజు చిమ్నీలు, వెదురు ముక్కలతో అల్లిన బొమ్మలు లాంటివన్నమాట. చూడటానికి ఎంతందంగా ఉంటాయో ధరలు కూడా అంత ఎక్కువ ఉంటాయి. ఇంకా మ్యూజిక్ బ్యాండ్స్ అందించే సంగీత వినోదం, చల్లటి వాతావరణంలో వేడివేడిగా వండి వడ్డించే రకరకాల తినుబండారాలు ప్రత్యేకంగా అలరిస్తాయి. రకరకాల మీట్ సాసేజ్లు, ప్యాన్ కేక్స్, చాక్లెట్ పూత పూసిన పండ్లు, చక్కర పూత పూసి దోరగా వేయించిన బాదంపప్పు, జీడిపప్పు లాంటి రకరకాల గింజలు, ఉడికించి వేయించిన చెస్ట్ నట్స్, పాప్ కార్న్, కాటన్ క్యాండీ లాంటివన్నీ ఉంటాయి.



వీటన్నిటినీ మించిన ప్రత్యేక ఆకర్షణ మాత్రం వేడి వేడిగా పొగలు కక్కే గ్లూ వైన్ (GlÜhwein) అనే చెప్పాలి. అసలు వైన్ వేడి వేడిగా ఉండడం ఏంటి అనుకుంటున్నారా? అదే మరి దీని ప్రత్యేకత.

ఈ వైన్ ని ఈ క్రిస్మస్ సీజన్లో మాత్రమే తాగుతారు. ఒక చిన్న సైజు గంగాళం లాంటి దాంట్లో రెడ్ వైన్ పోసి సన్నని మంట మీద వేడి చేస్తారు. చక్కర గడ్డ ఒకటి తీసుకుని దాన్ని ఆల్కహాల్ తో తడిపి నిప్పు అంటిస్తారు. ఆ మంటకి కరిగిన చక్కర పాకం నేరుగా వైన్లో పడేలా చూస్తారు. అందులో దాల్చిన చెక్క, లవంగాలు, జాజిపువ్వు లాంటి కొన్ని రకాలైన మసాలా దినుసులు వేసి ఇంకాసేపు మరిగిస్తారు. కాస్త వగరు రుచి కోసమని నారింజ పండు, నిమ్మ కాయలని తొక్కతో పాటే ముక్కలుగా కోసి వేస్తారు. వీటన్నీటితో కలిసి వైన్ బాగా మరిగాక వేడి వేడిగా పొగలు కక్కుతున్న Glühwein ని కప్పుల్లో పోసి ఇస్తారు. గడగడా వణికించే చలిలో ఆరుబయట ఆ స్టాల్స్ ముందు నించుని వేడి కప్పు చుట్టూ అరచేతులు చుట్టేసి చలి కాచుకుంటూ ఆనందంగా 'గ్లూ వైన్' ని ఒక్కో గుక్కా ఆస్వాదిస్తూ సేవిస్తుంటే ఆ మజానే వేరు! చిన్నపిల్లల కోసం, వైన్ తాగని వాళ్ళ కోసం ఆల్కహాల్ లేకుండా కేవలం పండ్లరసాలతో చేసేవి ఉంటాయి. ఈ సీజన్లో క్రిస్మస్ మార్కెట్ సందర్శించి చలి మరీ ఎక్కువై వణికించేదాకా అన్నీ స్టాల్స్ లోనూ బాగా తిరిగేసి చివర్లో వేడి వేడిగా ఒక కప్పు గ్లూ వైన్ తాగేసి రావడం ఇక్కడ దాదాపు అందరూ విధిగా చేసే పని.




క్రిస్మస్ కుటుంబ సభ్యులు అందరూ కలిసి చేసుకునే పండగ కాబట్టి అందరూ తమ తమ తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు, పిల్లలతో కలిసి జరుపుకోడానికి ప్రాధాన్యతనిస్తారు. అలాగే దాదాపు అందరూ ఎవరి స్థోమతకి తగినట్టు వారు ఒకరికొకరు క్రిస్మస్ కానుకలు ఇచ్చి పుచ్చుకుంటారు కాబట్టి ఈ నెలలో కొన్ని వేల యూరోల్లో వ్యాపారం జరుగుతుంది. ఊర్లో వీధుల్లో, దుకాణాల్లో ఎంత హడావుడిగా ఉన్నాసరే అదంతా 24 వ తేదీ మధ్యాహ్నం దాకానే.ఆ రోజు మధ్యాహ్నం నుంచి మొదలుకుని 25, 26 రెండు రోజులు కూడా మొత్తం అన్నీ మూసేస్తారు. మరి వాళ్ళు కూడా పండుగ చేసుకోవాలి కదా!

24 వ తేదీని 'పవిత్ర సాయంకాలం' అంటారు. అందరూ తమ ఇళ్ళల్లో కూడా క్రిస్మస్ ట్రీలు అలంకరించుకుంటారు. కొందరికి ఈ రోజున చనిపోయిన తమ కుటుంబసభ్యుల సమాధులని సందర్శించి పూజించే ఆచారం ఉంటుంది. రాత్రికి ప్రత్యేకమైన విందు భోజనం ఉంటుంది. సాసేజ్లు, మాంసం, చేపలు, బంగాళాదుంపలు, సలాడ్స్ లాంటి రకరకాల ఆహారపదార్థాలు ఘనంగా వండుకుంటారు. బీర్, గ్లూ వైన్ సేవనం సరే సరి! క్రీస్తు పుట్టినప్పటి కథలు, గాథలని పాటలుగా పాడుకుంటారు.

క్రిస్మస్ కానుకలు ఇచ్చిపుచ్చుకునే రసవత్తర కార్యక్రమం కొందరు 24 న, కొందరు 25 న జరుపుకుంటారు. కానుకలన్నీ ముందే క్రిస్మస్ ట్రీ కింద పెట్టి అక్కడనుంచి అందరూ తీసుకుంటారు. చిన్నపిల్లలు శాంటాక్లాజ్ తమకి కానుకలు తీసుకొచ్చాడని నమ్ముతారు. పిల్లలందరూ ప్రతీ ఏడాది తమకి ఏం కానుకలు కావాలో చిన్న స్లిప్స్ లో రాసిస్తారు. చాలామంది పిల్లలు ఫలానా బొమ్మ కావాలనో లేకపోతే వాళ్ళ బొమ్మల కోసం కొత్త బట్టలు, మంచం లాంటివి కావాలనో అడిగితే భలే ముద్దుగా ఉంటుంది. :-)

24 వ తేదీన అన్నీటికన్నా ముఖ్యమైనది అర్ధరాత్రి పూట చర్చిలో ప్రార్థనలు. సహజంగానే భక్తి విశ్వాసాలు విశేషంగా ఉన్నవాళ్ళే రాత్రి పన్నెండింటిదాకా చర్చిల్లో ఉండి క్రిస్మస్ కథలు, పాటలు, ప్రార్థనలతో వేడుకలు జరుపుతారు. 25 న రోజంతా కుటుంబం అందరూ కలిసి ఘనంగా విందులు, వినోదాలలో తేలియాడుతారు. కొందరు ప్రత్యేకంగా ఈ రోజున టర్కీ లేదా గూస్ (ఒక రకమైన బాతు), బీఫ్ లతో చేసిన వంటకాలను తింటారు. 27 నుంచి సెలవు రోజులు కాకపోయినా చాలామంది ఆ వారమంతా కూడా సెలవులు పెట్టుకుంటారు. అప్పటినుంచీ దుకాణాలన్నీ మాత్రం తెరిచే ఉంటాయి.



క్రిస్మస్ సంబరాలు అయిపోయిన వారంలోపే కొత్త సంవత్సర సంబరాలు వచ్చేస్తాయి. క్రిస్మస్ అయిపోయినా అలంకరణ మాత్రం న్యూ ఇయర్ సంబరాలు అయేదాకా అలాగే ఉంటుంది. డిసెంబరు 31 న మధ్యాహ్నం కల్లా అన్నీ షాపులు మూతపడతాయి. మళ్ళీ 2 వ తేదీన తెరుస్తారు. సిల్వెస్టర్ అనే రోమన్ కాథలిక్ సెయింట్ పేరు మీదుగా డిసెంబర్ 31 ని 'సిల్వెస్టర్' అన్న పేరుతో పండుగలా జరుపుకుంటారు. 31 రాత్రి స్నేహితులతో కలిసి ప్రత్యేక విందు భోజనాలు, వినోదాలు ఉంటాయి.

ఈ రోజున ప్రత్యేకంగా ఆడే Bleigießen (Lead pouring) అని ఒక చిన్నపాటి ఆట లాంటి ఆచారం ఒకటుంది. ఒక చిన్న లోహపు ముద్దని ఒక స్పూన్లో తీసుకుని కొవ్వొత్తి వెలుగులో కరిగించి చల్లటి నీళ్ళలో పోస్తారు. అప్పుడు అది దాల్చిన రూపాన్ని, ఆకారాన్ని బట్టి రాబోయే కొత్త సంవత్సరం ఎలా ఉండబోతోంది అని అంచనా వేస్తారు. ఆ కరిగిన ముక్కని కొవ్వొత్తి వెలుగులో ఏర్పరిచే నీడల్ని బట్టి కూడా ఒకోసారి అంచనాకి వస్తారట. ఉదాహరణకి హృదయాకారంలో వస్తే కొత్త సంవత్సరంలో ప్రేమ దొరుకుతుందని,

పువ్వు వస్తే కొత్త స్నేహం దొరుకుతుందని అలాగ కొన్ని నమ్మకాలు ఉన్నాయట. సాధారణంగా దీనికోసం Lead ఉపయోగించినా, మైనం కూడా విరివిగానే వాడతారు.

ఇక్కడ న్యూ ఇయర్ కి మాత్రమే ప్రత్యేకమైనది ఒకటుంది. అదే టపాసులు పేల్చడం. జనవరి ఒకటికి నాలుగు రోజుల ముందు తప్పించి మిగతా సమయాల్లో టపాసులు అమ్మడం ఇక్కడ చట్టవిరుద్ధం. ఈ నాలుగు రోజుల్లోనే అందరూ టపాసులు కొని పెట్టుకుంటారు. సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలకి అందరూ ప్రతీ ఊరిలో ఒక ప్రదేశం దగ్గరికి చేరుకొని టపాసులు కాలుస్తారు. ఒక్క ఆ రోజు తప్ప మిగతా రోజుల్లో టపాసులు కాల్చకూడదన్న నిబంధనతో పాటు 18 ఏళ్ళ లోపు పిల్లలు పెద్ద పెద్ద టపాసులు కాల్చకూడదని కూడా చట్టం ఉంది. అర్ధరాత్రి శాంపేన్ పొంగించడంతోనూ, టపాసుల మెరుపులతోనూ అందరూ ఉత్సాహంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు.

ఆ విధంగా ఈ చలిదేశంలో చల్ల చల్లటి రోజులని ప్రతిరోజూ పండుగలా ఆనందంగా ఆస్వాదిస్తూ గడిచిన ఏడాదంతా పడ్డ శ్రమకి, కష్టానికి వీడ్కోలు చెపుతూ భవిష్యత్తు వైపు ఆశాజనకంగా చూస్తూ హాయిహాయిగా గడిపేస్తారన్నమాట. ఏ దేశం వాడైనా మనిషనే వాడు ఆశాజీవి కదా మరి!

**********

గత పన్నెండు నెలలుగా 'కౌముది' లో 'జర్మనీయం' శీర్షికన నేను చెపుతున్న జర్మనీ కబుర్లు ఈ నెలతో ముగుస్తున్నాయి. జర్మనీ గురించిన నా ఆలోచనలు, అభిప్రాయాలు, జ్ఞాపకాలు కొన్నింటిని మీ అందరితో పంచుకునేందుకు నాకు అవకాశం ఇచ్చిన కౌముది సంపాదకులకి నా హృదయపూర్వక ధన్యవాదాలు. నేను మోసుకొచ్చిన దోసెడు మంచుపూలని, గుప్పెడు ఊసులని సాదరంగా స్వీకరించి అభినందించి ప్రోత్సహించిన పాఠకులందరికీ నా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ...

*FrÖhliche Weihnachten!*

*Viel Freude, GlÜck, Liebe und Gesundheit im neuen Jahr 2014!*